ఆంధ్రప్రభ

Estd. 1938

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:271 • మంగళవారం 15 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati |Kurnool|Anantapur|Nellore



పాఠకులకు,
ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు,
శ్రేయోభిలాషులకు ఆంధ్రప్రభ
సంక్రాంతి శుభాకాంక్షలు.

మంగళవారం మా కార్యాలయానికి సెలవు. బుధవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

- ముత్తా గౌతమ్,
మేనేజింగ్ డైరెక్టర్

ఫిబ్రవరి 5న తొలి విడత?

మాఘమాసంలో మంత్రివర్గం!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వస్తే ఇద్దరూ రండి.. ఒకరు వచ్చి, ఇంకొకరు ఉండి టిడిపి దుకాణం కొనసాగిస్తామంటే కుదరదు. ఇద్దరూ రండి.. మీ భవిష్యత్తుకు మాది భరోసా. అదీ ఈ శాసనసభ సమావేశాల్లో వస్తేనే తీసుకుంటాం. తర్వాత మీరు వస్తానన్న తీసుకోం. అంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు టీఆర్ఎస్ ముఖ్యులు అల్టిమేటం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఆ ఇద్దరిని చేర్చుకుంటే శాసనసభలో టిడిపి లేకుండా పోవడంతో పాటు తెలంగాణలో టిడిపి దుకాణాన్ని పూర్తిగా బంద్ చేయ వచ్చన్న ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు చేరేందుకు ముందుకువచ్చినా వద్దని చెప్పామని, టిడిపి వారికి మాత్రమే ఛాన్స్ ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



జూన్ మొదటివారంలో
రెండో విడత
• విద్యార్హతలు, అభిరుచులు కూడా ఈసారి పరిగణనలోకి..

రెండు విడతలుగా రాష్ట్ర కేబినెట్

పలువార్లు టీఆర్ఎస్ నేతలతో చర్చలు జరిపి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినా, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఇంకా సందిగ్ధంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తొలి అసెంబ్లీ సమావేశాల్లో టిడిపి లేకుండా టీఆర్ఎస్‌లో విలీనమైతే ఒక సంపూర్ణలక్ష్యం నెరవేరుతుంది కాబట్టి ఆ మేరకు వారికి తగిన రీతిలో అవకాశాలు కల్పిస్తామని, ఇపుడు రాకుంటే తర్వాత వస్తామన్నా తమ గేట్లు తెరుచుకోవని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టిడిపి ఎమ్మెల్యేలు తమ అనుచరులతో సంప్రదింపులు కొనసాగిస్తుండగా, అసెంబ్లీ సమావేశాల నాటికి చేరుతారా లేదా స్పష్టతరానుంది. తాజా ఎన్నికల్లో టీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యతతో 88సీట్లు సాధించగా, ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు

➪ 3వ పేజీలో...

స్పీకర్ ఎవరు?

• నేడో రేపో స్పష్టత
• రేపు ప్రొటెం స్పీకర్ ప్రమాణం
• ఎల్లుండి నుంచి అసెంబ్లీ

3



కన్హయ్యపై దేశద్రోహం కేసు

• 1200 పేజీలతో చార్జిషీట్..
మొత్తం 36 మంది విద్యార్థులపై కేసులు

10 లో

ఆపరేషన్ కమల్ ?

• కర్నాటకలో హై డ్రామా • కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు బీజేపీ గాలం • ముంబైలో ముగ్గురితో బేరసారాలు • ధ్రువీకరించిన కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ • ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర అంటూ ఆరోపణ • సిద్ధరామయ్య నేతృత్వంలో సీనియర్ల భేటీ • ఆ ముగ్గురూ నాతో టచ్‌లో ఉన్నారు : సీఎం కుమారస్వామి • సంక్రాంతి తర్వాత కొత్త ప్రభుత్వం : బీజేపీ వర్గాల వ్యాఖ్య • రిసార్ట్‌కు బీజేపీ ఎమ్మెల్యేల తరలింపు?.. వేడెక్కుతున్న రాజకీయం • వరుస పరిణామాలపై సర్వత్రా ఉత్కంఠ.. ఆ మూడు పార్టీల్లో గుబులు

5 లో

• గోదావరి జిల్లాల్లో తిష్టవేసిన సెలబ్రిటీస్

కత్తులు దూసిన కోళ్లు చేతులు మారిన కోట్లు



2 లో

రెండు చిరుతలు మృత్యువాత



మాక్లూర్ అడవుల్లో చిరుత కళేబరం

8 లో

• మాక్లూర్ అడవుల్లో వేటగాళ్ల ఉచ్చులోపడి ఒకటి మృతి
• మంచిర్యాల జిల్లాలో మరో కళేబరం లభ్యం
• రెండు రోజుల్లో వరుస సంఘటనలు
• మరో కేసులో నిందితులను పట్టించిన జాగిలాలు, పులిచర్మం, గోళ్లు స్వాధీనం

వస్తే ఇప్పుడే రండి





• తరువాత తలుపులు మూసేస్తాం • అసెంబ్లీ సమావేశాల్లోగా తేల్చండి
• ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలకు తెరాస స్పష్టీకరణ • కాంగ్రెస్ నుంచి వలసలకు నో

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వస్తే ఇద్దరూ రండి.. ఒకరు వచ్చి, ఇంకొకరు ఉండి టీడీపీ దుకాణం కొనసాగిస్తామంటే కుదరదు. ఇద్దరూ రండి.. మీ భవిష్యత్తుకు మాది భరోసా. అదీ ఈ శాసనసభ సమావేశాల్లో వస్తేనే తీసుకుంటాం. తర్వాత మీరు వస్తానన్న తీసుకోం. అంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు టీఆర్ఎస్ ముఖ్యులు అల్టిమేటం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఆ ఇద్దరిని చేర్చుకుంటే శాసనసభలో టీడీపీ లేకుండా పోవడంతో పాటు తెలంగాణలో టీడీపీ దుకాణాన్ని పూర్తిగా బంద్ చేయవచ్చన్న ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు చేరేందుకు ముందుకు వచ్చినా వద్దని చెప్పామని, టీడీపీ వారికి మాత్రమే ఛాన్స్ ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పలువార్లు టీఆర్ఎస్ నేతలతో చర్చలు జరిపి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినా, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఇంకా

➪ 8వ పేజీలో...



ఐర్లాండ్ టు ఎడపల్లి

• విదేశాల్లో ఉద్యోగం వదిలి రాజకీయ అరంగేట్రం
• సర్పంచ్ బరిలో నిలిచిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుస్మిత
• జన్మభూమిపై మమకారం.. తండ్రి స్ఫూర్తే కారణం
• రిజర్వేషన్ కలిసి రావడంతో పోటీకి సై

నిజామాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : విదేశాల్లో ఉద్యోగం.. మంచి జీతం.. విలాసవంతమైన సౌకర్యాలు.. సాఫీగా సాగిపోతున్న జీవితాన్ని వద్దనుకుని రాజకీయ రొచ్చులో అడుగుపెడతామంటే ఎవరైనా ఏమంటారు... వద్దుగాక వద్దనేగా అంటారు. ఐర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న పాతికేళ్ల సుస్మిత నాయుడు అవన్నీ వదిలేసి... తను పుట్టిపెరిగిన చోట రాజకీయ అరంగేట్రం చేస్తామంటే...అందరూ అదే అన్నారు... వద్దుగాక వద్దని. తల్లిదండ్రులు, అక్కాచెల్లి,

➪ 3వ పేజీలో...



నేటి నుంచే కుంభమేళా

అలహాబాద్‌లో కుంభమేళా సందర్భంగా గంగానది ఒడ్డున ఏర్పాటైన శిబిరాలు

9 లో

లాభసాటిగా వ్యవసాయం.. తెలంగాణ నుంచే శ్రీకారం

• అందుకు వీలుగా సీఎం కేసీఆర్ కొత్త ఆలోచన
• అన్నదాతలకు అండగా అగ్రి ఎక్స్‌పోర్ట్ కార్పొరేషన్

వివరాలు 3లో...



10 లో

ప్రధాని మోడీకి ఫిలిప్ కొట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డు

• దేశ అసాధారణ పురోగతికి నిస్వార్థ సేవలకు గుర్తింపుగా పురస్కారం

శబరిమలలో మకరజ్యోతి దర్శనం

• పోటెత్తిన భక్తజన సందోహం

వివరాలు 9లో...



శబరిమలలో మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప భక్తుల కోలాహలం



చిత్తూరు జిల్లా హెరిటేజ్‌లో జరిగిన భోగి ఉత్సవాల్లో పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు

బాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరుతాం

తెలంగాణ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తప్పకుండా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరుతారని మాజీ మంత్రి, తెలంగాణ టీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. మూలపాడులో యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన సోమవారం ఉదయం ఇబ్రహీంపట్నం నుంచి ర్యాలీగా బయలు దేరి వచ్చి, బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా గుడి ఈవో కోటేశ్వరమ్మ తలసాని కి అమ్మవారి క్యాలెండర్‌ను, తీర్ధ ప్రసాదాలను అందజేశా రు. అనంతరం ఆయన కొద్ది సేపు విలేకరులతో మాట్లాడా రు. చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేందుకు కేసీఆర్ సిద్ధమవుతున్నారని అన్నారు. తాము ఇచ్చే గిఫ్ట్‌ప్రభావం ఎంతుంటుందో త్వరలోనే అందరూ చూస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పనితీరు ఆశాజనకంగా లేదన్నారు. హైటెక్ సిటీతో పాటు హైదరాబాద్ అంతా తానే కట్టానని చంద్రబాబు చెప్పుకుంటున్నారని విమర్శించారు. తాము కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ లేని ఫెడరల్ ఫ్రంట్ కోరుకుంటున్నామని తెలిపారు.

కేసీఆర్ ప్రభుత్వం రూ.5వేల కోట్లతో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, ఏపీలో కూడా ఏర్పాటు చేసి,యాదవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రజలు చంద్రబాబుకు వ్యతిరేకంగా ఉన్నారని, ప్రచారానికి పరిమితమైన నాయకుడని విమర్శించారు. ప్రజల సొమ్ముతో ప్రచారాలు చేసుకున్నంత మాత్రాన వాస్తవాలను దాచలేరన్నారు. ఏపీలో కుల రాజకీయాలకు కారణం చంద్రబాబేనని ఆరోపించారు.

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ నవ మి రా.7.35 వరకు అనంతరం దశమి; నక్షత్రం: అశ్వని ఉ.9.32 వరకు అనంతరం భరణి; అమృత కాలం: రా.తె. 5.20...; వర్జ్యం: శే.ఉ. 7.02 వరకు... రా.7.08 నుండి 8.44 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు, రా.10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు; సంక్రాంతి పండుగ

ఔరా..!



కత్తి దూసిన కోడి



- చేతులు మారిన కోట్ల రూపాయలు
- గోదావరి జిల్లాల్లో తిష్టవేసిన సెలబ్రిటీస్



కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: కోడి కత్తిదూసింది. గోదావరి జిల్లాల్ని నెత్తుటి మరకలు అంటుకున్నాయి. సంక్రాంతి సంబరాలు కోడిపందాల సాక్షిగా మొదలయ్యాయి. సోమవారం మొదటిరోజే గోదావరి జిల్లాల్లో 50 నుంచి 70 కోట్ల రూపాయల వరకు కోడిపందాలపై బెట్టింగ్‌లు జరిగాయి. ఈసారి పార్టీల వారీగా బరులు ఏర్పాటు చేసుకున్నారు. ఏ పార్టీకి చెందిన వ్యక్తులు ఆ పార్టీ బరిలోనే పందాలు కాశారు. అక్కడే పుంజుల్ని పోటీకి పెట్టారు. గోదావరి జిల్లాలు వీఐపీల పర్యటనలతో కళకళలాడుతున్నాయి. గ్రామాల్లోకి అత్యంత విలువైన కార్లు వచ్చి రయ్.. రయ్‌మని దూసుకుపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనప్రాయంగా పందాలకు అనుమతులు ఇచ్చేశారు. అయితే కత్తులు కట్టొద్దన్నారు. బెట్టింగ్‌లు వేయెద్దన్నారు. సంప్రదాయాన్ని మాత్రం పరిరక్షించమన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని పందెం రాయుళ్ళు రెచ్చిపోయారు. ఆదివారం సాయంత్రం వరకు అసలు పందాలు ఉంటాయా ఉండవా అన్న మీమాంశ ఉండేది. అలాంటిది సోమవారం ఉదయానికి కోడిపుంజుల బరులతో నిండిపోయాయి. ఫ్లడ్‌లైట్‌ల కాంతులతో రాత్రిపూట కూడా నిరాటంకంగా పందాలకు ఏర్పాట్లు జరిగాయి. భీమవరం మండలం పెదగరువు గ్రామానికి తెలంగాణ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, కృష్ణారావులొచ్చి పందాల్లో పాల్గొన్నారు. భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, ఐ భీమవరం, ఆకివీడు, ఉండిల చుట్టూ వేలాది బరులు ఏర్పాటయ్యాయి. తొలిరోజే వేల సంఖ్యలో కోళ్ళు తమ ప్రతాపాన్ని ప్రదర్శించాయి. తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం, కాట్రేనికోన, గెద్దనాపల్లి, పెద్దాపురం, కోరుకొండ, తుని, గొర్రిపూడి ప్రాంతాల్లోనూ పెద్దెత్తున బరులు సిద్ధమయ్యాయి. సంక్రాంతి సంబరాల్లో తొలిరోజు పందాలు నిరాటంకంగా సాగాయి. పోలీసులు కూడా చూసీచూడనట్లు వదిలేశారు. మంగళ, బుధవారాల్లో ఇవి మరింత విస్తృతమయ్యే అవకాశాలున్నాయి.

ఢిల్లీ, ముంబైల నుంచి కూడా ఈసారి కోడిపందాల్లో పాల్గొనేందుకు కొందరు ప్రముఖులు వస్తున్నట్లు బోగట్టా. రానున్న రెండ్రోజుల్లో ఒక్క గోదావరి జిల్లాల్లోనే మరో వంద కోట్లకుపైగా పందాలు జరిగే అవకాశాలున్నట్లు పరిశీలకులు అంచనాలేస్తున్నారు.







కోస కోసం పోటాపోటీ



యుద్ధంలో గెలిచినా ఓడినా వీరుడు వీరుడే.. అయితే ఇది మనుషులకే కాదు కోళ్లకు ఇది వర్తిస్తుందంటున్నారు గోదావరి జిల్లాలోని పందెంరాయుయుళ్లు.. కదనరంగంలో కత్తులు దూసే కోళ్లు ఓడినా వాటి పౌరుషానికి ఉండే గిరాకీ మాత్రం తగ్గదంటున్నారు. ఓడిన కోడిని కొనాలన్నా ఇక్కడ క్యూలు కట్టాల్సిందే అని చెబుతున్నారు. ఇదంతా దేనికో అనుకుంటున్నారా మీరే చదవండి..

గోదావరి జిల్లాల్లో మాంసాహార ప్రియులకు లోటే లేదు. విశాలమై సముద్ర తీరప్రాంతం ఉండటంతో. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా అనేక రకాల వంటకాలను ఇక్కడి వారు రుచిచూపిస్తారు. ఇంటికి వచ్చే వారికి కొసరి కొసరి వడ్డించి తమ ప్రాంతరుచులను పరిచయం చేస్తూ అతిథిమర్యాదలు చేస్తుంటారు. అందుకే ఒక్కో సీజన్‌కు ఒక్కో రకమైన వంటకం ఇక్కడ ప్రసిద్ధి కాంచింది. పుస్తులమ్మైనా పులస తినాలనే నాడుడి పుట్టుకొచ్చింది. ఇప్పుడు పులస సీజన్ పోయి కొసర సీజన్ వచ్చింది.. కదనరంగంలో కత్తి కట్టి నెత్తురోడి ఓడిన కోడినే కోసగా ఇక్కడి వారు పిలుస్తుంటారు, ఇలా ఓడిన కోడిని తమ ఇంటికి తీసుకువెళితే అగౌరవ ప్రతిష్టలే వేరంటారు. కోడిపందాలు లేని సంక్రాంతిని ఊహించలేమంటారు. అందుకనే ప్రతి ఏడాది ఎన్ని ఆంక్షలు విధించినా ఇక్కడ మాత్రం కోడిపందాల జోరు మాత్రం తగ్గదు... గెలిచిన కోడి వచ్చే ఏడాది పందానికి రెడీ అయితే ఓడిన కోడి మాత్రం ఆరోజు గెలిచిన వారి ఇంటిలో కూర అయిపోతుంది. దీంతో ఇక్కడ ఓడిన కోడికి యమగిరాకి ఉంటుంది. ప్రతి సంక్రాంతికి ఇంటికి వచ్చే కొత్త అల్లుళ్లకు ఇక్కడి వారు ఎంత ఖరీదైనా సరే కోస కోడి వండిపెట్టాల్సిందే. కోడిపందెం గెలిచిన ప్రతి ఇంటిలోను ఈ కోడి కూర ఉండి తీరాల్సిందే. అన్నట్లు ఈసారి కోస కోళ్లు సంఖ్య పెరగినా డిమాండ్ మాత్రం తగ్గలేదు. కోస కోడి కోసం జనాలు క్యూలు కట్టడంతో రేటు, కోడిని బట్టి కేజీ 10 వేల నుండి 20 వేలకు పైగా పలికింది. అసలు కోస కోడికి ఉండే రుచే వేరంటారు ఇక్కడివారు, పందెం కోసం బాదం, జీడీపప్పు, కర్జూరం ఇతర పుష్టికరమైన ఆహారం పెట్టి వాటిని సిద్ధం చేయడంతో వాటికి ఉండే రుచే వేరుగా ఉంటుందంటారు. ఇలా కోడి ఓడగానే మాములు కోళ్లలా కాకుండా అప్పటి కప్పుడు వాటిని మంటల్లో కాల్చి కూరకు సిద్ధం చేస్తారు.

అయితే ఎంకి పెళ్లి సుబ్బిచావు కొచ్చిందన్న చందాన ఈకోస కోడి ప్రభావం మాములు కోళ్లపైనా పడింది. ఈసారి గోదావరి జిల్లాల్లో కోడి పందాలు యమ జోరుగా సాగడంతో దీని ప్రభావం చికెన్ అమ్మ కాలపై పడింది. సాధారణంగా కనుమ రోజు కోడి కూర తినాలనే సాంప్రదాయం ఇక్కడ ఉండటంతో కోస మాసం కోసం జనాలు పల్లెబాట పట్టడంతో మాములు కోళ్లకు గిరాకీ తగ్గిపోయింది. దీంతో సాధారణ స్థాయిలో ను అమ్మకాలు లేక ఇక్కడి వ్యాపారు లు కోడి పందాలపై యమ గుర్రుగా ఉన్నారు.

ఎన్నికల వేళ.. తిరుగులేని పందాలు

ప్రభుత్వ నిబంధనలు ఎన్ని విధించినా సంక్రాంతి కోడికి కత్తి కట్టి పందాలు వేయడం సర్వసాధారణం. అలాంటిది ఎన్నికల వేళ ఈ పందాలకు అడ్డేముంటుంది? గోదావరి జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా భోగిపండుగైన సోమవారం కోడిపందాలు ఎక్కడికక్కడ ప్రారంభమయ్యాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు ఇతర అధికార ప్రజాప్రతినిధులు ఈ కోడిపందాల బరులను ఎప్పటిలాగానే ప్రారంభించారు. మిగిలిన పండగల మాట ఎలాగున్నా సంక్రాంతి పండక్కి కోడిపందాల సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా దేదీప్యమానంగా కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కోర్టు వివాదాలు లేకపోవడంతోపాటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికారపార్టీ వారంతా ఈ కోడిపందాల నిర్వహణకు మార్గం సుగమం చేసారు. మరికొద్దిరోజుల్లో ఎన్నికలు జరుగుతున్నందున ఈ కోడిపందాలను అడ్డుకుంటే ఆ ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడుతుందనే ఉద్దేశ్యంతో అధికారులెవరూ వాటి జోలికెళ్ళద్దంటూ అనధికార ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీంతో ప్రతీఏటా మూడురోజులు జరిగే ఈ కోడిపందాలు ఐదురోజులకు పెంచాలని స్థానికులు నాయకులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఇరవైనాలుగు గంటలూ కోడిపందాల నిర్వహణకు అనువుగా ఏర్పాట్లు చేసారు. డ్రోన్‌కెమెరాలు, ఎల్‌సీడీ, భారీ స్క్రీన్‌లతో ఈ కోడిపందాల ప్రాంతాలన్నీ అద్భుతంగా తీర్చిదిద్దారు. సినీ, రాజకీయ ప్రముఖులంతా ఈ కోడిపందాలను తిలకించడానికి తరలివచ్చారు. మూడురోజులు ఇక్కడే ఉండేవిధంగా హోటల్స్, అతిథిగృహాలను ముందుగానే బుక్‌చేసుకున్నారు. కోట్లాదిరూపాయలు చేతులు మారుతున్నా సంక్రాంతి మజా అంటే ఇలాగే ఉండాలన్న కసితో అనేకమంది ఈ కోడిపందాల బరిలో నిల్చున్నారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న ఈ కోడిపందాల నిర్వహణకు గుండాట, పేకాట వంటి ఆర్థిక వనరులిచ్చే ఏర్పాట్లు చేసుకున్నారు. నెలల తరబడి ఖరీదైన పెంపకంతో పెరిగిన వేలాది రూపాయల విలువైన కోళ్ళు ఈ పందాల బరిలో ప్రాణాలు కోల్పోతున్నాయి. అయితే ఇవి బతికినా, చనిపోయినా డిమాండే. పందెం బరిలో చనిపోయిన కోళ్ళకు కూడా వేలాది రూపాయల ధర పలకడం విశేషం. బాదం, పిస్తా వంటి ఆహారంతో పెరిగిన ఈ కోడిమాంసం రుచి చూసేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు ఆసక్తి చూపుతారు. అందుకనే వీటికి అంత డిమాండ్ ఉంటుంది. ఈ పందాల నిర్వహణలో అధికారులకు మామూళ్ళు ఇవ్వకపోయినా ఈ పందెంలో చనిపోయిన కోళ్ళు(కోసలు) ఇస్తే పరమానందం పొందే అధికారులెందరో ఉంటారు. భోగినాడు ఎలాంటి అవాంతరాలు జరగకుండా సాగిన ఈ కోడిపందాలు సంక్రాంతి వేడుకలు పూర్తయ్యేవరకు ఇలాగే కొనసాగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈసారి ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కోళ్ళ కాళ్ళకు కత్తులు కట్టకుండా సంక్రాంతి సంబరాలను కొనసాగించాలని ప్రకటించిన సంగతి తెలిసిందే. పందాల కంటూ అనుమతులిచ్చాక కాళ్ళకు కత్తులున్నాయా లేదా అనేది తనిఖీలు చేసేవారు ఎవరుంటారు? ఇక్కడ అదే జరుగుతోంది. సంప్రదాయం పేరుతో కోట్ల రూపాయలు పందాలు జరుగుతున్నాయి. డబ్బుంటే లెక్కలేని ఆర్థిక స్థితిమంతుల మాట ఎలాగున్నా సామాన్య పేదప్రజలు మాత్రం కోడిపందాల పేరుతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందనడంలో సందేహం లేదు.



తెలుగు లోగిళ్లలో సంబరాలు

పరికిణీలతో తెలుగింటి ఆడపడుచుల వాకిళ్ళలో పరిచే ముగ్గులు చెబుతాయి.. తెలుగుదనాల సంక్రాంతి శోభ ఏంటో.. ముగ్గులపై నిలిచిన గొబ్బెమ్మలు చెబుతాయి.. నిండుదనాల పండుగ ప్రత్యేకత ఎంతో.. అవును.. తెలుగువారి ప్రాధాన్యాన్ని వివరిస్తూ తెలుగువాణిని ప్రతి ఒక్కరికీ వినిపిస్తూ సాగే సరదాల పండుగ సంక్రాంతి. తెలుగువారి పండుగగా ప్రఖ్యాతిగాంచిన ఈ పండుగ పట్టణాల మాట ఎలాగున్నా పల్లెల్లో సోమవారం నుంచి భోగి ద్వారా మొదలైంది. పేద గొప్ప అనే తేడా లేకుండా ప్రతీఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వాములైపోయారు. ఆధ్యాత్మికతోనే కాక ఆరోగ్యాన్ని దాచి ఉంచిన ఈ పెద్దపండుగ వేడుకలకు దేశవిదేశాల్లో ఉన్నవారు సైతం తరలివచ్చి పాల్గొన్నారు. కొందరు పూర్వవిద్యార్థుల సమ్మేళనమంటూ బాల్యం నుంచీ అక్షరాలు దిద్దిన బడుల్లో ఏకమై గత స్మృతులను నెమరువేసుకుంటూ సందడి చేస్తున్నారు. మరికొందరైతే మూడు నాలుగు తరాల కుటుంబీకులంతా ఒకచోటకు చేరి బంధుత్వాలను పటిష్టపర్చుకుంటున్నారు. మొత్తానికి ఈ సంక్రాంతి పండుగ ద్వారా పురుటిగడ్డ మట్టివాసన చవి చూస్తున్నారు. తొలిరోజైన భోగి నాడే ఈ సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఓపక్క దేవాలయాల్లో పూజలు చేసూనే మరోపక్క అవధుల్లేని ఆనందాన్ని పొందుతూ ఈ సంక్రాంతి వేడుకల్లో ఎవరికి వారు తలమునకలై ఉన్నారు. పల్లెల్లో ఏ మారుమూలలకెళ్ళినా నేతితో తయారుచేసిన సున్నుండలు, అరిసెలు, పోకుండలు, జంతికలు, కజ్జికాయలు, బొబ్బట్లు, పూతరేకులు, గోరుమిటీలు వంటి సంప్రదాయ వంటకాల ఘుమఘుమలు ప్రతిఒక్కరినీ నోరూరిస్తున్నాయి. మళ్ళీ మళ్ళీ సంక్రాంతి రావాల ని ఆహ్వానిస్తున్నాయి. కొత్త అల్లుళ్ళ సందడితో తెలుగు లోగిళ్ళన్నీ కళకళలాడిపోతు న్నాయి. కనుమరుగైపోతు న్నాయని బెంగ పెట్టుకుంటున్న సంప్రదాయాలన్నీ కళ్లెదుట కనువిందు చేస్తున్నాయి. నేడు సంక్రాంతి, బుధవారం కను, గురువారం ముక్కనుమ పండుగలు కీలక పాత్ర పోషించనున్నాయి.



ఐర్లాండ్ టు ఎడపల్లి



నామినేషన్ వేస్తున్న సర్పంచ్ అభ్యర్థి సుస్మిత

(మొదటిపేజీ తరువాయి)

అన్నదమ్ములు.. బంధువర్గం అంతా ఒక్కటై చెప్పారు రాజకీయాలు వద్దని... కానీ ఆమె వినలేదు.. ఉద్యోగం వదిలేసి.. సొంత ఊరికి వచ్చేసి పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ బరిలో దిగి... నామినేషన్ వేయడంతో అంతా అవాక్కయ్యారు. సెభాష్ అంటున్నారు. ఇదంతా నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలో సంచలనంగా మారింది. కన్న ఊరికి సేవ చేయాలన్న కోరిక... కన్నతండ్రి స్ఫూర్తితో రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన... కలిసొచ్చిన రిజర్వేషన్...ఇంకేముంది... పంచాయతీ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తోంది. రాజకీయాల్లోకి వద్దన్న అందరినీ ఒప్పించి మరీ నామినేషన్ వేసింది. మేజర్ గ్రామ పంచాయతీ ఎడపల్లి సర్పంచ్ బరిలో నిలిచిన 24 ఏళ్ళ యువతి సుస్మితను ఆంధ్రప్రభ పలుకరించింది. రాజకీయాల్లోకి రావాలన్న ఆసక్తి, భవిష్యత్ ఆలోచనలపై విషయాలపై ఆమె మాటల్లోనే.

నాన్నే ఆదర్శం: చిన్నప్పటి నుంచి నాన్న శంకర్ నాయక్ ఉదర్శం. నిత్యం ప్రజాసేవలో ఉండే నాన్న ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి కోసం ప్రజలతో మమేకమైన తీరు రాజకీయాలపై ఆసక్తిని పెంచింది. అయితే ఇంత తొందరగా రాజకీయాల్లోకి వస్తానను కోలేదు. ఎడపల్లి మేజర్ గ్రామ పంచాయతీ రిజర్వేషన్ బీసీ మహిళకావ డంతో కలిసొచ్చింది. ఇక్కడే పుట్టి పెరిగిన ఊరును ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న నా ఆలోచనకు అవకాశం దక్కింది. అందుకే ఐర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ సిరిస ఉద్యోగాన్ని వదిలేసి పోటీలో నిలిచాను. 30 ఏళ్ళుగా నాన్న రాజకీయాల్లో ఉన్న ప్పటికీ నన్ను రాజకీయాల్లోకి రావద్దని వారించారు. నామినేషన్ వేసిన రోజే ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి ఆనందం వేసింది. ప్రజా ఆశీర్వాదంతో గెలుపొంది ఎడపల్లిని సుందర గ్రామంగా తీర్చిదిద్ది ప్రజాసేవలో తరలించాలనుంది.

ఉద్యోగం ఎప్పుడైనా చేయొచ్చు: హైదరాబాద్ అరోర కాలేజీలో బీటెక్ పూర్తి చేసి, ఐర్లాండ్‌లో ఎంఎస్ 2016లో పూర్తి చేశాను. 2017లో మంచి సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ఉద్యోగంలో చేరాను. కానీ గ్రామానికి సేవ చేయాలన్న సంకల్పం నాలో ఉండేది. ఇప్పుడు అవకాశం వచ్చింది. ప్రజాసేవలో ఉన్న తృప్తి ఉద్యోగంలో ఉండదు. డబ్బు సంపాదించ చాలన్న ఆశ ఏనాడు లేదు. అందుకే రాజకీయాల్లో ఉండడం, అమ్మ ప్రభుత్వ ఉద్యోగి కావడంతో బాధలుండలేవు. అందుకే ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవాలని భావించి సర్పంచ్ పోటీ చేస్తున్నాను.

రాజకీయ వారసత్వం: సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవకు అంకితమైన నాన్న శంకర్‌నాయక్ నాకు స్ఫూర్తి. రెండుసార్లు ఎడపల్లి సర్పంచ్‌గా 1995, 2013లో పని చేశారు. 2001 నుంచి 2005 వరకు ఎడపల్లి ఎంపీటీసీగా సేవలందించారు. బోధన్ ఫ్యాక్టరీ షుగర్‌కేన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం పని చేశారు. ఇలా అనేక ఏళ్ళు ప్రజా జీవితంలో ఉన్న నాన్నను గమనించి రాజకీయాల్లోకి రావాలన్న స్ఫూర్తి కలిగింది. చిన్నప్పటి నుంచి ఊళ్లో కలివిడిగా ప్రజల మధ్య తిరిగిన తనను గ్రాముస్థులు గుర్తించి పేరు పెట్టి పిలిచి దీవిస్తున్న తీరుతో నా మనస్సు ఉప్పొంగిపోతుంది. ప్రజల అవసరాలు తీర్చగలిగితే ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారనే భావన ప్రచారంలో తెలుస్తోంది.

స్వచ్ఛ ఎడపల్లిగా మారుస్తా: విదేశాల్లో చదివే అవకాశం రావడంతో అక్కడి వాతావరణ పరిస్థితులు తెలుసుకోగలిగా. గ్రామంలో పుట్టి పెరిగాను కాబట్టి ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. స్వచ్ఛ ఎడపల్లిగా మార్చి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతా. ప్రజా ఆరోగ్యంతో పాటు యువతను విద్య, ఉద్యోగాల వైపు తీసుకెళ్లడానికి శక్తి వంచన లేకుండా పని చేస్తా. మౌళిక సదుపాయాల కల్పనతో పారిశుద్ధ్య సమస్యను పూర్తిగా రూపుమాపే విధంగా కార్యాచరణ ఆలోచన ఉంది. ప్రభుత్వ పథకాలన్నింటిని అర్హులైన ప్రతి ఒక్కరికి అందించి పూర్తి స్థాయిలో ప్రజాసేవలో తరలించాలన్న లక్ష్యం ఉంది. నా ఆలోచనలను రూపుదాల్చేందుకు ప్రజలు ఆశీర్వదించాలని యువ ఇంజనీర్ సుస్మిత అభ్యర్థించారు.

స్పీకర్ ఎవరు?



- నేడో, రేపో స్పష్టత
- అధినేత నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి
- రేపు ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం
- ఎల్లుండి నుండి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా ఎవరు కాబోతున్నారు? అధినేత కేసీఆర్ మనసులో ఏముంది? గత సంప్రదాయాన్ని కొనసాగిస్తూ బీసీకి పట్టం కడతారా? సీనియారిటీకి పట్టంకడుతూ సామాజిక సమీకరణాలు పక్కన బెడతారా? తొలిసారి మహిళకు అరుదైన అవకాశమిస్తారా? ఇప్పటివరకు అవకాశం లభించని వర్గాలకు ఛాన్స్ దక్కుతుందా? మరికొన్ని గంటల్లో ఈ ప్రశ్నలకు సమాధానం లభించనుంది. గురువారం నుండి రెండవ శాసనసభ సమావేశాలు ప్రారంభం కానుండగా, ప్రొటెం‌స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్ బుధవారం సాయంత్రమే బాధ్యతలు తీసుకోనున్నారు. ఇక స్పీకర్ ఎన్నిక, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక శుక్రవారం జరగనుంది. గత నెలరోజులుగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవికి అనేకపేర్లు పరిశీలనలు రాగా అసలు సభాపతి పీఠాన్ని అధిష్టించేదెవరో.. ఆ దిక్కులెవ్వరిదేమో మరి కొద్దిగంటల్లో తేలిపోతుంది. నేడో,రేపో ఈ అంశంపై సీఎం స్పష్టతను ఇస్తారని టీఆర్‌ఎస్ వర్గాలు అంచనావేస్తున్నాయి. గురువారం ప్రొటెం స్పీకర్ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించనుండగా, అదే రోజు స్పీకర్‌డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్ రానుంది. శుక్రవారం ఉదయం స్పీకర్ ఎన్నిక లాంఛనంగా జరగనుంది.

పరిశీలనలో ఉన్నవారితో చర్చించిన సీఎం

ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే స్పీకర్ పదవికి తన మనసులో ఉన్నవారితో చర్చించారు. వారికి సంకేతాలు ఇచ్చి.. ఆ విషయం బయట ఎవరికీ చెప్పొద్దని చెప్పినట్లు తెలుస్తోంది. సహజంగా సీఎం పదవుల ఎంపిక ఇలానే జరుగుతుందని టీఆర్‌ఎస్ ముఖ్యులు చెబుతున్నారు. స్పీకర్ పదవికి సంబంధించి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే, మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పేరు తొలుత ప్రముఖంగా వినిపించింది. దీంతో ఉలిక్కిపడ్డ ఆయన తర్వాత సీఎం కేసీఆర్‌ను, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసినట్లు సమాచారం. నిర్ణయం తనకు వదిలేయాలని, నీ రాజకీయ భవిష్యత్తును నేను చూసుకుంటానని సీఎం ఈ సందర్భంగా అభయమిచ్చినట్లు చెబుతున్నారు. ఇదే క్రమంలో నిజామాబాద్ జిల్లా బాన్స్‌వాడ ఎమ్మెల్యే, మాజీ వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేరును పరిశీలించినట్లు ప్రచారం జరిగింది. ఆయనను ప్రగతిభవన్ పిలిపించి చూసి మాట్లాడినట్లు సమాచారం. ఇక మహిళకు ఇవ్వాలనుకుంటే మెదక్ ఎమ్మెల్యే మాజీ డిప్యూటీస్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డికి అవకాశం దక్కుతుందని, ఇప్పటికే సీఎం ఆమెతో కూడా పిలిపించి మాట్లాడినట్లు టీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఆదిలాబాద్‌కు ఇంతవరకు స్పీకర్ అవకాశం దక్కకపోగా, చట్టం,ఇతరభాషలపై పట్టున్న నిర్మల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేరు కూడా వినబడుతోంది. గతంలో ఉమ్మడివరంగల్ జిల్లాకు చెందిన సిరికొండ మధు సూధనాచారికి అవకాశం దక్కగా, అదే జిల్లాకు చెందిన డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పేరు కూడా వినబడుతోంది. ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్‌కు గత క్యాబినెట్‌లోనే పదవి దక్కుతుందని ప్రచారం జరగ్గా, వివిధ సమీకరణల రీత్యా సాధ్యం కాలేదు. ఈసారి ప్రమోషన్‌కు అవకాశం ఉందని, అనూహ్య పరిణామాలు సంభవిస్తే స్పీకర్ లేదా డిప్యూటీస్పీకర్ పదవికి ఆయనను పరిశీలించవచ్చని చెబుతున్నారు. బీసీలేదా ఎస్సీ,ఎస్టీలలో ఒకరికి స్పీకర్ పదవి లభిస్తే డిప్యూటీస్పీకర్ పదవిరెడ్డి సామాజికవర్గానికి లభిస్తుందని, ఒకవేళ పోచారం, ఐకెర్,పద్మాదేవేందర్‌రెడ్డిలలో ఒకరికి పదవిలభిస్తే బీసీ లేదా ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలలో ఒకరికి డిప్యూటీస్పీకర్ పదవి లభిస్తుందని విశ్లేషణలు జరుగుతున్నాయి. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు ఎంపికయ్యే నేతల ఆధారంగా ఆయా జిల్లాల్లో మంత్రిపదవులు ఆశిస్తున్న నేతల జాతకాలపై కూడా స్పష్టత వస్తుందని అంచనా వేస్తున్నారు. సమావేశాలకు సమయం ఆసన్నమవడంతో పేర్లు వినిపిస్తున్న నేతల్లో ఉత్కంఠ కనబడుతోంది.





అసెంబ్లీ సమావేశాలకు పటిష్ట బందోబస్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర సాసనసభ సమావేశాలకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం రెండవసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి సమావేశాలు ఈ నెల 17 నుంచి జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సమా వేశాలకు సుమారు 1200 సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

బందోబస్తు, నిర్వహణపై మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ సోమవారం పోలీసు ఉన్నతాధి కారులతో సమావేశం నిర్వహించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకువమార్, రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ ఎం భగవత్ తదితరులు హాజరైన సమావేశంలో బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు.

కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండటంతో పాటు అసెంబ్లీ పరిసర ప్రాంతాలలోనూ సూచికలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మీడియా పాయింట్‌తో పాటు అసెంబ్లీ ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు వీలుగా ఏర్పాట్లను చేయాలని సమావేశం ఖరారు చేసింది. ప్రోటెం స్పీకర్ ఎన్నిక, నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నికతో పాటు గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానంతో సమావేశాలు ముగియను న్నాయి. సమావేశాలు 17న ప్రారంభమై 20 వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో నాలుగు రోజులు అసెంబ్లీ పరిసరాలలో ఆంక్షలను కూడా విధించనున్నారు.

1200 మందితో బందోబస్తు

అసెంబ్లీ సమావేశాల కోసం 1200 మందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సమావేశానంతరం హైదరాబాద్ సీపీ అంజనీకువమార్ మీడియాకు తెలిపారు. అసెంబ్లీతో పాటు పరిసర ప్రాంతాలలోనూ పోలీసు పికెట్లను ఏర్పాటు చేసున్నామని, సీసీ కెమెరాలను కూడా పరిశీలించడం జరుగుతుందన్నారు. సమావేశాలు జరుగుతున్న రోజులలో అసెంబ్లీ పరిసర ప్రాంతాలలో ఆంక్షలను విధించడం జరిగిందన్నారు.

ఫిబ్రవరి 5న తొలి విడత?

(మొదటిపేజీ తరువాయి)

ఆ తర్వాత గులాబీతీర్థం పుచ్చుకున్నారు. ఆదినుండీ టిడిపిని లక్ష్యంగా చేసుకుని దెబ్బతీసిన టీఆర్‌ఎస్ రాష్ట్రంలో ప్రాతినిధ్యం లేకుండా చేయాలని భావిస్తోంది. టీఆర్‌ఎస్‌లో పదవులకు విపరీతమైన పోటీ ఉన్నా, సమర్ధులైన నాయకులు ఉన్నా.. ఒక్క కారణంతోనే టీఆర్‌ఎస్ ఇద్దరు టీడీపి నేతలకు పదవులు ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ పదవులు లేదా సామాజిక సమీకరణలను బట్టి మరింత ఉన్నతపదవులు ఇస్తామని ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు వస్తామని ఆయా జిల్లాల నేతల ద్వారా వర్తమానాలు పంపుతున్నా టీఆర్‌ఎస్ రెడ్‌సిగ్నల్ వేసినట్లు పార్టీ ముఖ్యులు చెబుతున్నారు. మేం తీసుకుంటామంటే గోడదూకేందుకు మెజారిటీ ఎమ్మెల్యేలు సిద్దంగా ఉన్నారు.. కానీ మాకు అవసరం లేదు.. ఇష్టం లేదు అని టీఆర్‌ఎస్ ముఖ్యనేత ఒకరు చెప్పారు. టిడిపి నేతలు టచ్‌లో ఉన్నారు.. ఇద్దరూ వచ్చి విలీనం చేస్తామంటే కాదనం అని వ్యాఖ్యానించారు. ఈనెల 17నుండి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండగా, 20వ తేదీవరకు ఇవి జరగనున్నాయి. తెలంగాణ రాష్ట్రసమితి వ్యూహాత్మక నిర్ణయం నేపథ్యంలో టిడిపి ఎమ్మెల్యేల అడుగులపై ఉత్కంఠ ఏర్పడింది.

'మీడియాపై ఆంక్షలు లేవు'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రానున్న సమావేశాల నేపథ్యంలో మీడియాపై ఆం క్షలు విధించారన్న వార్తలను అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వేదాంతం నర్సింహాచార్యులు తోసిపుచ్చారు. ప్రతి సమావేశాల సందర్భంగా రోటీన్‌గా విడుదల చేసే మార్గ దర్శకాలను కొన్ని పత్రికలు వార్తగా ప్రచురించాయని పేర్కొన్నారు. వచ్చే సమా వేశాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం శాసనసభలో పోలీసు శాఖ ఉన్నతా ధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో అసెంబ్లీ కార్యదర్శి మాట్లాడారు. మీడియాపై ఆంక్షలు పెడుతున్నట్లు వచ్చిన వార్తలు వాస్తవం కాదని, వాటిని పరిగణనలోకి తీసుకుని సమావేశాల సమయంలో మీడియా ప్రతినిధులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలిగించరాదని కోరారు. రెండవ అసెంబ్లీ మొదటి సమావేశం సందర్భంగా ఎలాంటి ఏర్పాట్లు చేయాలి, పోలీసు బందోబస్తు, డూస్ అండ్ డోంట్స్ తదితర అంశాలపై సమావేశం జరిగింది. సమావేశంలో మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఎస్పీఎఫ్ అదనపు డీజీ తేజ్‌దీప్ కౌర్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేదీ, హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ విశ్వప్రసాద్, అసెంబ్లీ చీఫ్ మార్షల్ కరుణాకర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లాభసాటిగా వ్యవసాయం...
తెలంగాణ నుంచే శ్రీకారం



- అందుకు వీలుగా ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త ఆలోచన
- అన్నదాతలకు అండగా అగ్రి ఎక్స్‌పోర్ట్ కార్పొరేషన్
- కొనుగోళ్ళు, ఉత్పత్తి, ఎగుమతి బాధ్యతలు ఆ సంస్థకే
- రైతుకు రెట్టింపు ఆదాయం కూడా ఇక్కడి నుంచే ఆవిష్కృతం
- కేంద్ర ప్రభుత్వానికి మార్గదర్శిగా తెలంగాణ రాష్ట్రం
- వ్యవసాయం, అనుబంధ రంగాల్లో దార్శనికుడిగా కేసీఆర్





హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతుసంక్షేమ ప్రభుత్వంగా ఇప్పటికే జాతీయస్థాయిలో పేరుప్రఖ్యాతులు సంపాదించుకున్న తెలంగాణ ప్రభుత్వ రథ సారథి కేసీఆర్ త్వరలో మరో కీలక నిర్ణ యం తీసుకోనున్నారు. 2020 నాటికి రైతులకు ప్రస్తుతం వస్తున్న ఆదా యాన్ని రెట్టింపు చేయాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని అంద రికన్నా ముందుగా తెలంగాణలోనే అమలు చేసి చూపించి... కేంద్ర ప్రభుత్వానికే మార్గదర్శిగా ఉండేలా కేసీఆర్ నిర్ణయం ఉండబోతోంది. త్వరలో కొత్తగా మరో ప్రభుత్వరంగ సంస్థను నెలకొల్పి వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్ళు, శుద్ధి, ఎగుమతుల తదితర బాధ్యతలు దానికి అప్పగించనున్నారు. పంట పెట్టుబడి మద్దతు, భూ రికార్డుల ప్రక్షాళన, నీటి తీరువా రద్దుతో ఈ రంగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం త్వరలోనే కొత్త నిర్ణయాన్ని ప్రకటిం చబోతోంది. వ్యవస్థీకృత మార్పులతో ఈ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు, లాభాపేక్షలేని వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌కు, ఎగుమతులకు ''తెలంగాణ అగ్రి ఎక్స్‌పోర్ట్ కార్పొరేషన్''ను నెలకొల్పాలని నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల వ్యవసా యోత్పత్తులను నేరుగా రైతులవద్ద నుంచి సేకరించడంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉత్పత్తులను కొనుగోలు చేసి వాటిని మార్కెటింగ్ చేయాలన్నది ఆయన ఆలోచన. దేశవ్యాప్తంగా తెలంగాణ బ్రాండ్‌పై ఉత్పత్తులను పరిచయం చేసే ప్రయత్నం ప్రారంభించి ఈ ప్రాంత విశిష్టతను, ప్రభుత్వ ప్రత్యేకతను నలుమూలలా చాటి చెప్పాలనుకుంటున్నారు. తద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలను సాధిం చడమే లక్ష్యం గా కేసీ ఆ ర్ ఈ నిర్ణయం తీసుకు న్నారు.

ఒక్కో అడుగూ వేస్తూ....

అన్నదాతల ఆర్థికస్థితి గతు లపై పూర్తిస్థాయి అవగాహన కలిగివున్న ముఖ్యమంత్రి తన మది లో ఉన్న ఆలోచనలను క్రమంగా కార్యరూపంలోకి తీసుకువస్తున్నారు. దేశంలో ఇప్పటి వరకు ఎక్క డా లేని విధంగా స్థాని కంగా తయారు చేసిన వస్తువులకు ప్ర త్యేక ప్రాధాన్యత కల్పిస్తూ మార్కె టింగ్ చేసేందుకు కేసీ ఆర్ ప్రభుత్వం కార్యాచరణ ప్రణా ళిక సిద్ధం చేసింది. మేడ్ ఇన్ తెలంగాణ నినాదంతో తొంభైశాతం నిత్యావసర వస్తువులను ఇక్కడే తయారుచేసి యువజనోపాధికి పెద్దపీత వేయాలన్నది ఆయన ఆలోచన. అదేసమయంలో పట్టణాలు, నగరాలు, జిల్లా, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ప్రభుత్వ ప్రోత్సాహంతో భారీ రిటైల్ మార్కె ట్లను ఏర్పాటు చేసి నిర్వహించనున్నారు. విద్య, వైద్య, సాంకేతిక, పారి శ్రామిక, వ్యాపార రంగాల్లో అభివృద్ధివైపు దూసుకెళ్తున్న తెలంగాణ రాష్ట్రంలో రిటైల్ మార్కె టింగ్ రంగాన్ని కూడా అభి వృద్ధి చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.

ఎంఎన్‌సీలకు ఆహ్వానం

మల్టీ నేషనల్ రిటైల్ మార్కెట్ల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో పెద్దఎత్తున నిరుద్యోగ యువతకు ఉపాధి అవ కాశాలు కల్పించవచ్చునన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని ఎంచుకున్నట్లు తెలు స్తోంది. ఈ రంగంలో నైపుణ్యత గల కార్మికులు, ఉద్యోగులు అవసరమున్నం దున స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కూడా చర్యలు కొన సాగుతున్నాయి. రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధి, యువజనోపాధికి ప్రాధాన్యతనిస్తూ, తద్వారా ఆర్థిక ప్రగతిని సాధించడానికి రిటైల్ జోన్లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఎన్నికల ప్రణాళికలో ఇంటింటికి ఉద్యోగమన్న వాగ్దానాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగా సీఎం కేసీఆర్ ఈ ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ప్రైవేటు, కార్పొరేటు, బహుళజాతి సంస్థల పెట్టుబడులను ఆహ్వానించి రాయితీలు, ప్రోత్సాహకాలు అందించనున్నారు. అనధికారిక సమాచారం మేరకు ఈ పెట్టుబడులకు ప్రత్యేక రిటైల్ జోన్లను ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పి స్తారు. త్వరలోనే ఈ జోన్లను ప్రకటించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ సంస్థల్లో స్థానిక యువజనులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. ప్రైవేటు రంగమే అయిన ప్పటికీ పనిచేసే వారికి ఉపాధి భద్రత కల్పించేందుకు కార్మిక చట్టా లను అమలు చేస్తూ ఉపాధి కల్పించా లన్న నిబంధన కూడా విధించను న్నారు. తెలంగాణ స్కిల్ డెవ లప్ మెంట్ కార్పొ రేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కార్యాచరణ ప్రణా ళికను తయారు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి రిలయన్స్, వాల్‌మార్ట్, లైఫ్ స్టైల్ ఇంటర్నేషనల్, ప్యాంటలూన్స్, ఆదిత్య బిర్లా, రహేజా గ్రూప్ తదితర రిటె యిల్ సంస్థల ప్రతినిధులతో ప్రభుత్వం ఇప్పటికే చర్చలు జరిపింది. స్వయం ఉపాధి కల్పిస్తున్న కుటీర పరిశ్రమలు, డ్వాక్రా సంఘాలు నడుపుతున్న చిన్నతరహా పరిశ్రమల ద్వారా తయారయ్యే ఉత్పత్తులు, హస్తకళా ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండ్ ఏర్పాటు చేసి ఈ రిటైల్ సంస్థల్లో మార్కెటింగ్ చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు.

మేడ్ ఇన్ తెలంగాణ

ఈ సరికొత్త విధానంతో మహిళలు ఆర్థిక సమృద్ధి సాధించేందుకు కూడా దోహద పడు తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ తరహా వ్యా పారాల అభి వృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహా య, సహకారాలను అందించేందుకు పరిశ్రమలు, మార్కె టింగ్, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖల సమన్వయంతో నిర్దిష్టమైన కార్యా చరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. మేడ్ ఇన్ తెలంగాణఅనే సరికొత్త నినాదంతో చేప డుతున్న కార్యక్రమంలో భాగంగా రిటెయిల్ వ్యాపారాలను మరింతగా విస్తృతపరిచి, తద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుచాలన్నదే కేసీఆర్ లక్ష్య మని తెలుస్తోంది. యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంచు కున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో రిటెయిలర్లు కూడా భాగస్వామ్యం పంచుకునే విధంగా నిబంధనలు విధిస్తూ విధివిధానాలను రూపొందిస్తు న్నారు. నిరుద్యోగ యువకులకు శిక్షణనిచ్చి వారికి ఉపాధి కల్పించడం ద్వారా, రిటైల్ మార్కెట్ల వ్యాపార లావాదేవీల ద్వారా ప్రభు త్వానికి వచ్చే పన్నుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కూడా మరింత మెరుగు పడుతుందన్నది ఆర్థికశాఖ అంచనా.

విజన్ 2020

గ్రామ స్వరాజ్యం సాధించేందుకు విజన్-2020ని దృష్టిలో పెట్టు కొని ముందడుగు వేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధిగాంచిన నిపుణులను రాష్ట్రానికి రప్పించడంలో రిటెయిలర్లు కృషిచేస్తే, ఎదుర్కొంటున్న లాజిస్టిక్ సమస్యలు సులభంగా పరిష్కారమవుతాయన్న ఆలోచనతో కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో లాజిస్టిక్ కోర్సులను ప్రవేశపెట్టబో తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణాను అంతర్జాతీయ లాజిస్టిక్ హబ్‌గా రూపొందించేందుకు రాష్ట్రంలో వేలాది సంఖ్యలో యూనిట్లను స్థాపించ నున్నారు. ఈ క్రమంలో తయారీ సంస్థలన్నింటినీ రిటెయిలర్స్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రోత్సాహకాలు అందిస్తారు. డ్వాక్రా మహి ళల ఉత్పత్తులకు నాణ్యతా పరీక్షలు నిర్వహించి ప్రత్యేక లేబుల్‌తో మార్కెటింగ్ చేస్తారు. వ్యవసాయ ఉత్పత్తులు, పాలు, మత్స్య ఉత్పత్తులు తదితర ఆహార పదార్థాలు, వస్తువుల అమ్మకాల్లో స్థానికంగానే విక్రయించి, అక్కడే తయారుచేసి, ఇతర ప్రాంతాల్లో అమ్ముకుంటే రాబడి, ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు.

ఆదర్శంగా రైతు సంక్షేమ పథకాలు

పంట పెట్టుబడి, రైతుబీమా, రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు సమన్వయ సమితులు, మద్దతు ధరలతో అన్ని రకాల వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్ళు, ఆన్‌లైన్ చెల్లింపులు, బయోమెట్రిక్ ద్వారా రేషన్ సరుకులు... ఇలా కీలక రంగాల్లో దేశానికీ, పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది మరిన్ని రంగాల్లో మార్గదర్శి కాబోతోంది. ఒకప్పుడు అన్ని రంగాల్లో వెనుకబడిన ప్రాంతంగా ఉన్న తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అనతికాలంలోనే ఆదర్శ రాష్ట్రంగా అవతరించింది. అందుకు ముఖ్యమంత్రి దూరదృష్టి కార్యాచరణ, పేద వర్గాలకు నేరుగా లబ్ధి చేకూర్చే అనేక పథకాలు, ముఖ్యంగా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో అద్భుతమైన ఫలితాలు ప్రధాన కారణాలుగా నిలిచాయి. దేశంలో మార్పుకోసం కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యాలన్నీ ఇక్కడి నుంచే సాకారమవుతున్నాయి. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో దార్శకుడిగా మారిన కేసీఆర్ రైతు ఆదాయం రెట్టింపు చేయాలన్న ప్రధాని నరేంద్రమోడీ ఆలోచనలను చేతల్లో చేసి చూపించారు. ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, వ్యాపార రంగాల్లో తెలంగాణ సర్కారు అనుసరిస్తున్న విధానం త్వరలోనే పదుల సంఖ్యతో పొరుగు రాష్ట్రాలకు ఆదర్శప్రాయం కానున్నాయి. కుల వృత్తులు, గ్రామీణ చేతివృత్తుల్లో జవసత్వాలు నింపి స్వయం ఉపాధి అవకాశాలను వందరెట్లు పెంచగలిగారు. వ్యవస్థీకృత మార్పులు, పరిపాలనా పరమైన విధానాల అమలులో తిరుగులేని శక్తిగా మారిన సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. వివిధ రకాల ప్రోత్సాహకాలు, సరికొత్త పథకాలతో 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేయాలన్న దిశగా కేసీఆర్ కొత్త ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు.



కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం

గ్రామస్థాయిలో యువజన సంఘాలు, మహిళా సంఘాల ద్వారా కొన్ని రకాల ఉత్పత్తులను తయారు చేసేందుకు కుటీర పరిశ్ర మలు నెలకొల్పేందుకు బ్యాంకు రుణాల ద్వారా ప్రోత్సా హకాలను అందజేస్తారు. ఈ పరిశ్రమలతో పాటు రిటైల్ మార్కె ట్లలో పనిచేసేందుకు మెరుగైన మానవ వనరుల కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తారు. అయితే, ఈ మార్కెట్లు ఏడాది పొడవునా కొనసాగేలా ప్రత్యేక వెసులుబాటు కల్పించాల నుకుంటున్నారు. భారీ పెట్టుబ డులను ఆశిస్తూ ఆసక్తి చూపుతున్న బహుళజాతి సంస్థలను రంగం లోకి దింపి తగిన ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక జోన్లను ఏర్పాటు చేసి భారీ పరిశ్రమ లకు ఇస్తున్న మాదిరిగా సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు మం జూరు చేసేందుకు భరోసా ఇస్తున్నారు.



సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 15 జనవరి 2019

డబ్బులు గలగల... సంప్రదాయం వెలవెల....

సంక్రాంతి వచ్చిందంటే ముత్యాల ముగ్గుల లోగిళ్ళు, హరిదాసుల కీర్తనలూ, కన్నె పిల్లల గొబ్బెమ్మ పాటలు, కొత్త అల్లుళ్ళ అలకలు గతంలో గుర్తుకు వచ్చేవి. ఇప్పుడు కోడిపందాలు, ఎడ్ల పందాలు, బరుల ఆటలు, రచ్చబండలు, అరుగులపై పేకాటలు, మద్యం దుకాణాల వద్ద బారులు కనిపిస్తున్నాయి. సంక్రాంతికి ప్రతి ఇంటా ధాన్యపు రాశుల గాదెలు దర్శనమిచ్చేవి. ఇప్పుడు ఆ ధాన్యపు రాశులు ఇళ్ళవరకూ రావడం లేదు. పొలం నుంచే దళారులు ట్రాక్టర్లలో తీసుకుని పోతున్నారు. రుణాలకు బదులుగా తమ పంటను దళారులూ,వడ్డీ వ్యాపారులు అలా తరలించుకుని పోతుంటే రైతులు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోతున్నారు. ఫలితంగా కష్టించి పండించిన రైతు గంజినీళ్ళు తాగుతుంటే, రవంత పెట్టుబడిపెట్టి కొండంత లాభాలను ఆర్జిస్తున్న దళారులు, సంపన్నులు ఊళ్ళలో సంక్రాంతి సంబరాల పేరిట ఖాళీ స్థలాల్లో, కూడళ్ళలో పెద్ద పందిళ్ళ షామియానాలు కట్టి కోడిపందాలు నిర్వహిస్తున్నారు. ఈ కోడి పందాలు సంక్రాంతి వేడుకల్లో అనివార్యంగా మారాయి. వీటిని న్యాయస్థానాలు నిషేధించినా షరా మామూలే. రాజకీయ నాయకుల వెన్నుదన్నుతో సాగుతున్న ఈ పందాలను నిలువరించే ధైర్యం ఎవరికీ లేదు. పోలీసులు కూడా వచ్చి వేడుక చూసి పోతుంటారు. గ్రామాల రూపు రేఖలు మారి పోయాయంటే అసలైన అర్థం ఇది. ఇప్పుడు గ్రామాల్లో దొరకని వస్తువు లేదు. మొబైల్ ఫోన్‌లు ప్రతి వారి చేతుల్లో కనిపిస్తాయి. గతంలో బ్రాకెట్ నెంబర్లు కిళ్ళీ దుకాణాల్లో ల్యాండ్ ఫోన్‌లకు రాత్రి తొమ్మిది దాటిన తర్వాత వచ్చేవి. దాని కోసం ఎంతోముందుగా తయారయ్యేవారు. ఇప్పుడు అలాంటి దుస్థితి లేదు. చేతిలో సెల్‌ఫోన్ ఉండటంతో ప్రతి వారికీ నెంబర్లు సునాయాసంగా తెలుస్తున్నాయి. కోళ్ళ పందాలను తిలకించడానికి గడపదాటని మహిళలు కూడా తరలి వస్తున్నారు. నిరంతర వార్తా స్రవంతులలో కనిపించే దృశ్యాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. కోడి పందాల తర్వాత అంత ప్రాముఖ్యాన్ని వహించినవి ఎడ్ల పందాలు. ఇవి కేవలం వినోదం కోసమే గతంలో నిర్వహించేవారు. తమిళనాడులో పొంగల్ పేరిట నిర్వహించే సంక్రాంతి వేడుకల్లో జల్లికట్టు ఉత్సవం ఒక సంప్రదాయం. కోర్టు నిషేధించినా దానిని కూడా స్వేచ్ఛగా, నిర్భయంగా నిర్వహిస్తున్నారు. కొమ్ములు తీరిన పోట్ల గిత్తలను రోడ్లమీదికి వదులుతారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అవి కొమ్ములతో పొడిచేస్తాయి. ఆ కొమ్ములను వంచే ధీరులు కొందరు బరిలో ప్రవేశిస్తారు. వారిని ఆ ఎడ్లు కింద పడేసి తొక్కుతుంటాయి. కొమ్ములతో పొడిచేస్తూ ఉంటాయి. రక్తం కారుతున్నా, ఆ యోధులు ఆ గిత్తల కొమ్ములను పట్టుకుని , వాటిని లొంగతీసుకుంటారు. అదో క్రీడ, అందులో గెలుపొందిన వారికి ట్రోఫీలు, నజరానాలూ ఇస్తుంటారు. ఇది తమిళ సంప్రదాయంలో భాగం కనుక, దానిని కాపాడుకోవడానికి తమిళ రాజకీయవేత్తలు సుప్రీంకోర్టు వరకూ వెళ్ళారు. ఇవి కాకుండా ప్రకాశం జిల్లా ఎడ్ల బరువు లాగే పోటీలు కూడా సంప్రదాయంలో భాగమే. ఎడ్లు బరువులాగే పోటీలు కూడా తరతరాలుగా నిర్వహించబడుతున్నాయి. కోడి పందాలు కూడా సంక్రాంతి సంప్రదాయంలో భాగమే కానీ, వాటిని గతంలో మాదిరి స్వచ్ఛందంగా కాకుండా, వాణిజ్య పరంగా నిర్వహిస్తున్నారు. కాయ్ రాజా కాయ్ అంటూ గుర్రపు పందాల మాదిరిగా కోళ్ళ మీద వేలకు వేలు పందెం కట్టేందుకు గ్రామాలకు పట్టణాలు, నగరాల నుంచి కూడా గ్రామాలకు తరలి వెళ్తున్నారు. కోస్తా జిల్లాల్లో, ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో లాడ్జిలు, హోటళ్ళు నెలలకు ముందే బుక్ చేసుకుంటున్నారు. వారికి పెద్ద యంత్రాంగం మాదిరి అనుచర వర్గం ఉంటుంది. వారి ద్వారా ముందస్తు సమాచారాన్ని సేకరించుకుని టైమ్ వృధాకాకుండా సరిగ్గా ముహూర్తం సమయానికి ఆయా గ్రామాల్లో దిగుతారు. ఈ కోడి పందాలు ఇప్పుడు ఆయా గ్రామాల్లో జాతర్లు, తిరునాళ్ళ మాదిరిగా సాగుతున్నాయి. స్థానిక పత్రికల్లో వాణిజ్య ప్రకటనలు (అడ్వర్‌టైజ్‌మెంట్లు) కూడా జారీ చేస్తున్నారు. అలాగే, మద్యం దుకాణాలను సర్వాంగ సుందరంగా అలంకరించి ఖాతాదారులకు అదనపు సౌకర్యాలను కల్పిస్తున్నాయి. పొరుగూరి నుంచి వచ్చిన వారికి అన్ని సౌకర్యాలూ లభిస్తాయి. చేతినిండా డబ్బు ఉంటే చాలు చేతిలో సంచి లేకుండా కూడా వెళ్ళొచ్చు. అన్నట్టు చేతిలో డబ్బు కూడా అవసరం లేదు. ఏటిఎం కార్డులుంటే చాలు. గ్రామాల్లో సైతం ఎటిఎంలు వచ్చేశాయి. అవి మామూలు రోజుల్లో సరిగా పనిచేయకపోయినా ఇప్పుడు ఇరవై నాలుగు గంటలూ పనిచేస్తాయి. సంక్రాంతి శోభ అంతా కోడి పందాలు నిర్వహించే పరిసరాల్లో కనిపిస్తుంది. అలాగే, అమ్మవారికి జంతు బలులను నిషేధించినా అవి యథేచ్ఛగా సాగిపోతున్నాయి. టాపులేని టెంపోలు, ట్రక్కుల్లో రెండు మూడు కుటుంబాల వారు యాత్రకు బయలు దేరి వచ్చి గుళ్ళల్లో మొక్కుబడులు చెల్లించుకుని అక్కడే అన్నం వండుకుని తినేసి కోడిపందాలు వంటి వినోదాలను తిలకిస్తూ ఉంటారు. వీటికి వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం ఏ ఒక్కరికీ లేదు. స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలోనే ఇవి సాగుతుండటం, శాంతి భద్రతల యంత్రాంగం నిస్సహాయాన్ని ప్రకటించడం, ఊరిపెద్దలే ఈ క్రీడల్లో భాగస్వాములు కావడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం అంతా కోడిపందాల పందిళ్ళలోనే కనిపిస్తుంది. అక్కడికి వెళ్ళలేని వారు టెలివిజన్ చానల్స్‌లో ఈ వేడుక చూస్తూ ఉంటారు. సాంప్రదాయకంగా పేకాట్లలో మునిగి తేలేవారు ఈ పందాలకు దూరంగా ఆనందాన్ని పొందుతుంటారు. జేబులు ఖాళీ చేసుకుంటారు. సంక్రాంతి పండుగ పేదల పొట్టలు నింపడానికి కాకుండా, ప్రజల జేబులను ఖాళీ చేయడానికి వచ్చిందని తర్వాత తిట్టుకోవడం కూడా ఆనవాయితీ అయింది. మద్యం, జూదం వంటి సామాన్య ప్రజల బలహీనతలతో సాగే వ్యాపారాలకు పండుగ సీజన్‌లో తిరుగే ఉండదు. ఇవి ఇలా ఉంటే చేతిలో డబ్బు ఎంత ఉన్నా, మార్కెట్‌లో వస్తువుల ధరల కారణంగా సామాన్యులు విలవిల లాడిపోతున్నారు. పెద్దలకు సమర్పించుకునే గుమ్మడి కాయలు, గుమ్మాలకు కట్టుకునే మామిడి తోరణాలు, ముగ్గుల్లో వాడే రంగులు, వాయనాలు, స్వయం పాకాలు ఇచ్చే అరిటి ఆకులూ, విస్తరాకులు అన్నీ ఖరీదే. ఇవన్నీ గ్రామాల్లో గతంలో ఉచితంగా లభించేవి. ఇప్పుడు కళ్ళాపు జల్లేందుకు గోమయాన్ని కూడా డబ్బు పెట్టి కొనుక్కోవల్సిందే. అందుకే పండుగ నాడు కూడా సామాన్యులు పప్పన్నం తినడం గగనమవుతోంది.

సైన్యానికి సవాళ్ళు



తొలి ఆర్మీ జనరల్ కరియప్ప

ఏ దేశానికైనా సార్వభౌమాధికారం ఉందంటే కారణం ఆ దేశపు సైన్యమే కారణమవుతుంది. సైన్యం లేకపోతే దేశ సరిహద్దులే చెరిగిపోతాయి. ఆ దేశం చిన్నాభిన్నం అవుతుంది. ఈ విధంగా ఒక దేశ సమగ్రతకి సైన్యం కారణభూతం అవుతోంది. దేశ పౌరులు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే, నిద్రపోతున్నారంటే, సాంఘిక కార్యకలాపాలు సజావుగా నిర్వహించుకుంటున్నారంటే.. సరిహద్దులను కాపలా కాస్తున్న సైన్యమే కారణమవుతుంది. అంత విశిష్టత కలిగిన సైన్యాల స్వరూపాలు వివిధ దేశాల్లో వివిధ స్థాయిల్లో, వివిధ రూపాల్లో సేవలందిస్తున్నాయి. ఇందులో భారతీయ సైన్యం ప్రత్యేకత, విస్తృతి, వైవిధ్యత ఎంతగానో ఉందని చెప్పాలి. నిజానికి భారతదేశానికి స్వాతంత్ర్యం 15 ఆగస్టు 1947లో వచ్చింది. అయినా దేశ సైన్యానికి సైన్యాధ్యక్షులుగా బ్రిటీష్ వారే కొనసాగడం ఒక విచిత్రమైన అంశం. 15 జనవరి 1949లో బ్రిటీష్ సర్వ సైన్యాధ్యక్షుడు ఫ్రాన్సిస్ బుచ్చర్ నుంచి ఫీల్డు మార్షల్ కరియప్ప బాధ్యతలు స్వీకరించారు. దేశానికి రాజకీయంగా స్వాతంత్ర్యం ప్రకటించిన బ్రిటీష్ వారు ఒకటిన్నర సంవత్సరం వరకు భారతీయ సైన్యాధికారులుగా కొనసాగారు. కేఎం కరియప్ప బాధ్యతలు స్వీకరించిన జనవరి 15ను సైనిక దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నేడు 71వ ఆర్మీ డే జరుపుకోనున్న భారతీయ సైన్యం ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. ఎన్నో విజయాలు సాధించిన ఘన చరిత్ర ఉంది. డెబ్బై సంవత్సరాలుగా వివిధ దశలు దాటిన మన సైనిక పాటవం... అనేక అనుభవాలను నుంచి రాటు దేలింది. శత్రు దేశం సరిహద్దులు దాటకుండానే సర్జికల్ స్ట్రైక్స్ చేసే స్థాయికి ఎదిగింది. మరెన్నో అస్త్రశస్త్రాలను తన అంబుల పొదిలో చేర్చుకుంది.

సైన్యమంటే ఆయుధాలు, యుద్ధట్యాంకులు, యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, మర ఫిరంగులు, మారణాయుధాలు, యూనిఫారాలే కాదు.. సైన్యమంటే మనుషులు, మనసున్న మనుషులు, ఈ దేశ పౌరులు. స్వచ్ఛందంగా దేశం కోసం సేవ చేయడానికి సైన్యంలో చేరిన వీరులు. భారత సైన్యం తల్లివంటిదంటారు. తల్లి ఎప్పుడైనా ఇవ్వడమే కానీ తిరిగి ఏదీ కోరుకోదు. మన సైన్యం కూడా దేశానికి సేవ చేయడం, ప్రాణాలు త్యాగం చేయడం తప్ప బదులుగా కోరుకున్నదేదీ లేదు. ఈనాడు మనం చూస్తున్న భారత సైన్య నిర్మాణం బ్రిటీష్ వారి హయంలో 1776లో జరిగింది. ఆనాటి నుంచి దేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు ఎన్నో దశలు దాటింది. రెండు ప్రపంచ యుద్ధాల్లో పాల్గొంది. నేటి మన సైన్యం ప్రపంచంలోనే అతి పెద్ద మూడవ ఆర్మీగా పరిగణిస్తారు. ప్రపంచంలోనే ఏదీ సైన్యానికి లేని ప్రత్యేకతలు మన ఆర్మీకున్నాయి. రక్తం గడ్డకట్టే చలిలో, ఎత్తైన పర్వత ప్రాంతాల్లో మన సైన్యం నిర్వహిస్తున్న విధులకు మరే సైన్యం సాటిరాదు. పర్వత యుద్ధాల్లో భారత సైన్యాన్ని ఓడించే శక్తి మరెవ్వరికీ లేకపోవడం మనందరికీ గర్వ కారణం. భారత ఆర్మీకి మరో ప్రత్యేకత ఉంది. ఏ దేశ సైన్యమైనా తన దేశ పౌరులకే సైనిక శిక్షణ ఇస్తుంది. ఇండియన్ ఆర్మీ మాత్రం ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, శ్రీలంక సైన్యానికీ డెహ్రాడూన్ కేంద్రంగా శిక్షణ ఇవ్వడం విశేషం. పొరుగు దేశాల సైన్యానికి శిక్షణ ఇచ్చే ఇండియన్ ఆర్మీని శాంతి దూతగా పేర్కొంటారు. భారత సైన్యం తన చరిత్రలో ఏనాడూ కయ్యానికి కాలు దువ్వలేదు. యుద్ధ భేరీని తానే ఎప్పుడూ మొదట మోగించలేదు. కానీ తనను సవాల్ చేస్తే మాత్రం ఊరుకున్నదీ లేదు. అది పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్‌లతో జరిగిన యుద్ధాల్లో పదే పదే రుజువైంది. ఇక ప్రపంచంలో అశ్విక దళం ఉన్న సైన్యం మనదే కావడం కూడా మరో విశేషం.



యుద్ధ సమయంలోనే కాదు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కూడా భారత సైన్యం విశేష సేవలను అందిస్తుంది. ఉత్తరాఖండ్ వరదలు సంభవించినప్పుడు సైన్యం పోషించిన పాత్ర మరువలేనిది. మన సైనికులు ప్రాణాలకు తెగించి, ఉరికి పడే వరదలకు ఎదురొడ్డి ఎంతో మంది ప్రాణాలను కాపాడడం యావత్ ప్రపంచం చూసింది. ప్రపంచంలోనే అత్యధిక పౌరులను కాపాడిన ఖ్యాతినీ దక్కించుకుంది. ప్రపంచంలోనే అతి ఎత్తైన ప్రాంతంలో నిర్మించిన వంతెనగా పేరొందిన లడఖ్ బ్రిడ్జిని నిర్మించింది కూడా భారతీయ సైనికులే. మన సైనిక స్థావరం దేశం వెలుపులా కూడా ఉండడం మరో విశేషం.

తజికిస్థాన్‌లో భారత సైనిక స్థావరం ఉంది. గడిచిన ఆరు దశాబ్దాలుగా ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో అత్యధికంగా భారతీయ సైనికులే సేవలందిస్తున్నారు. భారతీయ సైన్యంలో కాలంతో పాటు ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆయుధ సంపత్తి పెరిగింది. యుద్ధ సామర్థ్యాన్ని పెంచుకున్నారు. సరికొత్త ఆయుధాలు, క్షిపణులు సమపార్జించుకున్నారు. ప్రపంచంలో ఏ సైన్యానికైనా ధీటుగా జవాబు చెప్పే స్థాయికి భారత సైన్యం చేరుకుంది. అయితే 2017 జూలైలో కాగ్ ఇచ్చిన నివేదిక కొంత ఆందోళనకి కారణమవుతోంది. సుదీర్ఘకాలం పాటు యుద్ధం చేయడానికి అవసరమైన యుద్ధ ట్యాంకులు, ఆర్టిలరీ ఇండియన్ ఆర్మీ వద్ద లేదని కాగ్ స్పష్టం చేసింది. యుద్ధం నలభై రోజుల పాటు జరిగితే దానికి తగిన ఆయుధ సంపత్తి నిల్వలు ఆర్మీ వద్ద ఉండాలి. భారత సైన్యం వద్ద ఇరవై రోజులయుద్ధ అవసరాలకు సరిపడా మాత్రమే ఆయుధ నిల్వలు ఉన్నాయని పేర్కొన్న కాగ్ నివేదిక సర్వత్రా ఆందోళనకి కారణమైంది. మరికొన్ని ఆయుధాలు కేవలం పది రోజుల లోపు యుద్ధ అవసరాలు మాత్రమే తీరుస్తాయని ఆ నివేదికలో వెల్లడైంది. దీని ప్రకారం 10 రోజుల నుంచి 15 రోజుల యుద్ధం జరిగినా భారత సైన్యం వద్ద ఆయుధాలు నిండుకుంటాయన్న నివేదికపై ఆనాడు పార్లమెంటులో తీవ్రచర్చ జరిగింది. భారత సైన్యం వద్ద మొత్తం 152 రకాల ఆయుధాలుంటే అందులో 80 శాతం వరకు 121 రకాల ఆయుధాలు మరీ తక్కువగా ఉన్నట్లు తేల్చింది. 2015 నుంచి కాగ్ భారత సైన్య ఆయుధ సామర్థ్యంపై నివేదికలు ఇస్తూనే ఉంది. రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపులు మరింత పెంచాలని కాగ్ పదే పదే సిఫార్సు చేస్తూనే ఉంది. దీంతో గత ఏడాది మేలో రూ.15 వేల కోట్ల వ్యయంతో భారత సైనిక ఆయుధాగారాన్ని బలోపేతం చేసే చర్యలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇతర దేశాల నుంచి చేసుకుంటున్న దిగుమతులు ఆలస్యం అవడంతో కొన్ని ఆయుధాలను స్వదేశీయంగా తయారీకి దేశ ఆయుధ కర్మాగారాలు నడుం బిగించాయి. ఆయుధ తయారీ రంగంలో ప్రైవేటు రంగ సేవలు కూడా తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. 30 రోజులపాటు యుద్ధం జరిగితే నిలబడగలిగే స్థాయిలో ఆయుధాలు సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇతర దేశాల నుంచి దిగుమతుల మీద ఆధారపడడం మానేయాలని, సైన్యం ఆయుధ అవసరాలను స్వదేశంలోనే పూర్తి స్థాయిలో తీర్చుకోవాలన్న ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయంతో ఇండియన్ ఆర్మీకి కొత్త జవసత్వాలు వస్తాయని భావిస్తున్నారు. పదేళ్ల కాల వ్యవధిలో రాకెట్లు, గగనతల రక్షన వ్యవస్థ, ఆర్టిలరీ గన్స్, ఇన్‌ఫాంట్రీ కంబాట్ వెహికల్స్, గ్రెనేడ్ లాంఛర్లు తదితర ఆయుధాలను నిర్ణీత కాలపరిమితిలో తయారు చేసుకోవాలని భారత ఆర్మీ లక్ష్యంగా పెట్టుకుంది.

పొరుగున ఉన్న చైనా ఆయుధ సంపత్తిని ఏటికేడు గుట్టగుట్టలుగా సమకూర్చుకుంటూ పోతూ ఉంటే, భారతదేశం ఈ విషయంలో వెనుకబడడంపై గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళనలు వ్యక్తమవుతూ వచ్చాయి. ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ సైనిక ఆయుధ సంపత్తిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గత కొన్ని దశాబ్దాలుగా సైనిక ఆయుధ అవసరాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పాటు, ఎక్కువగా ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడడం భారత సైన్యాన్ని బలహీన పరుస్తుందని, తాజాగా స్వదేశీయంగా తయారీ కార్యక్రమంతో ఆ లోటు భర్తీ అవుతుందని భావిస్తున్నారు. కాగ్ నివేదికతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం ఆయుధాగారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడమే కాకుండా, అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడం శుభపరిణామంగా రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పది రకాల ఆయుధాలు మరీ తక్కువగా ఉన్నాయని గుర్తించిన ప్రభుత్వం వాటిని నేరుగా సైన్యమే కొనుగోలు చేసే అధికారాన్ని బదలాయించింది. పదాతి దళ అవసరాల కోసం భారీ యెత్తున లైట్ మెషిన్ గన్స్, బాటిల్ కార్బైన్స్, అసోల్ట్ రైఫిల్స్‌ను దాదాపు రూ.40 వేల కోట్ల వ్యయంతో కొనుగోలుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది.

సైన్యంలో నిబంధనలు చాలా ఖచ్చితంగా ఉంటాయి. నిబంధనలు, క్రమశిక్షణకు సైన్యం పెద్ద పీట వేస్తుంది. క్రమశిక్షణా రాహిత్యాన్ని సైన్యం అస్సలు సహించదు. అయితే సైన్యంలోనూ మార్పులు వస్తున్నాయి. సైన్యంలోకి వెళ్లే తరాల్లో వస్తున్న మార్పులు అక్కడా ప్రతిఫలిస్తున్నాయి. ఈ తరం సోషల్ మీడియాకు ఎంతగా అలవాటు పడిందో అందరికీ తెలుసు. సైన్యంలో చేరినా ఆ అలవాట్లు మానుకోకపోవడం ఆర్మీకి కొన్ని సార్లు ఇబ్బందికర పరిస్థితులు తెచ్చిపెట్టాయి. తేజ్ బహదూర్ అనే సైనికుడి వ్యహారంలో నేరుగా సైన్యాధ్యక్షుడు బిపిన్ రావత్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. సైన్యంలో తన ఇబ్బందులను సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి తీసుకొని రావడానికి బహదూర్ చేసిన ప్రయత్నాలను రావత్ తీవ్రంగా ఖండించారు. సైన్యం క్రమశిక్షణను ఇలాంటి చర్యలు కాలరాస్తాయని స్పష్టం చేశారు. సైన్యాన్ని వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్ వంటి సోషల్ మీడియా నియంత్రించలేదని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలుంటే సైన్యంలో పరిష్కార కేంద్రాలున్నాయి వాటి సహాయం తీసుకోవచ్చని చెప్పారు. అయితే ఇలాంటి సందర్భాలు భారత సైన్యానికి పలు మార్లు, పలు రకాలుగా ఎదురువతున్నాయి. ఆధునిక యువత పోకడలు సైన్యంలో ప్రతిఫలించడమే దీనికి కారణమంటారు ఈ రంగ నిపుణులు.

గతంలో సైన్యంలోకి మహిళల ప్రవేశమే నిషిద్ధం. ఇప్పుడు వారు సైన్యంలోని అన్ని విభాగాల్లో ప్రవేశిస్తున్నారు. అక్కడా తమ శక్తిని నిరూపించుకుంటారు. నేటి 71 ఆర్మీ డేలో తొలి సారిగా.. లెఫ్టినెంట్ భావనా కస్తూరి 144 మంది పురుష సైనికులున్న ఆర్మీ సర్వీస్ కార్ప్ దళానికి నేతృత్వం వహిస్తున్నారు. ఆర్మీ డే పెరేడ్ చరిత్రలో ఇలా ఒక మహిళ సైనిక కవాతుకి నేతృత్వం వహించడం ఇదే తొలిసారి. 2015లో కెప్టెన్ దివ్య అజిత్ మహిళ సైనికుల బృందానికి నేతృత్వం వహించారు. పురుషుల దళానికి ఒక మహిళ నేతృత్వం వహించడం, దానికి సైనికుల్లో అంగీకారం లభించడం సామాన్య విషయమేమీ కాదు. మొదట సైన్యంలోకి మహిళ ప్రవేశాన్నే మనస్ఫూర్తిగా ఆహ్వానించని పురుష అధికారుల వైఖరిలో క్రమంగా మార్పు వస్తుందనడానికి భావన కస్తూరి ఉదాహరణగా నిలుస్తుంది. యావత్ భారతీయ సైన్యం దృక్పథమే మారుతుందనడానికి ఇది నిదర్శనమని లెఫ్టినెంట్ కస్తూరి గర్వంగా చెప్పారు. ఇలా కస్తూరే కాదు, ఆర్మీ డేర్ డెవిల్ మోటార్ సైకిల్ బృందానికి కెప్టెన్ శిఖా సురభీ నేతృత్వం వహిస్తుండడం మరో విశేషం. ఈ బృందంలో 33 మంది పురుష సైనికులుంటారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక మహిళ రక్షణ మంత్రిగా ఉన్న నేపథ్యంలో సైన్యంలోనూ మహిళల హవా మొదలైందనే చెప్పాలి.

ఇక సైన్యానికి 2018లో మరో సమస్య ఎదురైంది. సుప్రీంకోర్టు ఇచ్చిన రెండు తీర్పులు సైనిక క్రమశిక్షణకు పరీక్షగా నిలిచాయి. స్వలింగ సంపర్కం నేరం కాదని, అక్రమ సంబంధాలూ సక్రమమేననే తీర్పులు భారతీయ సైన్యంపైనా ప్రభావం కలిగించాయి. అక్రమ సంబంధాలను సైన్యం తీవ్రంగా పరిగణిస్తుంది. ఇలాంటి కేసుల్లో కోర్టు మార్షల్ కూడా విధిస్తారు. స్వలింగ సంపర్కానికీ సైన్యంలో తావు లేదు. ఇప్పుడు స్వలింగ సంపర్కం చట్టబద్ధం కావడం సైన్యానికి చిక్కులు తెచ్చి పెట్టింది. చట్ట ప్రకారం నేరం కాని లైంగిక బంధం సైన్యంలో అనుమతించడం సాధ్యం కాని పని. దీంతో ఆర్మీ చీఫ్ విస్పష్టంగా ప్రకటించారు. భారతీయ సైన్యంలోకి స్వలింగ సంపర్కులను చేర్చుకోబోమని స్పష్టం చేశారు. అయితే డెబ్బై సంవత్సరాలుగా ఎన్నో మార్పులు చేర్పులు జరుగుతూ వస్తున్న నేపథ్యంలో భారతీయ సైన్యంలో కూడా అవి ప్రతిఫలిస్తాయని అంటున్నారు. సైనిక విధుల్లో అక్రమ సంబంధాలు, స్వలింగ సంపర్కానికి అనుమతి ఉండకపోయినా, పౌర జీవనంలో వాటిని కొనసాగించడానికి ఆర్మీ అభ్యంతరం చెప్పకపోవచ్చనే వాదనా వినిపిస్తోంది. నేటి తరం యువత ఆకాంక్షలనూ సైన్యం దృష్టిలోకి తీసుకోవడం ద్వారా మరింతగా బలోపేతం అవుతుందనే వాదనా ఉంది. కాలం మారినా, యువతలో అభిరుచుల్లో మార్పు వచ్చినా.. కఠినమైన పరీక్షలు, జీవన్మరణ పోరాటాలకు పెట్టింది పేరుగా ఉన్న ఇండియన్ ఆర్మీ తన అస్తిత్వానికి ప్రనాదిగా ఉన్న క్రమశిక్షణ, నిబంధనల విషయంలో మౌలిక మార్పులు ఉండవనే రక్షణ రంగ నిపుణులు అంటున్నారు.

-ఎ.జి.దత్తా

ఆరోగ్యపు క్రాంతి కైతికాలు



బోగి పండ్ల భోగాలు
చలిమంటల తొలి కాంతితో
గొబ్బెమ్మల గుంపులతో
సింగిడి వర్ణపు ముగ్గుతో
అందమైన ముంగిళ్ళు
తోరణాల సందళ్ళు

సూర్య సంక్రమణం
నవకాంతుల తోరణం
తెలుగు వారి ఇళ్ళలో
నిలిచి యుండు కిరణం
కిరణాగమనమే భోగి
ఇళ్ళు నిండు ఉత్సాహపు సందడి
నవధాన్య లక్ష్ములు
నెలువైన లోగిలిలో
అహంకారమీడిచేయు
ఆవు పేడ వేడుకలో
వారెవ్వా సంక్రాంతి
నిండు నేల నవకాంతి

సాయంత్రం బొమ్మలాట
సరదాలకు నెలవులు
పసుపు కుంకుమ తోడ
రేగుపండ్ల దీవెనలు
అబ్బబ్బో చెప్పనట్టి
ఇళ్ళు నిండు భోగములు

బసవన్న లాటలు
హరిదాసు పాటలు
కొత్త బట్టలతోడ
పిండి వంటల విందులు
వారెవ్వా సంక్రాంతి
అందరికారోగ్య క్రాంతి

రమేశ్ గోస్కుల



రావమ్మా సంక్రాంతమ్మా

తే.గీ: శ్రీకరమగు తెలుగు యిళ్ళ
సిరులు యిచ్చు
సంకురాతిరి పండుగ జానువీవు
రమ్యమై బంతిపూవులు రంగులీన
ముందు ముత్యాల ముగ్గులు
ముద్దు చేయ
తే.గీ: మాదనుర్మాస పూజల
మహిమ తెల్పి
పుష్య మాసపు చలిమంట పొద్దుతోడ
భోగి మంటల శిఖలతో భాగ్యమొసగి
ద్రావిడాడపడుచువమ్మ నీవు రమ్ము

-రాఘవ మాస్టారు

సర్వమంగళ సంక్రాంతి!!!

బంగరు తెలుగుతల్లి
పచ్చని గుమ్మం-
మమతల మావితోరణాల
రెపరెప లాడగ,
సమతల రంగవల్లుల
కలకల లాడగ,
స్వర్ణ పథంలో వస్తోంది -
దివ్య సంక్రాంతి లక్ష్మి!!
విశ్వశాంతి గాలిపటాలు -
గగనాన్ని ముద్దాడ,
క్రాంతి ద్వార బంధాలు -
ముచ్చటగ తెరుచుకోగా,
గంగిరెద్దుల రమ్యనాట్యాలు
తిలకించుచూ-
సకల శుభాలందీయ వస్తోంది -
సౌభాగ్యలక్ష్మి!!

- జంధ్యాల వేంకట రామ శాస్త్రి

2019 : కూటముల కొత్త చరిత్ర!

ఇద్దరు స్కూల్ పిల్లలు దుర్భాషలాడుకొంటారు, కొట్టుకొంటారు, మర్నాడు ఒకడి దగ్గర జీళ్ళు, కొబ్బరుండలు ఉన్నాయని తెలిసి రెండోవాడు మచ్చిక చేసుకుని స్నేహం చేస్తాడు, మర్నాడు మళ్ళీ జుట్టు పీక్కొనే ఉదంతంతో వారిమైత్రి మొదటికొస్తుంది. దేశంలో రాజకీయ పార్టీల ప్రస్తుతపరిస్థితి స్కూల్‌పిల్లలని మించి పోయింది.రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వం, శాశ్వత మిత్రత్వం ఉండని మాట నిజమే అయినా, మరీ ఇంత నిస్సిగ్గుగా కలహించుకున్నవారే, కూటములు కట్టడం అన్నది ఎన్నడూ లేదు. పార్టీలు ఎన్నికలలో పోటీ చేయడం, ప్రత్యర్థి పార్టీలు ఒకదాన్నొకటి విమర్శించడం, బాగోతాలు బయటపెట్టుకుని పరస్పరం నిందలు వేసుకోవడం మామూలే. ఎన్నికలయిపోయి ఫలితాలొచ్చాకా దృశ్యం మారిపోతుంది, నిన్న తిట్టుకున్న వాళ్ళు ఈ రోజు దోస్తులుగా మారతారు, ఎన్నికలముందు చెట్టాపట్టాలేసుకొన్న వాళ్ళు జానీ దుష్మన్లు అయి పోతారు. స్వాతంత్ర్యానంతరం ముప్పయ్యేళ్ల వరకు కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వమే లేదు. నాల్గు దశాబ్దాలు వరకు కూటమి, సంకీర్ణ ప్రభుత్వం అనే పదాలు భారత రాజకీయ నిఘంటువులో కనిపించవు., 1977 దేశానికీ మొట్ట మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఇస్తే, 1989 మొట్టమొదటి ప్రతిపక్ష కూటమి నేషనల్ ఫ్రంట్‌ని సృష్టించింది.1999-2004, 2014 - 2019 మధ్యకాలాలు ఏకంగా రాజకీయ ముఖ చిత్రాన్నే మార్చివేశాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, చిరకాల మిత్రులుండరు అనే నానుడి ఇప్పటి రాజకీయ పార్టీల మంత్రంగా మారింది. ఒక పక్క కేసీఆర్‌ని మోడీ పొగిడితే, మరో పక్క 35 ఏళ్ళ చిరకాల ప్రత్యర్థి పార్టీ టీడీపీకి హస్తమందించారు రాహుల్ గాంధీ.

1971 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని అధికారం నుంచి దింపాలని దృఢనిశ్చయంతో సంయుక్త సోషలిస్ట్ పార్టీ, భారతీయ జన సంఘ్, కాంగ్రెస్ (ఓ) అనే మూడు పార్టీలు కలసి గ్రాండ్ అలయెన్స్ అనే సంకీర్ణాన్ని ఏర్పరచాయి. వామపక్షాల్లో సిపిఐ అధికార కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తు పెట్టుకుంది. 1971లో ఇందిరమ్మ చేసిన గరీబీ హటావో నినాదాల గర్జనలకు గ్రాండ్ అలయెన్స్ మట్టి కరిచింది. 1972 ఎన్నికలలో ఇందిరా కాంగ్రెస్ చాలా పెద్ద విజయం సాధించింది మరియు పాకిస్తాన్‌తో జరిగిన 1971 లో జరిగిన యుద్ధం బంగ్లాదేశ్ అవతరణకు దారితీసింది. దాంతో ఆమె ప్రజాదరణ గణనీయంగా పెరిగింది.

1977 లోక్‌సభ ఎన్నికలు మూడు నెలలున్నాయనగా భారతీయ జనసంఘ్, భారతీయ లోక్‌దళ్, కాంగ్రెస్ (ఓ), సోషలిస్ట్ పార్టీలు కలసి జనతా పార్టీగా ఏర్పడ్డాయి. ఎమర్జెన్సీ తరువాత 1977 నాటికి ఇందిరా గాంధీకి ప్రజాదరణ గణనీయంగా తగ్గింది, ఎమర్జెన్సీ విధించిన ఇందిర, జనతా పార్టీ సృష్టికి ప్రత్యక్ష కారణమైంది. 1977 లో నిర్వహించిన ఆరవ సార్వత్రిక ఎన్నికలలో జనతా పార్టీ దేశవ్యాప్తంగా 43 శాతం ఓట్లు పొంది 298 పార్లమెంటరీ స్థానాలను గెలుచుకుంది.

కాంగ్రెస్ పార్టీ 154 సీట్లకు దిగజారిపోయింది. ఎట్టకేలకు 1977 లో కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడినా జనతా పార్టీలో అంతః కలహాలు, అధికార దాహం, రాజకీయ కుట్రలతో అతలాకుతలమై సతమతమైన జనతా పార్టీ రెండేళ్లకే కుప్పకూలి మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి వచ్చేటట్టు చేసింది. మొరార్జీ దేశాయిని ప్రధాని పదవి నుంచి దించి చరణ్ సింగ్‌కి కాంగ్రెస్ నాయకత్వం ఆ పదవి ఎరగా చూపింది, జనతా పార్టీ విఫలమవ్వడానికి చరణ్ సింగ్ పదవీ వ్యామోహం కూడా తోడైంది జనతా పార్టీ విఫలమవ్వడానికి. మొరార్జీని పడగొట్టేవరకు చరణ్ సింగ్ రాముడైతే తాను హనుమంతుడిని అని చెప్పుకొన్న రాజ్ నారాయణ్ 1979 లోక్‌సభ ఎన్నికలలో బాగ్‌పట్ నియోజకవర్గంలో చరణ్ సింగ్‌పై పోటీ చేయడం గమనార్హం.

1990 నవంబర్‌లో వీపీ సింగ్ ప్రభుత్వం పడిపోగానే చంద్రశేఖర్ కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని స్థాపించారు. గల్ఫ్ యుద్ధం నడుమ 1991 జూన్‌లో కాంగ్రెస్ మద్దతు విరమించగానే చంద్రశేఖర్ ప్రభుత్వం మూడునాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది.

స్వాతంత్ర్యానంతర కాలం నాటికి, ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే 2014 - 2019 మధ్య భారతదేశంలో రాజకీయ పార్టీలు కొత్త పుంతలు తొక్కాయి. 2019 లో భారత రాజకీయాల్లో సంకీర్ణాలు, పొత్తుల విషయంలో పెనుమార్పులు సంభవించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీకి చెప్పుకోదగ్గ శాశ్వత మితపక్షాలు క్రమేపీ తగ్గిపోతున్నాయి. తాము గెలకపోయినా, అధికారంలోకి రాకపోయినా పర్వాలేదు కానీ బీజేపీ మాత్రం 2019 లో ప్రతిపక్షానికే పరిమితమవ్వాలని భావిస్తున్న రాజకీయ పార్టీల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. దేశంలో ఉన్న అన్ని ప్రధాన రాజకీయ పార్టీల అభిమతం, అంతిమ ధ్యేయం. బీజేపీకి శివసేనకి చెడిందో లేదో కానీ శివసేన మీద రాహుల్ గాంధీ ప్రేమ కురిపిస్తున్నారు. 70 ఏళ్లలో ఏ కాంగ్రెస్ అధ్యక్షుడూ శివసేన అధినేతకు జన్మదిన శుభాకాంక్షలు బహిర్గతంగా తెలపలేదు, కానీ రాహుల్ చేసి చూపించారు.

లోక్‌పాల్ బిల్లు అంశంపై కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీ వాల్‌కి విరోధంగా పోరాడాయి. మరో పక్క కాంగ్రెస్ మద్దతు తోనే ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని బీహార్ అసెంబ్లీకి దూరంగా ఉంచాలని కంకణం కట్టుకొని చిరకాల ప్రత్యర్థులైన నితీష్, లాలూ యాదవ్‌లు ఒకటయ్యారు.

బీజేపీ బీహారు కోటలో పాగా వెయ్యకుండా ఉండడంలో సఫలీకృతమైనా ఎన్నో ఏళ్ళ బట్టి ఎన్‌డిఏ తీర్థం పుచ్చుకొన్న నితీశ్‌ని లాలూతో సహవాసం ఎంతో కాలం బ్రతకలేకపోయింది.

కాంగ్రెస్ లేని భారతం అని బీజేపీ ఇంచుమించు చాలా రాష్ట్రాల ఎన్నికల్లో గెలిచి కాషాయపు రంగు రాస్తే, మేము అధికారంలోకి రాకపోయినా పర్వాలేదు కానీ బీజేపీకి ఇంకొక్క రాష్ట్రంలో కూడా అధికారమివ్వము అని కాంగ్రెస్ శపథం చేసింది. దాని ఫలితమే కర్ణాటకలో 38 సీట్లతో కుమారస్వామిని ముఖ్యమంత్రి పీఠం వరించింది.

మొన్న గోరఖ్ పూర్, కైరానాకి జరిగిన ఉప ఎన్నికలలో సమాజ్‌వాదీ,బహుజన సమాజ్ పార్టీలు ముందుగా రెండు పార్టీలు కలసి పొత్తు పెట్టుకున్నాయి, ఆ ప్రయోగం విజయవంతం అవ్వడంతో 2019 లోక్‌సభ ఎన్నికలకు అదే సూత్రంతో కూటమిని ఏర్పరచాలని నిర్ణయించాయి.

సమాజ్‌వాది పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీలు కలసిపోయి పొత్తు పెట్టుకోవడంలో ఆశ్చర్యం లేదు. ఈ రెండు పార్టీలు మొదటిసారి చేతులు కలపడంలేదు. 1991లో జనతాదళ్ విచ్ఛిన్నమయ్యాకా ఉత్తరప్రదేశ్‌లో మొట్టమొదటిసారి బిజెపి ప్రభుత్వానికి మెజారిటీ లభించి కళ్యాణ్ సింగ్ ముఖ్యమంత్రయ్యారు. బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత 1993లో, సమాజ్‌వాది పార్టీ, బిఎస్‌పి కలసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బిజెపిని ఓడించటానికి కలిసిపోయాయి. అయితే, 1993 లో మాయావతి ములాయంల మధ్య పెరిగిన రాజకీయ వ్యత్యాసాల కారణంగా రెండు పార్టీలు 1995 లో వేరు కుంపటి పెట్టుకున్నాయి.

ఆంధ్ర, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, కర్నాటక రాష్ట్రాలు 331 పార్లమెంట్ స్థానాలను కలిగి ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో పొత్తులు, శత్రుపక్షా లుంటే స్నేహ హస్తమందివ్వడానికి అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు మూడో కూటమి అని అటు కేసీఆర్ పట్టుదలతో ఢిల్లీ రాజకీయాలపై శ్రద్ధ పెట్టారు.

రాజకీయ నిబద్ధత, నీతి నియమాలు లేని భావసారూప్యత లేని వ్యక్తుల కలయికగా ఏర్పడే ఏ కూటమైనా మనుగడ కోల్పోయి ముగింపు తథ్యమని ఎన్నో పొత్తులు, కూటములు నిరూపించాయి. విధాన ప్రేరణల కంటే అధికారానికి లొంగిపోయే పార్టీలున్నంతవరకు అది కల గానే మిగిలిపోతుందా? 2019 లో ఈ కూటములు చరిత్ర తిరగరాసి ప్రత్యేకతను సంతరించుకొంటా యా?



సునీల్ ధవళ
9741747700



ఈఎన్‌టీ పరీక్షలకు సన్నాహాలు

• 'కంటి వెలుగు'కు త్వరలో ముగింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే నెలలో ప్రారంభించబోయే ఈఎన్‌టీ పరీక్షల ఏర్పాట్ల కోసం కంటి వెలుగు కార్యక్ర మాన్ని వీలైనంత ముందుగా ముగించేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిపెట్టింది. అదే తరహాలో చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షలు నిర్వహించా లని, ప్రజల హైల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ఈఎన్‌టీ వైద్య పరీక్షల శిబిరాలు ఏర్పాట్లు, హైల్త ప్రొఫైల్ తయారీ బాధ్యతలను కిందిస్థాయిలో ఏఎన్ఎం లకు అప్పగించారు. ఈనెల 16వ తేదీలోగా ఈఎన్‌టీ వైద్య శిబిరాల ఏర్పాట్లపై క్షేత్రస్థాయి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అనుకున్న లక్ష్యం మేరకు ఈనెల 26తో కంటివెలుగు కార్యక్రమం పూర్తికావల్సివుంది. కానీ అనేక చోట్ల వైద్య శిబిరాల్లో పేర్లు నమోదైన వారికి ఇంకా శస్త్రచికిత్సలు జరగాల్సివుంది. కొంతమేర కండ్ల అద్దాల పంపిణీ జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో దశలవారీగా పూర్తి అయిన కంటివెలుగు శిబిరాలను మూసివేయాలని అధికారులు భావిస్తున్నారు. గతఏడాది ఆగస్టు 15న మెదక్ జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఐదు నెలలుగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 7,500 గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో ఒక కోటీ ఇరవై ఎనిమిది లక్షల మంది పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 43.44 లక్షల మందికి వివిధ రకాల కంటి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. వారిలో 20 లక్షల మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. మరో 15.40 లక్షల మందికి ప్రత్యేక అద్దాలను అందజేయాలని నిర్ణయించి, వారిలో 5.21 లక్షల మందికి అద్దాలను అందజేశారు. మిగిలిన వారికి విడతల వారీగా అందజేయనున్నారు. ఇంకా లబ్ధిదారుల్లో అనేక మందికి శస్త్రచికిత్సలు చేయవల్సివుంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత తొందరగా శస్త్రచికిత్సలు పూర్తి చేసి, కంటివెలుగు కార్యక్రమాన్ని ముగించి.. ఫిబ్రవరి మొదటివారంలో ఈఎన్‌టీ శిబిరాలు ఏర్పాటు చేసేందుకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కంటివెలుగు మాదిరిగానే ప్రతీ గ్రామంలో ఈఎన్‌టి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు రెండు కోట్ల మందికి ఈఎన్‌టి పరీక్షలు అవసరమని భావిస్తున్నారు. చెవి, ముక్కు, గొంతు, దంత వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేసి, అవసరమైన వైద్య పరీక్షలన్నీ ఉచితంగా అందించేవిధంగా హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది. లబ్ధిదారులకు అవసరమైన వినికిడి యంత్రాలను అందజేయనున్నారు. ప్రభుత్వం ప్రత్యేక ఆసక్తితో చేపట్టనున్న వైద్య కార్యక్రమాల్లో ప్రైవేటు ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కానున్నాయి.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు

• పాత పంటల జాతరలో అకున్ సబర్వాల్




హైదరాబాద్, ఆంధ్రప్రభ: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ అన్నారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంస్థ ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్టుగానే ఈ ఏడాది కూడా సోమవారం పాత పంటల జాతరను నిర్వహించింది. 20వ పాత పంటల జాతరను అకున్ సబర్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ ప్రధానమైన పంజాబ్ రాష్ట్రంలో పుట్టిన తనకు వ్యవసాయంపై ఉన్న ప్రేమతోనే ఈ జాతరకు వచ్చానని తెలిపారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా 5000 మంది పేద, బలహీన వర్గాలకు చెందిన మహిళలు సంఘటితంగా చిరుధాన్యాలను పండిస్తూ సామాజిక, ఆర్థిక అసమానతలను దాటి, ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత వైపుగా అడుగులు వేయడం మెచ్చుకోదగ్గ విషయం అని అన్నారు. రైతులు తమకు ఇష్టమైన పంటను పండించుకొనే హక్కును గౌరవిస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం రైతులకు ఎంతో మేలు కలిగిస్తుందన్నారు. దాదాపు 1500 మంది మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడి సజ్జలు, కొర్రలు, రాగులు, అరికెలు, సాములు వంటి చిరుధాన్యాలను సేంద్రీయ పద్ధతిలో సాగుచేస్తున్నారు.

ఏఎన్‌యూ తాత్కాలిక వీసీగా ఆచార్య రాంజీ

అమరావతి, ఆంధ్రప్రభ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తాత్కాలిక వైఎస్ ఛాన్సలర్‌గా ఆచార్య కూన రాంజీ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కె.దమయంతి సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేస్తున్నారు. ప్రస్తుత విశ్వవిద్యాలయ వీసీ రాజేంద్రప్రసాద్ పదవీకాలం ఈనెల 12 తేదీ నాటికి ముగియడంతో ఆయన స్థానంలో ఇన్‌ఛార్జ్ వీసీగా రాంజీకి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేస్తున్న రాంజీ మంచి విద్యావేత్తగా, పరిపాలనాదక్షుడిగా పేరు గడించారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ ఆచార్యుడిగా పనిచేస్తూ గత కొన్ని నెలల క్రితం అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైనారు. ఇప్పటి వరకు ఆయన 30 మందికి పీహెచ్‌డీ డిగ్రీలు ఇవ్వటంతోపాటు 14 అంతర్జాతీయ సమావేశాలు, 53 జాతీయ సమావేశాలు నిర్వహించారు. అలాగే 162 సమావేశాలు, సింపోజియంలు, వర్కుషాపుల్లో పాల్గొని పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 123 పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్రప్రభుత్వం 2010లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఉత్తమ ఇంజినీర్‌అవార్డులను కూడా అందించింది. అలాగే ఆయన ఏయూ నుంచి సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డు, గవర్నర్ చేతులమీదుగా ఉత్తమ పరిశోధన అవార్డు, ఏయూసీఈ నుండి విజ్ఞాన ప్రతిభ పురస్కారంతోపాటు ఉత్తమ పరిశోధకుడిగా బంగారు పతకం అందుకున్నారు.


ఆపరేషన్ 'కమల్'?





కర్నాటకలో హైడ్రామా

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు బీజేపీ గాలం
- ముంబైలో ముగ్గురితో బేరసారాలు
- ధ్రువీకరించిన కాంగ్రెస్‌నేత డీకే శివకుమార్
- ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర అంటూ ఆరోపణ
- సిద్ధరామయ్య నేతృత్వంలో సీనియర్ల భేటీ
- ఆ ముగ్గురూ నాతో టచ్‌లో ఉన్నారు: సీఎం కుమారస్వామి
- సంక్రాంతి తర్వాత కొత్త ప్రభుత్వం : బీజేపీ వర్గాల వ్యాఖ్య
- వరుస పరిణామాలపై సర్వత్రా ఉత్కంఠ.. ఆ మూడు పార్టీల్లో గుబులు



బెంగళూరు: కర్నాటక రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అదృశ్యం కావడం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్, జేడీ(ఎస్), బీజేపీ చేస్తున్న ప్రకటనలు, వ్యాఖ్యలు రాజకీయ కలకలానికి తెరలేపాయి. మా సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర నీటిపారుదల మంత్రి డీకే శివకుమార్ బాంబు పేల్చారు. ముగ్గురు ఎమ్మెల్యేలను బీజేపీ నేతలు ముంబై తరలించారని, ఓ హోటల్‌లో దాచివుంచి, వారితో బేరసారాలు సాగిస్తున్నారం టూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి, జేడీ(ఎస్) చీఫ్ కుమారస్వామి ఇందుకు భిన్నంగా కామెంట్ చేశారు. ముగ్గురు ఎమ్మెల్యేలు తనకు సమాచారం ఇచ్చే ముంబై వెళ్లారని, తనతో టచ్‌లో ఉన్నారని చెప్పడం మరో విధమైన చర్చకు తెరలేపినట్లు అయింది. కుమారస్వామి భాజపాకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన కాషాయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని శివకు మార్ చేసిన ఆరోపణలు సంకీర్ణ కూటమిలో అగ్గిరాజేసి నట్లయింది. కాగా, బీజేపీ ఎమ్మెల్యేలు నలుగురైదుగురు తమతో సంప్రదింపులు జరుపుతున్నారన్న కాంగ్రెస్ ప్రచారం తో కాషాయ పార్టీలోనూ కలవరం మొదలైంది. తమ ఎమ్మెల్యే లను కొనుగోలు చేసేందుకు జేడీ(ఎస్) ప్రయత్నిస్తోందని విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప ఆరోపించారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యేలను సురక్షిత రహస్య ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారని కన్నడ రాజకీయ వర్గాల ప్రచారం. అయితే, తాజా పరిణామాలపై కర్నాటక కాంగ్రెస్ చీఫ్ గుండూరావ్ ఒకింత ధీమాతో ఉన్నారు. ఇప్పటికిప్పుడు తమ సంకీర్ణ ప్రభుత్వానికి ముప్పేమీ లేదని, ముంబైలో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలు త్వరలోనే తిరిగొస్తారని, పార్టీ గూటికి చేరతారని గుండూరావ్ మీడియాకు తెలిపారు.

సీఎం వాస్తవాలు దాస్తున్నారు : డీకే శివకుమార్

కొందరు బీజేపీ నేతలతో కలిసి మా పార్టీ ఎమ్మెల్యేలు ముగ్గురు ముంబైలోని పొవాయ్ హోటల్‌లో ఉన్నారు. వీరితో బీజేపీ బేరసారాలు సాగిస్తోంది. అక్కడేం జరుగుతున్నదో మాకుతెలుసు. ఎమ్మెల్యేలకు ఎంత మొత్తం ఆఫర్ చేస్తున్నా రో కూడా తెలుసు. వారెవరిని కలిసేందుకు వెళ్లారో మాత్రం తెలీదు. మరోసారి రాష్ట్రంలో ఆపరేషన్ కమల్‌కు బీజేపీ తెరలేపింది. 2008లో ఎలాగైతే ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనేసి, యడ్యూరప్ప నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందో అందరికీ తెలుసు. ఇప్పుడూ ఇలాంటి కుట్రే జరుగుతోందని మంత్రి డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతే కాదు ఏకంగా ముఖ్యమంత్రి కుమారస్వామి తీరుపై సందేహం వ్యక్తంచేశారు. మా ముఖ్యమంత్రి బీజేపీ పట్ల కరుణ చూపుతున్నారు. ఆయనకు తెలిసిన వాస్తవాలను వెల్లడించడం లేదు. జరుగుతున్న పరిణామాలను ఎమ్మెల్యేలంతా ఆయనకు వివరించారు. దీన్ని సిద్ధరామయ్య దృష్టికి కూడా తీసుకెళ్లారు. సీఎం వేచిచూసే ధోరణితో ఉన్నారు. నేనే గనుక ఆయన స్థానంలో ఉంటే, ఈ కుట్రను 24 గంటల్లోగా బట్టబయలు చేసేవాడినంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైతే ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని, బీజేపీ ఆటలు సాగవని, పాచిక పారదని శివకుమార్ తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పార్టీలో మంచి పరిష్కారకర్తగా శివకుమార్‌కు గుర్తింపు ఉంది. ఇదివరకు పలు సందర్భాల్లో నేర్పుగా వ్యవహరించి పార్టీని విపత్తునుంచి గట్టెక్కించారు. తాజా పరిస్థితులపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్ధరామయ్య, పరమేశ్వర, దినేశ్ గుండు రావ్, శివకుమార్ అత్యవసరంగా భేటీ అయ్యారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టడంపై దృష్టిసారించారు.

ఐటీ, ఏసీబీ ఎందుకు స్పందించవు?

ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన వ్యవహారంపై మా పార్టీ చీఫ్ దినేశ్ ఆదాయపన్ను అధికారులకు, అవినీతి నిరోధక అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదు. ఒక ప్రధాన రాజకీయ పార్టీ ఫిర్యాదును లక్ష్యపెట్టక పోవడం బాధాకరం. ఐటీ, ఏసీబీ ఉద్దేశమేమిటో బోధపడటంలేదు. దక్షిణ కర్నాటకలోని మా ఎమ్మెల్యేలను కొనేందుకు బీజేపీ ప్రయత్నాలు చేసింది. వారే ఈ విషయాన్ని స్వయంగా చెప్పారు. కాంగ్రెస్ నుంచి బయటకొచ్చి వారి పార్టీలో చేరాలని నయానా, భయానా బేరసారాలు చేస్తున్నారని శివకుమార్ ఆరోపించారు.

సంక్రాంతి తర్వాత కొత్త ప్రభుత్వం : బీజేపీ



ఆపరేషన్ కమల్ దిశగా బీజేపీ పక్కా వ్యూహంతో ముందుకెళ్తుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. వరుస పరిణామాలను చూస్తుంటే ఈ దిశగా కమలనాథులు వడివడిగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. గత కొద్దిమాసాలుగా కాంగ్రెస్, జేడీ(ఎస్)కు చెందిన కొందరు ఎమ్మెల్యేలతో బీజేపీ పెద్దలు సంప్రదింపులు జరుపుతూ వచ్చారని తెలుస్తున్నది. రానున్న లోక్‌సభ ఎన్నికల కోసమే ఈ వ్యూహం అమలవుతోందని, ఈ క్రమంలో సంక్రాంతి తర్వాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడబోతున్నదని బీజేపీ వర్గాలు ఉప్పందిస్తున్నాయి. కాంగ్రెస్-జేడీ (ఎస్) కలసివుంటే, సార్వత్రిక ఎన్నికల్లో మాకు ఇబ్బంది. రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ సీట్లు నెగ్గడం చాలా అవసరం. ఇక్కడ మా ప్రభుత్వం అధికారంలో ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. సంకీర్ణ ప్రభుత్వం విచ్ఛిన్నమైతే, అధికారం కోల్పోతే జేడీ(ఎస్) ఒంటరిగా ఎన్నికలకు వెళ్తుంది లేదంటే ఎన్డీయేలో చేరుతుంది. ఈ అనూహ్య పరిణామంతో కాంగ్రెస్ స్థయిర్యం కోల్పోతుంది. అందుకే మా నాయకులు ఆపరేషన్ కమల్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు అని బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే ఒకరు వెల్లడించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. ఇదంతా అసత్య ప్రచారమని, ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేలను కొనాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

ఒక్కొక్కరికి రూ. 30 కోట్లు ఆఫర్!

గతేడాది ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచి దాదాపు డజనుసార్లు బీజేపీ ఇలాంటి ప్రయత్నాలు చేసింది. దాన్ని కాంగ్రెస్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. కేబినెట్ నుంచి తొలగించబడ్డ ఎమ్మెల్యే రమేశ్ ఝార్కి హోలిని కమలనాథులు పావుగా వాడుకుంటున్నారు. రమేశ్ ద్వారా మిగతా వారిపైకి వల విసిరాలని చూస్తున్నారు అని కాంగ్రెస్ వర్గీయుల ఆరోపిస్తున్నారు. పది మంది ఎమ్మెల్యేలను తనతో తీసుకెళ్లేందుకు ఝార్కి ప్రయత్నిస్తున్నారు. అయితే కేవలం ఇద్దరు మాత్రమే ఆయనతో వెళ్లారు. వీరిలో గుల్బర్గా ఎమ్మెల్యే జాదవ్ ఒకరు అన్న ప్రచారం జరుగుతోంది. వారం రోజుల కిందట ఈ విషయమై సిద్ధరామయ్య బాంబు పేల్చారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 30 కోట్లు బీజేపీ ఆఫర్ చేస్తోందని చెప్పారు. 37 మంది సభ్యులున్న జేడీ(ఎస్) వర్గాన్ని తొలుత టార్గెట్ చేసింది. అక్కడ పాచిక పారలేదు. దాంతో ఉత్తర, దక్షిణ కర్నాటకకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలపైకి వలపన్నారని మాజీ సీఎం వెల్లడించిన విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మునుపటి ఎన్నికల ఫలితాలు పునరావృతం కావని తెలిసి దక్షిణాదిపై కమలనాథులు దృష్టిసారించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

టార్గెట్-16?

కర్నాటక అసెంబ్లీలో మొత్తం 224 మంది ఎమ్మెల్యేలున్నారు. కాంగ్రెస్ 80, జేడీ(ఎస్) 37, బీఎస్పీ ఒకరు, ఇద్దరు స్వతంత్రులతో కలిసి కుమారస్వామి సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. నాటి ఎన్నికల్లో బీజేపీ 104 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అధికారానికి 8 సీట్లు తక్కువయ్యాయి. అధికార కూటమిలో నుంచి కనిష్టంగా 16 మంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించగలిగితే, బీజేపీ అధికార పీఠం దక్కించుకోగలుగుతుంది. అప్పుడు సభలో సంఖ్యాబలం 208కి పడిపోతుంది. మేజిక్ ఫిగర్ 104కి చేరుతుంది. దాంతో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం సాధ్యమవుతుంది.



హోం మంత్రికి టీయూఎఫ్ సన్మానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో టీఆర్ఎస్ పార్టీ గెలవడం తరువాత ఏర్పడిన మంత్రివ ర్గంలో మహ్మద్ మహమూద్ అలీ హోం శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ది యూనైటెడ్ ఫోరమ్(టీయూఎఫ్) నేతలు సోమవారం సన్మానం చేశారు. ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు జీఎస్ కుమారస్వామి అధ్వర్యంలో నేతలు సోమవారం హోం మంత్రిని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

దుష్ప్రచారాన్ని అడ్డుకోండి

- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దాడి
- ఆ చర్యల వెనుక టీడీపీ హస్తం
- హైదరాబాద్ సీపీకి వైసీపీ నేత షర్మిల ఫిర్యాదు
- కేసు నమోదు.. దర్యాప్తు కోసం ప్రత్యేక బృందం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సామాజిక మాధ్యమాలలో కొంత మంది పని గట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తననూ, తన కుటుంబస భ్యులను మానసిక క్షోభకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ నేత షర్మిల హైదరా బాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వైకాపా నేతలు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వాసిరెడ్డి పద్మ తదితరులతో సోమవారం సీపీని కలిసిన షర్మిల ఈ మేరకు ఒక వినతి పత్రం అందించారు. తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం బాధాకరమని, వీటి వెనుక టీడీపీ ప్రమేయం ఉందని తర్వాత మీడి యాతో మాట్లాడిన షర్మిల ఆరోపించారు. తనకూ, సినీ నటుడు ప్రభాస్‌కు సంబంధం ఉందంటూ కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని, .తన జీవితంలో ప్రభాస్‌ను ఎప్పుడూ కలవలేదని, మాట్లాడలేదని అన్నారు. తనపై 2014లోనూ ఇలాంటి ప్రచారాలే చేశారని, అప్పుడు పోలీసు లు చర్యలు తీసుకోవడంతో కొంతకాలం ఆగింద న్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్ళీ తనపై దుష్ప్రచారాన్ని మొదలు పెట్టార న్నారు. ఇది తన ఒక్క దానికే జరిగిన అవమాన మని భావించ డం లేదని, స్త్రీల పట్ల చులకన భావంతో రాస్తున్న రాతలను, దుష్ప్రచారాన్ని సమా జం ఆమోదించవచ్చా అని షర్మిల ప్రశ్నించారు. ఇలాంటి దాడులపై గొంతెత్తాల్సిన అవసరం ఉందని, సామాజిక మాధ్యమాలలో ఇలాంటి ప్రచారాలను వీలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తనకు ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టులు, మహిళ లు మద్దతు పలకాలని షర్మిల కోరారు.

ఏపీ పోలీసులపై నమ్మకం లేదు

సామాజిక మాధ్య మాల లో తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఏపీ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వక పోవడంపై షర్మిల స్పష్టత ఇచ్చారు. తనకు ఏపీ పోలీసులపై నమ్మకం లేదని, ఫిర్యాదు తీసుకున్నా కేసు నమోదు చేస్తారో చేయరో తెలియదని, చేసినా దర్యాప్తు సక్రమంగా జరుగుతుందా అన్నది కూడా అనుమానం ఉంది కాబట్టే తెలంగాణ పోలీసులకు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. గతంలో విశాఖ పట్టణం ఎయిర్‌పోర్టు లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన కోడి కత్తి దాడి అనంతరం కూడా జగన్ ఇదే తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కాగా వైఎస్ షర్మిల ఇచ్చిన ఫిర్యాదుపై హైదరాబాద్ పోలీసులు స్పందించారు. ఫిర్యాదును సైబర్ క్రైం విభాదానికి సీపీ అంజనీకుమార్ బదలీ చేయడంతో సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులపై సెక్షన్ 67 ఐటీ చట్టం 2000(ఏ ఎలక్ట్రానిక్ పరికరం ద్వారానైనా అసత్యాలను ప్రచారం చేయడం), ఐపీసీ సెక్షన్ 509 (మహిళలను కించపరచడం)కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డిటెక్టివ్ విభాగం అదనపు డీసీపీ రఘువీర్ ఆధ్వర్యంలో దర్యాప్తు సాగనుంది. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

నిందలు కాదు... నిరూపించండి

నైతికతను నిరూపించుకోవాల్సిన అవసరం తనకు లేదని, అయితే వ్యక్తిగత గౌరవాన్ని కాపాడుకోవడం కోసం ఇప్పుడు పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందని షర్మిల స్పష్టం చేశారు. ప్రభాస్ అనే వ్యక్తితో తనకు సంబంధం ఉందని ప్రచారం చేస్తున్న వారు ఆధారాలు చూపించాలని షర్మిల డిమాండ్ చేశారు. ఆయనను నేనెప్పుడు కలిశాను, ఏం మాట్లాడానో నిరూపించాలని సవాల్ చేశారు. ఏవో పుకార్లు పుట్టించి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యర్థులు సృష్టిస్తున్న వదంతులతో భర్త, పిల్లలు, బంధువర్గం క్షోభకు గురవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతర్జాల వ్యవస్థపై నిఘాకు ఆదేశాలు...

కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: దేశంలోని ప్రతీ కంప్యూటర్ వ్యవస్థను రహస్యంగా పర్యవేక్షించడం, అంతరాయం కలిగించడం , డీకోడ్ చేసేందుకు దేశంలోని పది కేంద్ర సంస్థలకు అధికారాన్ని ఇస్తూ కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 20న జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ పిల్ దాఖలవ్వడంతో కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో ప్రభుత్వాన్ని కోరింది. సమాచార సాంకేతిక చట్టం ప్రకారం పది కేంద్ర సంస్థలు దేశంలోని ప్రతీ కంప్యూటర్ వ్యవస్థను పర్యవేక్షించడం, అడ్డగించడం, డీకోడ్ చేసేందుకు వీలుగా కేంద్ర హోంశాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌పై దాఖలైన పిల్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్ ముందు విచారణకు వచ్చింది. హోంశాఖ జారీ చేసిన నోటిఫికేషన్ చట్టవ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని ఈ పిల్ దాఖలు చేసిన న్యాయవాది మనోహర్ లాల్ శర్మ పేర్కొన్నారు. సమాచార సాంకేతిక చట్టం ఆధారంగా ఇతరులకు వ్యతిరేకంగా విచారణ, తనిఖీని నిషేధించాలని పిల్‌లో కోరారు. ప్రస్తుత రాజకీయ పార్టీల అవసరం కోసం, రాజకీయ దురుద్దేశంతోనే ప్రతీ సంభాషణలు, కంప్యూటర్, మొబైళ్ల సమాచారాన్ని పర్యవేక్షించే అవకాశాన్ని సంస్థలకు కల్పించారని న్యాయవాది తన పిటిషన్‌లో పేర్కొన్నారు.కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌లో ఇంటిలిజెన్స్ బ్యూరో, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, రిసెర్చ్ ఎనాలిసిస్ వింగ్, డైరెక్టరేట్ ఆఫ్ సిగ్నల్ ఇంటిలిజెన్సీ, ఢిల్లీ పోలీసు కమీషనర్ సంస్థల పేర్లు ఉన్నాయి. ఇదిలావుండగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌పై ప్రతిపక్షాలు విమర్శలు చేసిన సంగతి తెలిసిందే.

సీబీఐ మధ్యంతర డైరెక్టర్‌పై పిల్

సీబీఐలోని నెలకొన్న గందరగోళ పరిస్థితి కొనసాగుతోంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సమావేశ



మైన ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ఉన్నత స్థాయి కమిటీ సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను తొలగించింది. ఎం. నాగేశ్వరరావును మధ్యంతర డైరెక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే సీబీఐ మధ్యంతర డైరెక్టర్‌గా ఎం. నాగేశ్వరరావుకు బాధ్యతలు అప్పగిం చడాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో సోమవారం ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కామన్ కాజ్ అనే ఎన్‌జీఓ తరపును ప్రశాంత్ భూషణ్ అనే న్యాయవాది ఈ పిల్‌ను దాఖలు చేశారు. ఎం. నాగేశ్వరరావును మధ్యంతర డైరెక్టర్‌గా నియమిస్తూ జనవరి 10న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. లోక్‌పాల్, లోకాయుక్త యాక్ట్, 2013 ద్వారా సవరించిన ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1946లోని సెక్షన్ 4ఏలో పొందుపరిచిన ప్రక్రియ ద్వారా రెగ్యులర్ సీబీఐ డైరె క్టర్‌ను నియమించేందుకు కేంద్రప్రభుత్వానికి తక్షణ మే ఆదేశాలు జారీ చేయాలని స్వచ్ఛంద సంస్థ కోరింది.

రెండు సార్లు..

సీబీఐలో అవినీతి ఆరోపణలు, వివాదం మొదలైనప్పుడు డైరెక్టర్ అలోక్ వర్మను కేంద్రప్రభుత్వం, సీవీసీ ఒత్తిడి మేరకు సెలవుపై పం పిస్తూ సీబీఐ మధ్యంతర డైరెక్టర్‌గా ఎం. నాగేశ్వర రావును నియమించింది. సుప్రీం కోర్టులో విచారణ ముగిసిన అనంతరం సుప్రీం ఆదేశాలతో అలోక్ వర్మ తిరిగి బాధ్యతలు పెట్టారు. కానీ ప్రధాని ఆధ్వర్యంలో నియామకం అయిన ఉన్నతస్థాయి కమిటీ అలోక్ వర్మను తొలగించింది. అదే సమయంలో రెండోసారి ఎం. నాగేశ్వరరావుకు మధ్యంతర బాధ్యతలు అప్ప గించింది. ఇదిలావుండగా అగ్నిమాపక, పౌర రక్షణ, హోంగార్డ్సుకు డైరెక్టర్ జనరల్‌గా అలోక్ వర్మను నియ మించగా ఆయన రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

సజ్జన్ అప్పీల్‌పై మీ వైఖరేంటి?

1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో తనను దోషిగా తేల్చడంపై కాంగ్రెస్ పార్టీ మాజీ నేత సజ్జన్ కుమార్ అపీలు మేరకు సుప్రీంకోర్టు సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ప్రధానన్యాయమూర్తి రంజన్ గొగోయ్, జడ్జీలు అశోక్ భూషణ్, ఎస్కే కౌల్‌తో కూడిన బెంచ్ సజ్జన్ కుమార్ బెయిల్ అభ్యర్థనపై కూడా సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఇదిలావుండగా 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసుపై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను దోషిగా తేల్చి జైలుశిక్ష విధిస్తూ డిసెంబర్ 17న తీర్పును వెలువరించింది. డిసెంబర్ 31, 2018న సజ్జన్ కుమార్ ట్రయల్ కోర్టు ముందు హాజరయ్యారు. ఢిల్లీలోని గురుద్వారాను తగలబెట్టడంతోపాటు ఐదుగురు శిక్కుల హత్యకు కారణమయ్యాడని విచారణలో తేలడంతో కోర్టు దోషిగా ప్రకటించింది.ఇదిలావుండగా అక్టోబర్ 31, 1984న అనాటి ప్రధాని ఇందిరా గాంధీని ఆమెకు బాడీగా ర్డులుగా పనిచేస్తున్న ఇద్దరు సిక్కు వ్యక్తులు హత్య చేయడంతో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి. నేర పూరిత కుట్ర, హత్యలు, మతం పేరిట అల్లర్లను ప్రొత్స హించడంతోపాటు గురుద్వారాను తగలబెట్టేం దుకు కారణమయ్యారని సజ్జన్ కుమార్‌పై కేసు నమో ద.వ్వగా విచారణ జరిపిన న్యాయస్థానం దోషిగా తేల్చిం ది. ఈ అల్లర్లలో దేశరాజధాని ప్రాంతంలో 2,700 మంది సిక్కులు మృతి చెందారని తీర్పులో పేర్కొంది.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

ఐటీ పరిమితి పెంపు?

• రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షలకు

న్యూఢిల్లీ : ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టే తాత్కాలిక బడ్జెట్‌లో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మధ్యతరగతిని ప్రసన్నం చేసుకోవడానికి పలు తాయిలాలు ప్రకటించే అవకాశాలున్నాయి. ఆదాయపు పన్ను పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో పాటు వైద్య, రవాణా ఖర్చుల అలవెన్స్‌పై టాక్స్ ఫ్రీ స్టాటస్‌లోకి తీసుకొచ్చే అవకాశాలున్నాయని విశ్వసనీయవర్గా ల ద్వారా తెలిసింది. పెద్దనోట్ల రద్దు తర్వాత మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురి కావడం తో వచ్చే లోకసభ ఎన్నికల నేపథ్యంలో వారికి దగ్గర కావాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఆదాయపు పన్ను రూ.2.5 లక్షల వరకు మాత్రమే పరిమితి ఉంది. అది దాటిందటే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. రూ.2.5 లక్షల నుంచి రూ.5లక్షల వ్యక్తిగత ఆదాయం గల వారికి 5 శాతం పన్ను విధిస్తున్నారు. అదే రూ.5-10 లక్షల వ్యక్తిగత ఆదాయం వారికి 20 శాతం, అదే రూ.10 లక్షలు ఆపై వచ్చే ఆదాయంపై 30 శాతం వరకు పన్ను విధిస్తున్నారు. ప్రస్తుతం 80 ఏళ్లుపైబడిన వారికి మాత్రమే రూ.5 లక్షల వరకు ఆదాయపుపన్ను మినహాయింపు ఉంది.

ఎరువు... భారం

సబ్సిడీలపై రూ.30 వేల కోట్లు అదనం

• గ్లోబల్ మార్కెట్లో ధరలు పెరుగుదల • డాలర్ మారకంతో రూపాయి బలహీనపడ్డం కారణం • ఈ ఆర్థిక సంవత్సరం ఎరువుల సబ్సిడీ భారం రూ.లక్ష కోట్లు • బడ్జెట్‌ను మించి అదనపు వ్యయంపై కాగ్ ఆక్షింతలు



న్యూఢిల్లీ / ముంబై : కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి ఎరువుల సబ్సిడి భారం తలకు మించిన భారంగా మారుతోందని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ బిల్లు 4.2 బిలియన్ డాలర్లు లేదా రూ.30వేల కోట్ల భారం ప్రభుత్వం నెత్తినపడుతోంది. ఈ అదనపు భారాన్ని ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకులపై రుద్దేందుకు ప్రయత్నిస్తోందని తాజా పరిణామాలను దగ్గరి నుంచి గమనిస్తున్న వారు చెబుతున్నారు.

ఈ ఆర్థికసంవత్సరంలో మోడీ ప్రభుత్వం ఎరువులసబ్సిడికి రూ. రూ.70.8వేలకోట్లను కేటాయించింది. కేటాయించిన మొత్తంలో సగం కంటే ఎక్కువ మొత్తాన్ని గత ఏడాది బకాయిలు తీర్చడానికి వినియోగించింది. గ్లోబల్ మార్కెట్లో ఎరువుల ధరలు పెరగడం, డాలర్ మారకంతో రూపాయి బలహీనపడ్డం తదితర కారణాలవల్ల ఎరువుల ధరలు ఖరీదైన వ్యవహారంగా మారాయి. దీంతో ప్రభుత్వానికి సబ్సిడి ల భారం రూ.1 లక్షకోట్లకు చేరుతుందని, గతంలో ఈ స్థాయి లో ఎన్నడూ ధరలు పెరిగిన దాఖలాల్లేవని ఆ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా పెరిగిన సబ్సిడి భారాన్ని ఈ ఏడాది భరించమని ఆర్థికమంత్రిత్వశాఖ... రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ ఖరాఖండిగా తేల్చి చెప్పింది. అయితే ప్రభుత్వం స్థానిక ఎరువుల కంపెనీలకు ప్రత్యేకంగా బ్యాంకులతో ఒప్పందం కుదర్చాలని చూస్తున్నాయని ఆ వర్గా లు పేర్కొన్నాయి.

ప్రభుత్వం ఎరువుల కంపెనీలను బ్యాంకులతో ఒప్పందాలు చేయించడంతో ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న బ్యాంకుల పరిస్థితి మరింత గందర గోళంంలో పడే అవకాశం ఉంటుం ది. అయితే ఇక్కడ గమనించాల్సింది ఇటీవల ఉత్తరాది రాష్ట్రాల్లో జరిగిన శాస నసభ ఎన్నికల అధికార బీజే పీ పార్టీ ఘోరపరాజయం తర్వాత ప్రభుత్వం రైతులు, చిన్న వ్యాపారులను ప్రస న్నం చేసుకోవడానికి ఈ అదనపు సబ్సి డి భారాన్ని మోయడానికి సిద్ధంగా ఉంది. అదీ కాకుండా వచ్చే లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే రైతులకు ఆకర్షించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.



బ్యాంకుల ద్వారా ఎరువుల కంపెనీలకు సబ్సిడీని సర్దుబాటుచేస్తే ప్రభుత్వం ఈ ఆర్థిక సంవ త్సరం ద్రవ్యలోటు లక్ష్యం జీడీపీ లో 3.3 శాతం సాధించే అవకాశం ఉంటుంది.

ఇదిలా ఉండగా కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండి యాకు మాత్రమే కేంద్ర, రాష్ట్రా ల బడ్జెట్ ను సమీక్షించే అధికా రం ఉంటుం ది. అయితే గత వారం కాగ్ కూడా ప్రభుత్వం బడ్జె ట్ కంటే మించి పెద్దమొత్తం లో వ్యయం చేస్తోం దని విమర్శలు గుప్పించింది. స బ్సిడి భారాన్ని బ్యాంకులు మోసే లా సర్దుబాటు చేయడం ఆర్థిక వ్యవస్థకు చేటు చేస్తుందని కాగ్ పేర్కొంది.తాజా పరిణామా లపై ఆర్థికమంత్రిత్వశాఖ అధి కార ప్రతినిధి స్పందంచ డానికి నిరాకరించారు. అలాగే ఎరువు లమంత్రిత్వశాఖ తక్షణమే స్పందిం చడా నికి నిరాకరించింది. గతంలో కేంద్రప్రభు త్వం సబ్సిడీల అదన పు భారం చెల్లింపులో జాప్యం అ యితే అప్పుడు కూడా ప్రత్యే కం గా బ్యాంకులతో సర్దుబాటు చేసుకుంది. ఉదా హరణకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో అప్పుడు ఒప్పందం కుద ర్చు కుంది.

జోరు తగ్గిన పన్ను వసూళ్లు

ప్రస్తుతం ప్రభుత్వానికి పన్ను వసూళ్లు బాగా తగ్గాయి. దీంతో ఈ ఏడాది ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడి మొత్తం చెల్లించే అవకాశాలు కనిపించడం లేదని కో ఆపరేటివ్ ఎరువుల కంపెనీకి చెందిన సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. తన పేరు వెల్లడించడానికి ఆయన సుముఖుల వ్యక్తం చేయలేదు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా బకాయిలను వచ్చే ఏడాదికి బదిలీ చేయవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నెల వారి జీఎస్టి వసూళ్లు సరాసరి అంచనా రూ.96,780 కోట్ల కంటే తక్కువ వసూలు అవుతున్నాయి. ప్రభుత్వం అంచనా మాత్రం ప్రతి నెల రూ.1.2 లక్షల కోట్లు జీఎస్టి పన్ను వసూలు అవుతాయని అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఎరువుల మంత్రిత్వశాఖ ఎరువుల సబ్సిడిని రూ.1 లక్ష కోట్లను ఆర్థికమంత్రిత్వశాఖ నుంచి కోరే అవకాశం కనిపి స్తోంది. ఫిబ్రవరి 1వ తేదీన వచ్చే ఆర్థిక సంవత్స రానికి అరుణ్‌జైట్లీ లోకసభలో తాత్కాలిక బడ్జెట్ సమర్పిస్తారు.

ఇదిలా ఉండగా భారత ప్రభుత్వం సబ్బడి భారాన్ని ప్రైవేట్ ఎరువుల కంపెనీలు ఉదాహరణకు కోర మాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, చంబల్ ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్‌కు నేరు గా చెల్లిస్తుంది. అలాగే గుజరాత్ నర్మదా వ్యాలీ ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్‌లు దేశంలోని లక్షలాది మంది రైతులకు డిసౌంట్ రేట్లకు ఎరువులు విక్రయిస్తున్నాయి. ఆ డిస్కౌంట్‌ను ప్రభుత్వం భరిస్తుం ది.



మారుతి వ్యాగెన్ ఆర్ బుకింగ్‌లు షురూ

• 23న మార్కెట్లో విడుదల

న్యూఢిల్లీ : మారుతి సుజుకి ఇండియా (ఎంఎస్ఐ) సోమవారం నుంచి కొత్త వెర్షన్ వ్యాగెన్ ఆర్ బుకింగ్‌లు ప్రారంభించింది. ఆసక్తి కలిగిన కస్టమర్లకు అధీకృత డీలర్ల వద్ద రూ.11,000లు చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చునని కంపెనీ ఒక ప్రకట నలో వెల్లడించింది. కావాలనుకుంటే కంపెనీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా బుకింగ్‌లు చేసుకోవచ్చునని సూచించింది. ఈ కారును ఈ నెల 23వ తేదీన మార్కెట్లో విడుదల చేస్తుంది. 'బిగ్ న్యూ వ్యాగెన్ ఆర్' విషయానికి వస్తే పెట్రోల్ ఇంజిన్ 1.2 లీటర్‌తో పాటు లీటర్ ఇంజిన్ సామర్థ్య కలిగిన కారు కూడా అందు బాటులో ఉంచుతోంది. దీంతో పాటు కావానుకుంటే ఆటోమెటిక్ గేర్ షిఫ్ట్ వెర యెంట్‌ను కూడా అందిస్తున్నట్లు పేర్కొంది. కాగా కొత్త వ్యాగెన్ ఆర్ విషయానికి వస్తే ఫిఫ్త్ జనరేషన్ హార్ట్‌టెక్ ఫ్లాట్‌ఫాంపై తయారు చేశారు. దీంతో ఈ కారు స్థిరంగా.. బలంగా సురక్షితంగా ఉంటుందని కంపెనీ ప్రకటనలో వివరించింది. భద్రత కోసం కొత్త ఉక్కును వినియోగించినట్లు తెలిపింది. ఫీచర్ల విషయానికి వస్తే డ్రైవర్ వైపు ఎయిర్‌బ్యాగ్‌తో పాటు యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఈబిడి (ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్) ఫ్రంట్ సీట్ బెల్ట్ రిమైండర్, స్పీడ్ అలర్ట్ సిస్టమ్ రెయిర్ పార్కింగ్ సెన్సార్‌లను ఇస్తున్నట్లు ప్రకటించింది.

పెట్రోల్ రూ. 70,డీజెల్ రూ. 64

• వరుసగా ఐదో రోజు పెరిగిన ధరలు



న్యూఢిల్లీ : పెట్రోల్ ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. సోమవారం నాడు ఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ.70 మార్కును డిజెల్ విషయానికి వస్తే రూ.64 లీటరును దాటిపోయింది. పెట్రోల్, డిజెల్ ధరలు వరుసగా ఐదో రోజు పెరిగాయి. సోమవారం నాడు పెట్రోల్‌పై 38 పైసలు, డిజెల్‌పై 49 పైసలు పెరిగినట్లు ప్రభుత్వరంగానికి చెందిన చమురు కంపెనీలు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించాయి. ప్రస్తుతం ఢిల్లీలో పెట్రోల్ లీటరు రూ.70.13, డిజెల్ లీటరు రూ. 64.18కి చేరింది. వరుసగా పెట్రోల్ ధరలు పెరగడం ఇది 5వ రోజు, ఈ నెల మొత్తానికి చూస్తే ఆరవ పెంపు. ఆదివారం నాడు పెట్రోల్‌పై 49 పైసలు, డిజెల్‌పై 59 పైసలు పెరిగింది. మొత్తానికి చూస్తే కొత్త సంవత్సరం నుంచి పెట్రోల్‌పై రూ.1.84, డిజెల్ రూ.2.02 వరకు పెరిగాయి. ఇక ముంబై విషయానికి వస్తే పెట్రోల్ తిరిగి రూ.75.77, డిజెల్ రూ.67.18కి ఎగబాకింది. పెట్రోల్, డిజెల్ ధరలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటాయి. దీని ప్రధాన కారణం.. స్థానిక పన్నుల్లో వ్యత్యాసమే దీనికి కారణం. ఈ నెల 7వ తేదీ నుంచి పెట్రోల్, డిజెల్ ధరలు క్రమంగా పుంజుకోవడం మొదలయ్యాయి.

రూపాయి @ 70.92

• 43 పైసలు పతనం • నెల కనిష్ఠానికి



ముంబై : డాలర్ మారకంతో రూపాయి సోమవారం నాడు ఏకంగా 43 పైసలు క్షీణించి నెల కనిష్ఠానికి 70.92 మార్కుకు దిగివచ్చింది. ముఖ్యంగా పారిశ్రామికోత్పత్తి గణాంకాలు బలహీనంగా నమోదు కావడంతో పాటు దేశీయ స్టాక్ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ కావడంతో పాటు విదేశీ పెట్టుబడులు స్టాక్ మార్కెట్ల నుంచి తరలిపోవడం తదితర కారణాల వల్ల రూపాయి బలహీనపడిందని ఫారెక్స్ ట్రేడర్లు చెబుతున్నారు. గ్లోబల్ మార్కెట్లో డాలర్ బలహీనపడ్డంతో పాటు ముడిచమురు ధరలు తగ్గడంతో దేశీయ కరెన్సీ మరింత పడిపోకుండా అడ్డుకట్ట వేశాయి. స్థానిక ఫారెక్స్ మార్కెట్లో ట్రేడింగ్ విషయానికి వస్తే ఉదయం రూపాయి స్థిరంగా 70.50 వద్ద ట్రేడింగ్ మొదలై అటు తర్వాత 70.44 మార్కుకు ఎగబాకింది. అటు తర్వాత ఇంట్రాడేలో ఏకంగా 70.95 కనిష్ఠానికి దిగివచ్చింది. అటు తర్వాత దేశీయ కరెన్సీ కాస్తా కోలుకొని చివరకు 70.92 స్థిరపడింది చివరకు 43 పైసలు క్షీణించింది. డిసెంబర్ 17 నాటికి స్థాయికి దిగివచ్చింది. ఆ రోజు రూపాయి 71.56 వద్ద ముగిసింది.

మహీంద్రా మరాజ్జో విడుదల

• ధర రూ. 13.9 లక్షలు



న్యూఢిల్లీ : మహీంద్రా అండ్ మహీంద్రా సోమవారం నాడు కొత్త వెరియెంట్ మల్టీపర్పస్ మరాజ్జో... ఎనిమిది సీట్ల వాహనాన్ని విడుదల చేసింది. కొత్త వెర్షన్ ఎం8 ఏడు సీట్ల వెర్షన్‌తో పోల్చుకుంటే ధర రూ.8,000 అధికం. షో రూం ధర రూ.13.9 లక్షలుగా నిర్ణయించింది. ఎం8 వెరియెంట్ కంటే కొత్త ఎని మిది సీట్ల మారాజ్జో ఆకర్షణీయంగా ఉంటుందని కంపెనీ చీఫ్ సేల్స్ మార్కెటింగ్ చీఫ్ విజయ్‌నక్రా తెలిపారు. ఈ కారుకు అదనపు ఆకర్షణల విషయానికి వస్తే 7 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్, రివర్స్ పార్కింగ్ కెమెరా. డైనమిక్ గైడ్‌లైన్స్, 17 అంగుళాల అల్లాయ్ వీల్స్‌ను అందుబాటులో ఉంచింది. ఈ ఎంపీవీని మహీంద్రా నార్త్ అమెరికా టెక్నికల్‌సెంటర్, మహీంద్రా రీసెర్చ్ వ్యా లీ చైన్నైలు సంయుక్తంగా తయారు చేశారు. కాగా మహీంద్రా డిజైన్ స్టూడియో, ఇటాలియన్ డిజైన్ హౌజ్ ఫిన్‌ఇన్‌ఫార్నియాలు కలిసి ఈ కారుకు డిజైన్ చేశాయి.

విప్రో బోర్డు బోనస్ సిఫారసు!

న్యూఢిల్లీ : ఈ నెల 17-18 తేదీల్లో జరిగే విప్రోబోర్డు బోనస్ ప్రతిపాదనలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడవ త్రైమాసికం ఫలితాలను ఈ నెల 18వ తేదీన విప్రో ప్రకటించబోతున్నట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ సమావేశంలోనే స్టాండ్ ఎలోన్‌తో పాటు కన్సాలాడిటెడ్ ఫలితాలను ప్రకటించబోతోంది. అదే సమయంలో మధ్యంతర డివిడెండ్‌ను కూడా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయని బీఎస్ఈకి సమాచారం అందించింది. విప్రోకు పోటీ కంపెనీ అయిన ఇన్ఫోసిస్ శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో షేర్లను బైబ్యాక్ చేయడంతో పాటు మధ్యంతర డివిడెండ్ రూ.4గా ప్రకటించింది. టాటా కన్సెల్టీన్సీ సర్వీసెస్ కూడా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 24.1 శాతం ఆర్జించింది. ఏడాది ప్రాతిపదికన చూస్తే డిసెంబర్ త్రైమాసికంలో నికరలాభం రూ.8,105 కోట్లు ఆర్జించింది.

తగ్గిన రిటైల్, టోకు ద్రవ్యోల్బణం

• డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం 2.19 శాతం • టోకు ద్రవ్యోల్బణం 3.80 శాతం • తగ్గిన కూరగాయలు, పండ్లు, పెట్రోల్,డిజెల్ ధరలే కారణం

న్యూఢిల్లీ : రిటైల్ ద్రవ్యోల్బణం గత నెల డిసెంబర్‌లో 18 నెలల కనిష్టానికి 2.19 శాతానికి దిగివచ్చింది. ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, ఇంధన ధరలు తగ్గడంతో దాని ప్రభావం రిటైల్ ద్రవ్యోల్బణంపై కనిపించింది. ఇదిలా ఉండగా నవంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) 2.33 శాతంగా నమోదు కాగా.. ఏడాది క్రితం ఇదే డిసెంబర్‌లో 5.21 శాతంగా నమోదైంది. చివరగా జూన్ 2017లో అత్యల్పంగా 1.46 శాతంగా నమోదైందని కేంద్ర గణాంకాల కార్యాలయం విడుదల చేసిన తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. డిసెంబర్ నెలలో ఆహార ద్రవ్యోల్బణం నెగెటివ్ జోన్ (-)2.51 శాతంగా నమోదు కాగా. అంతకు ముందు నెల నవంబర్‌లో (-) 2.61 శాతంగా నమోదైంది. కూరగాయలు, పండ్లు, మాంసాహార ధరలు గుడ్లు ధరలు క్రమంగా కిందికి దిగివస్తున్నాయి. అయితే మాంసం, చేపలు, పప్పుల ధరలు మాత్రం స్వల్పంగా పెరిగాయి.

ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో 4.54 శాతంగా నమోదు కా గా.. అంతకు ముందు నవంబర్‌లో 7.39 శాతంగా నమోదైం ది. దీనికి ప్రధాన కారణం, పెట్రోల్, డిజెల్ ధరలు పెరగడ మే నని ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోం ది.

చల్లబడ్డ టోకు ద్రవ్యోల్బణం

పెట్రోల్, డిజెల్ ధరలు తగ్గడంతో పాటు కొన్ని ఆహార పదార్థాల ధరలు తగ్గముఖం పట్టడంతో డిసెంబర్ నెల టోకు ద్రవ్యోల్బణం ఎనిమిది నెలల కనిష్ఠానికి 3.80 శాతానికి దిగివచ్చింది. దీంతో తదుపరి రిజర్వుబ్యాంకు ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లలో కోత విధించే అవకాశాలు మెరుగుపడ్డాయి. వరుసగా రెండో నెల టోకు ద్రవ్యోల్బణం తగ్గముఖం పట్టింది. నవంబర్ 2018లో టోకు ద్రవ్యోల్బణం 4.64 శాతంగా నమోదు కాగా.. అక్టోబర్‌లో 5.54 శాతంగా నమోదైంది. డిసెంబర్ 2017లో టోకు ద్రవ్యోల్బణం 3.58 శాతంగా నమోదైంది.

సోమవారం నాడు ప్రభుత్వం విడుదల చేసిన గణాం కాల ప్రకారం చూస్తే .. ఆహారం ధరలు డిసెంబర్‌లో ప్రతిద్రవ్యోల్బణం -0.07 శాతానికి దిగిరాగా.. నవంబర్‌లో 3.31 శాతంగా నమోదైంది. కూరగాయల ధరల విషయానికి వస్తే వరుసగా గత ఆరు నెలల నుంచి ప్రతిద్రవ్యోల్బ ణం స్థాయికి -17.55 శాతానికి దిగి రాగా.. అంతకు ముందు నవంబర్ నెలలో 26.98 శాతంగా నమో దయ్యాయి. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బ ణం డిసెంబర్‌లో 8.38 శాతానికి దిగిరా గా.. నవంబర్‌లో 16.28 శాతంగా నమో దైంది. దీనికి ప్రధాన కారణం డిసెంబర్‌లో పె ట్రోల్, డిజెల్ ధరలు తగ్గుము ఖం పట్టడమే కారణం. ఇక పెట్రోల్, డిజెల్ ద్రవ్యోల్బణానికి వస్తే వరుసగా 1.57 శాతం, 8.61 శాతంగా నమోదైంది. అలాగే లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) డిసెంబర్‌లో 6.87 శాతంగా నమోదైంది.

గ్లోబల్ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గడంతో దాని ప్రభావం దేశీయ మార్కెట్లో పెట్రోల్, డిజెల్‌పై కనిపించింది. దీంతో వచ్చే రిజర్వుబ్యాంకు ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లు తగ్గిం చే అవకాశాలు మెరుగుపడ్డాయి. దీంతో పాటు పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) మందగించడంతో కొత్తగా పెట్టుబడులు ఇవ్వడానికి వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. డిసెంబర్‌లో తయారీరంగానికి చెం దిన వస్తువుల ద్రవ్యోల్బ ణం 3.59 శాతంగా నమో దు కాగా.. నవంబర్‌లో 4.21 శాతంగా నమోదైం ది. ఆహారధరల విషయా నికి వస్తే బంగాళా దుం పల ధరలు బాగా దిగివచ్చాయి. డిసెంబర్‌లో -48.68 శాతా నికి దిగిరాగా.. అదే నవంబర్‌లో 86.45 శాతంగా నమోదైంది. పప్పుల ద్రవ్యోల్బణం 2.11 శాతానికి, గుడ్లు, మాంసం, చేపలు 4.55 శాతంగా నమోదు కాగా.. ఉల్లి ధరలు డిసెంబర్ ప్రతిద్రవ్యో ల్బణం -63.83 శాతంగా నమోదు కాగా.. నవంబర్ 47.60 శాతంగా నమోదైంది. అలాగే పండ్లు డిసెంబర్‌లో ప్రతి ద్రవ్యోల్బణం అంటే -3.69 శాతానికి దిగి రా గా.. అంతకు ముందు నెల నవంబర్‌లో 2.49 శా తంగా నమోదైంది. టోకు ద్రవ్యోల్బణం ఎనిమి ది నెలల కనిష్ఠానికి 3.8 శాతా నికి దిగి రాగా.. చివరగా ఏప్రి ల్‌లో 3.62 శాతంగా అత్యల్పం గా టోకు ద్రవ్యోల్బణం నమోదైంది.



ఫిబ్రవరి 7న ఆర్‌బీఐ పరపతి సమీక్ష

ఇదిలా ఉండగా రిజర్వుబ్యాంకు కొత్త గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలో ఫిబ్రవరి 7వ తేదీన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్ష జరుగనుంది. ప్రస్తుతం ద్రవ్యోల్బణం తగ్గముఖం పట్టింది కాబట్టి ఆర్‌బీఐ గవర్నర్ కీలక వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలున్నాయని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. ద్రవ్యోల్బణం గణాంకాలపై సీఐఐ స్పందిస్తూ.. ఆర్ బీఐ అంచనా ప్రకారం ద్రవ్యోల్బణం లక్ష్యం అదుపులోకి వచ్చింది కాబట్టి వడ్డీరేట్లు తగ్గించాలని కోరుతోంది. ప్రస్తుతం పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) 17 నెలల కనిష్ఠానికి 0.5 శాతానికి నవంబర్‌లో దిగిరావడంతో.. ఆర్‌బీఐ వృద్ధిరేటును దృష్టిలో ఉంచుకొని వడ్డీరేట్లను తగ్గించాలని డిమాండ్ చేస్తోంది. అసోచామ్ కూడా ద్రవ్యోల్బణం తగ్గింది కాబట్టి వ డ్డీ రేట్లు త గ్గించాలని డిమాండ్ చేస్తోంది. ఎస్ బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త శుభదరావు అంచనా ప్రకారం రాబోయే నెలల్లో ద్రవ్యో ల్బ ణం 3.5 నుంచి 3.7 శాతానికి పరిమితం కావచ్చునని తెలిపారు.

పీఎస్‌యు బ్యాంకుల్లో ప్రభుత్వం వాటా

52 శాతానికి కుదింపు

• ఆర్థిక మంత్రిత్వశాఖ ఆలోచన




న్యూఢిల్లీ : కార్పొరేట్ కంపెనీలు పాటించే నిబంధనల ప్రకారం ఆర్థికమంత్రిత్వశాఖ కూడా ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో ప్రభుత్వం వాటాను క్రమంగా 52 శాతానికి తగ్గించుకోవాలనే ఆలోచనలో ఉంది. పీఎస్‌యు బ్యాంకుల్లో అతి పెద్ద వాటాదారు ప్రభు త్వమే. కాగా ప్రస్తుతం కార్పొరేట్‌లు వ్యవహరించే వి ధంగా ప్రభుత్వం కూడా దశలవారీగా తమ వాటా ను తగ్గించుకుంటూ 52 శాతానికి తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ చెప్పారు. మార్కెట్లు జోరందుకుంటే క్రమంగా ఆ దిశగా ఆలోచిస్తామని.. అంతకు ముం దు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని అట్టిపె ట్టుకుంటామని ఆయన అన్నారు. ప్రస్తుతం మా ర్కెట్ నియంత్రణా సంస్థ (సెబి) కూడా పీఎస్‌యు బ్యాంకుల్లో ప్రభుత్వం వాటా 75 శాతం మించరా దని నిబంధన తీసుకొచ్చింది. దీంతో సెబి ని బంధన లు అమలు చేసినట్లవుతుంది. బ్యాంకులు రుణాలు ఇవ్వ డంలో జాగ్రత్తలు పాటించడానికి ఆస్కారం ఉంటుంది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇప్పటికే రూ.20వేల కోట్ల విలువ చేసే షేర్లను క్వాలిఫైడ్ ఇన్సి స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా వాటాలను విక్ర యించాలని నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా చర్యలు కూడా మొదలుపెట్టింది. క్యూఐపీ తర్వాత బ్యాంకులో ప్రభుత్వం వాటా 58.53 శాతానికి దిగివస్తుంది. గతనెల జరిగిన వాటాదారుల సమావేశంలో వాటాలను విక్రయించడానికి వాటాదారులు అనుమతించారు. దీంతో వచ్చిన నిధులతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చు. ఇప్పటికే పలు బ్యాంకులు వివిధ రకాల ద్వారా నిధులు సేకరించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. మార్కెట్ పరిస్థితులను బట్టి వీరు ఈ నిర్ణయం తీసుకుంటాయి.

ఇప్పటికే పలు బ్యాంకులు ఆ దిశగా అడుగులు వేయడం కూడా ప్రారంభించాయి. ఉదాహరణకు సిండికేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఒరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్ లాంటివి ఇప్పటికే ఉద్యోగులకు షేర్లు విక్రయించడానికి శ్రీకారం చుట్టాయి. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తృతం చేయడానికి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (ఆర్‌ఆర్‌బీఐ) బలోపేతం చేయడానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఇటీవలే కేంద్రప్రభుత్వం గ్రామీణ ప్రాంతీయ బ్యాంకులు పంజాగ్ గ్రామీణ బ్యాంకు, మాల్వా గ్రామీణ బ్యాంకు, సట్లేజ్ గ్రామీణ బ్యాంకులను ఈ నెల 1వ తేదీన విలీనం చేసి అతి పెద్ద బ్యాంకుగా తయారు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో చిన్న రైతులకు, వ్యవసాయ కార్మికులకు గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులకు రుణాలు ఇవ్వడానికి వీలుంటుంది. ప్రస్తుతం ఆర్‌ఆర్‌బీఐ ప్రభుత్వానికి 50 శాతం వాటాలుంటే, 35 శాతం, 15 శాతం, స్పాన్సర్ బ్యాంకులు, రాష్ట్రప్రభుత్వాలకు వాటాలుంటాయి.

ఐఐపీ ముంచింది

• సెన్సెక్స్ 150 పాయింట్లు పతనం • గ్లోబల్ మార్కెట్లు నష్టాల్లోనే



ముంబై : స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు 150 పాయింట్లు నష్టపోయింది. పారిశ్రామికోత్పత్తి గణాంకాలు బలహీనంగా నమోదు కావడంతో పాటు ఆసియా మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ కావడంతో సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపించింది. మొత్తానికి సోమవారం నాడు మార్కెట్లు ఆద్యంతం ఒడిదుడుకులతోనే కొనసాగింది. చివరకు 156.28 పాయింట్లు క్షీణించి 35,853.56 వద్ద, నిఫ్టీ 57.35 పాయింట్లు క్షీణించి 10,737.60 వద్ద ముగిసింది. అత్యధికంగా నష్టపోయిన షేర్లలో ఎల్‌అండ్‌టి, ఇండస్‌ఇండ్ బ్యాంకు, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ,టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, హీరోమోటో కార్ప్, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ షేర్లు 2.64 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. వీటికి వ్యతిరేకంగా అత్యధికంగా లాభపడిన షేర్లలో ఎస్ బ్యాంకు అగ్రస్థానంలో ఉంది. ఎస్‌బ్యాంకు సీఈవోగా రజత్ మోంగాను ఎంపిక చేసినట్లు మీడియాలో వార్తలు రావడమే దీనికి ప్రధాన కారణం. ఇన్ఫోసిస్ కూడా 2.58 శాతం పెరిగింది. గత శుక్రారం నాడు కంపెనీ రూ.8,260 కోట్ల షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. వాటాదారులకు మధ్యంతర డివిడెండ్ షేరుకు రూ.4గా ప్రకటించింది. లాభపడిన ఇతర షేర్లు ఇలా ఉన్నాయి. సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, మారుతి, టాటామోటార్స్ షేర్లు 1.68 శాతం వరకు లాభపడిన వాటిలో ఉన్నాయి. ఇప్పటి వరకు వచ్చిన క్యూ3 ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఐటి, బ్యాంకింగ్ రంగానికి చెందిన బ్లూచిప్ కంపెనీల షేర్లు మాత్రం నెగెటివ్‌గా ఉన్నాయి. శుక్రవారం నాడు ప్రభుత్వం విడుదల చేసిన నవంబర్ నెల పారిశ్రామికోత్పత్తి గణాంకాలు (ఐఐపీ)17 నెలల కనిష్ఠానికి దిగివచ్చి 0.5 శాతానికి పడిపోవడం మార్కెట్లను దెబ్బతీ సింది. దీంతో పాటు అమెరికా షట్‌డౌన్, బ్రెగ్జిట్ ప్రభావం కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై పనిచేసింది. దీంతో పాటు విదేశీ సంస్థాగత మదుపరులు తమ వద్ద ఉన్న షేర్లను ఎద్దె త్తున విక్రయించడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బ తీసింది. దేశీయ సంస్థాగత మదు పరులు ముడిచ మురు ధరలు పెరిగిపోవడం, రూపాయి బలహీ నపడ్డం, ద్రవ్యలోటు పెరిగిపోవడం తదితర అంశాలు మార్కెట్ల ప్రభావం చూపించాయి. మొత్తానికి చూస్తే ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనంగా ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శుక్రవారం విదేశీ సంస్థా గత మదుపరులు రూ.684.20 కోట్ల షేర్లు విక్రయిస్తే.. దేశీయ సం స్థాగత మదుపరులు రూ.123.17 కోట్ల షేర్లను కొను గోలు చేసినట్లు స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియ జేస్తున్నాయి. రూపా యి విషయానికి వస్తే డాలర్ మారకంతో రూపాయి 32 పైసలు క్షీణించి 70.81కి ఎగబాకింది. ముడిచమురు ధరలు 1.49 శాతం క్షీణించి 59.58 డాలర్లు పీపా పలికింది. ఆసియాతో పాటు ఐరోపా మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. దేశీయ మార్కె ట్లను శాసించే అంశాల విషయానికి వస్తే క్యూ3 ఫలి తాలు, చైనా- అమెరికా వా ణిజ్య యుద్ధం, పెరిగిపోతున్న ముడిచమురు ధరలు, ఎఫ్ఐఐ పెట్టుబడు లు తర లిపోవడం, రాబోయే లోకసభ ఎన్నికలు కలిపి స్వల్పకాలానికి మా ర్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యే అవకాశాలున్నాయన్నారు.

నా వల్లే తెలంగాణ వచ్చింది

ఎం. సత్యనారాయణరావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నా వల్లే తెలంగాణ వచ్చింది.. కావాలంటే టీఆర్ఎస్ అధినేత, సీఎం చంద్రశేఖర్‌రావును అడగండి ' అంటూ కాంగ్రెస్ కురువృద్ధుడు, మాజీ మంత్రి ఎం. సత్యనారాయణరావు అన్నారు. రాష్ట్రం రావడంలో తన కృషి ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. ఎంఎస్ఆర్ 80వ జన్మదిన వేడుకలను ఆయన నివాసంలో కాంగ్రెస్ నేతలు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ అధికారం చెలాయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయినా రాష్ట్రంలో మంచి పనులే జరుగుతున్నాయని, అభివృద్ధిలో ముందుకు పోతున్నదని ఎమ్మెస్సార్ వివరించారు. రాష్ట్రం భాగుండాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ నేత సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెస్సార్ కేక్ కట్ చేశారు. ఎమ్మెస్సార్ జన్మదిన వేడుకలకు కేవీపీ రాంచంద్రారావు, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ స్పీకర్ కేఆర్ సురేష్‌రెడ్డి, కమలాకర్‌రావుతో పాటు పలువురు నేతలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

'గురుకుల' తల్లిదండ్రులకు ఆటల పోటీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లి తండ్రులకు ఆటల పోటీలు ప్రతి ఏడాది నిర్వహించనున్నట్లు సోషల్ వెల్ఫేర్ గురుకులాల కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. విద్యార్థుల తల్లీదండ్రులకు ' హల్చల్ ' పేరుతో ఆటల పోటీలు నిర్వహించేందుకు అనుమతించిన సీఎం చంద్రశేఖర్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నగరంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ' హల్చల్ ' అనే కార్యక్రమంతో గురుకులాలో విధ్యనభ్యసించే విద్యార్థుల తల్లిదండ్రులకు కబడ్డ, వాలీబాల్, అథ్లెటిక్స్, డిబేట్, మ్యూజికల్ కుర్చీ, డ్యాన్స్, పాటలు తదిర పోటీలు నిర్వహించారు. విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరై పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులకే కాకుండా విద్యార్థుల తల్లీదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి శాఖ డైరెక్టర్ కరుణాకర్‌లు హాజరయ్యారు.

కలివిడిగానా?

పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ వైఖరేమిటో? కేడర్‌లో చర్చ... టీడీపీతో పొత్తుపై తలోమాట

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పార్లమెంట్ ఎన్నికల్లోని పొత్తులపై కాంగ్రెస్‌లో బిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. టీడీపీతో కలిసి వెళ్లాలా..? ఒంటరిగా వెళ్లాలా..? అనే అంశంపై చర్చ జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి వ్యూహం అనుసరిస్తుందనే అంశంపై కాంగ్రెస్ కేడర్‌లోనూ చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాకూటమి పేరుతో టీడీపీ, సీపీఐ. తెలంగాణ జన సమితో కలిసి వెళ్లిన కాంగ్రెస్ పార్లమెంట్‌లో మాత్రం ఒంటరిగా వెళ్లాలని చాల మంది నేతలు ఆలోచనతో ఉన్నారు. ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానం పెద్దలకు కూడా చెబుతున్నారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం మాత్రం పొత్తుల వైపే మొగ్గు చూపుతున్నట్లుగా మరి కొంత మంది పార్టీ నేతలు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు వ్యత్యాసం ఉంటుందని, కేంద్రంలో అధికారంలోకి రావడం అనివార్యమని అలాంటి పరిస్థితుల్లో మిత్రలతో కలిసి వెళ్లడమే లాభిస్తోందనే చెబుతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవలనే ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఏఐసీసీ ఇన్‌చార్జీ కార్యదర్శులతో ఢిల్లీలోని వార్ రూమ్‌లో సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విదేశీ టూర్‌లో ఉండటంతో రాష్ట్రం నుంచి టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, టీ పీసీసీ కోశాధికార గూడూరు నారాయ ణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డితో పాటు ఇన్‌చార్జీలు కూడా హాజరైన విషయం తెలిసిందే. కాగా రాష్ట్రంలోని పార్టీ పరిస్థితితో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పార్లమెంట్ ఎన్నికల్లో చేపట్టాల్సిన చర్యలపైన చర్చించారు. ఈ సమావేశంలో పొత్తుల అంశంపైన కూడా చర్చ జరిగింది. టీడీపీతో పొత్తు విషయంలో పార్టీలోని కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై హై కమాండ్ ఆరా తీసినట్లుగా సమాచారం.

టీడీపీతో పొత్తు వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందామని మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు నేతలు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. కోమటిరెడ్డి వ్యాఖ్యలను సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు లాంటి నేతలను బాహటంగానే ఖండించారు. మరో సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క కూడా పొత్తును సమర్థిస్తూనే వ్యాఖ్యానించారు. అయితే కొన్ని చోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. టీడీపీతో కలిసి వెడితే మరోసారి ఇబ్బంది పడటం కంటే ఒంటరిగా వెళ్లితే ప్రజలు విశ్వసిస్తారని పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత అభిప్రాయపడ్డారు. టీఆర్ఎస్ అధినేత, సీఎం చంద్రశేఖర్‌రావు మరోసారి టీడీపీని బూచిగా చూపించి తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని ఈ నాయకులు అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ వర్సెస్ చంద్రబాబు అన్నట్లుగా ప్రచారం జరగడంతో రాష్ట్రంలో ప్రజా



కూటమి హోరా పరాజయాన్ని మూట కట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నది వీరి వాదన. ఇలాంటి పరిస్థితులో పార్లమెంట్ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేయాల్సి ఉంటుందని, టీడీపీతో జత కట్టడం కంటే సీపీఐ, టీజేఎస్‌తో జట్టు కట్టితే లాభం ఉంటుందని చెబుతున్నారు. అయితే మరికొందరూ నేతలు మాత్రం ఈ వాదనలును ఏకీభవించడం లేదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు వ్యత్యాసం ఉంటుందని వాదిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో ఆలోచన చేస్తారని, కేంద్రంలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అనే విధంగా ఎన్నికలు జరుగుతాని అంటున్నారు. అప్పుడు ప్రాంతీయ పార్టీల ప్రభావం పెద్దగా ఉండదని, అప్పుడు టీడీపీతో పాటు మిగతా పార్టీలతో జట్టు కట్టి వెళ్లితేనే మేలని మరి కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇదే అంశంపై పార్టీకి చెందిన ఒక సీనియర్ వ్యాఖ్యానిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పొత్తుల వైపే మొగ్గు చూపుతున్నారని, రాష్ట్రంలో ఎవరి ఏ విధంగా మాట్లాడిన చివరకు అధిష్టానం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని అంటున్నారు.

రేపు సీఎల్పీ భేటీ

• శాసనసభాపక్ష నేత ఎన్నిక.. సీనియర్ల మధ్య పోటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసనసభాపక్ష నేతను ఎన్నుకునేందుకు రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభ్యులు బుధవారంనాడు సమావేశం కానున్నారు. సీఎల్పీ పదవి ఎవరిని వరిస్తుందోననే విషయంలో ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున 19 మంది విజయం సాధించిన విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాలు వెలువడి నెల రోజులు పూర్తయినప్పటికి ఇప్పటి వరకు శాసనసభాపక్ష నేతను ఎన్నుకోలేదు. అయితే ఈ నెల 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటంతో, ఇప్పుడు కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత ఎంపిక అనివార్యమైంది. దీంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభానికి ఒక రోజు ముందే, బుధవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమై సీఎల్పీ నేతను ఎన్నుకోనున్నారు. ఈ భేటీకి ఏఐసీసీ పరిశీలకుడిగా కర్ణాటకకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ రానున్నారు.ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు రాష్ట్రానికి వచ్చిన వేణుగోపాల్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. సీఎల్పీ పదవి కోసం విజయం సాధించిన 19 మంది ఎమ్మెల్యేలలో ఐదుగురు సీనియర్లు పోటీ పడుతున్నారు. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీ పీసీసీ ఎన్నికల ప్రచార కమిటి చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీధర్‌బాబుతోపాటు ఎమ్మెల్యేలు తూర్పు జగ్గారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సీఎల్పీ పదవికోసం తీవ్ర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. సీఎల్పీతోపాటు టీ పీసీసీ, ఎల్పీలోని పదవుల పంపకాల విషయంలో సామాజిక న్యాయం పాటించాలనే ఆలోచనతో అధిష్టానం ఉన్నట్లుగా సమాచారం. టీ పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి కొనసాగుతుండటంతో అయనకు సీఎల్పీ పదవి ఇవ్వకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ఎస్సీ సామాజిక వర్గానికి అవకాశం ఇస్తే మల్లు భట్టి విక్రమార్క ముందంజలో ఉన్నారు. పార్టీ అధిష్టానం కూడా దాదాపు భట్టి వైపే మొగ్గు చూపుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. మాజీ మంత్రులు శ్రీధర్‌బాబు, సబితా ఇంద్రారెడ్డిల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అంతే కాకుండా రెడ్డి సామాజిక వర్గం నుంచి మరో ముగ్గురు ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డిలు కూడా సీఎల్పీ పదవికోసం పోటీపడుతున్నారు. కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన 19 ఎమ్మెల్యేల్లో 9 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారు.



గవర్నర్‌తో కేంద్రమంత్రి జశ్వన్ సిన్హా సుమన్ రాయ్ బాబోర్

దేశ వ్యాప్తంగా 400 ఏకలవ్య పాఠశాలలు

కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రి జశ్వన్ సిన్హా సుమన్‌రాయ్ బాబోర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశ వ్యాప్తంగా 2022 నాటికి 400 ఏకలవ్య మోడల్ పాఠశాలలను నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న దని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ సహాయ మంత్రి జశ్వన్ సిన్హా సుమన్‌రాయ్ బాబోర్ తెలిపారు. సోమవారం నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన నేషనల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ క్రీడా పోటీలకు దేశంలోని 22 రాష్ట్రాల నుంచి దాదాపు 1735 మంది గిరిజన విద్యార్థులు హాజరయ్యారు.

ఈ నెల 16 వరకు జరిగే ఈ సమ్మిట్‌లో 13 రకాల క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సుమన్‌రాయ్ బాబోర్ మాట్లాడుతూ నవోదయ విద్యాలయాలు మాదిరిగానే ఈ పాఠశాలలు ఉంటాయని ఆయన చెప్పారు. ఈ పాఠశాలల్లో పూరిగా గిరిజన విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుం దని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త కార్య దర్శి వినోద్‌కుమార్ తివారి, గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం ఉద్యమం

• మండలి కొనసాగుతున్న ఏడు రాష్ట్రాలతో సమన్వయ కమిటీ • ఇప్పటికే ఏపీ, తెలంగాణ వారితో ఏర్పడిన ప్రాథమిక కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు సెకండరీ గ్రేడ్ టీచర్లు జాతీయ ఉద్యమానికి సిద్ధం అవుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నామనే సాకుతోనే తమకు ఎమ్మెల్సీ ఓటు హక్కు లేకుండా పోయిందని.. అదే హైస్కూల్‌లో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు మాత్రం ఓటు హక్కు ఉందని ఎస్‌జీటీ ఫోరమ్ నాయకులు చెబుతున్నారు. విధానంలో ఉన్న నిబంధనల మూలంగానే తమకు ఓటు హక్కు లేకుండా పోయిందని కాబట్టి దానిని మార్చాలని.. తమకు ఓటు హక్కు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఎస్‌జీటీలుగా ఉన్న వారిలో కొందరికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించి మరికొందరికి కల్పించకపోవడం సరికాదని అంటున్నారు. అందుకే శాసన మండలి కొనసాగుతున్న 7 రాష్ట్రా ల్లోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకుని జాతీయ స్థాయిలోనే ఉద్యమించాలని ఎస్‌జీటీలు నిర్ణయించారు. అందులో భాగంగా ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా లకు చెందిన ఎస్‌జీటీలతో కలిసి ప్రాథమికంగా సమన్వయ కమిటీని సైతం ఏర్పాటు చేసుకున్నారు. త్వరలోనే మిగిలిన రాష్ట్రా ల్లోని ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీలతో సంప్రదింపులు జరిపి పూర్తిస్థాయిలో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకోనున్నట్టు ఎస్‌జీటీ నేతలు చెబుతున్నారు.

కొందరికి ఓటు హక్కుంది.. మరికొందరికి లేదు..

ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే హక్కును ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేట్ టీచర్లు(ఎస్ జీటీ)ల తోపాటు ఇక్కడ పనిచేసే హెడ్మాష్టర్లకు కూడా లేదు. ఇక్కడ పనిచేసే పండితులు(పండిట్స్‌కు కూడా లేదు. కానీ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఎస్‌జీటీలకు, పండితులకు మాత్రం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసే హక్కు కల్పించారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే



నర్సరీ టీచర్లకు కూడా ఎమ్మెల్సీ ఓటు హక్కు ఉంది.

ఎమ్మెల్సీ ఓటు హక్కు- చట్టం...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు చట్టంలో సెకండరీ స్థాయి పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రమే ఓటు హక్కు ఉన్నట్టుగా ఉంది. సెకండరీ స్థాయి అంటే ఏమిటనేది ఇప్పుడు స్పష్టత లేకుండా ఉంది. కారణం విద్యా హక్కు చట్టం ప్రకారం 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ప్రాథమిక విద్యగా నిర్వచించింది. ఈ నేపథ్యంలో సెకండరీ విద్య అంటే ఏ తరగతి నుంచి అనేది స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. హైస్కూల్ అని ఉంటే వాటిలో పనిచేసే ఎస్‌జీటీలకు, పండిట్‌లకు అందరికీ ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలంటే 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉంటాయి. అదే ప్రైవేటు స్కూల్‌లో అయితే నర్సరీ నుంచి 10వ తరగతి వరకు ఉన్న స్కూల్స్‌కి కూడా వారు హైస్కూల్ అనే పేరుతోనే కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు స్కూల్‌లో పనిచేసే నర్సరీ స్కూల్ టీచర్‌కు కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఆటోమేటిక్‌గా వచ్చేస్తుంది. అదేవిధంగా విద్యా హక్కు చట్టం ప్రకారం 8వ తరగతి వరకు ప్రాథమిక విద్య అని చెప్పినప్పటికీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఎస్‌జీటీలకు, పండిట్‌లకు ఓటు హక్కు వస్తుంది. కానీ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్ అని ఉండి 8వ తరగతి వరకు ఉన్నప్పటికీ అందులో పాఠాలు బోధించే ఎస్‌జీటీలు, పండిట్‌లకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఓటు హక్కు లేకుండా పోయింది.

7 రాష్ట్రాల్లో శాసనమండలి కొనసాగుతోంది..


దేశంలో ప్రస్తుతం 7 రాష్ట్రా ల్లో శాసనమండలి కొనసాగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతోపాటు ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర కర్ణాటక, బీహార్, జమ్మూ అండ్ కాశ్మీర్ రాష్ట్రా ల్లో శాసనమండలి కొనసాగుతోంది. 7 రాష్ట్రా ల్లో కూడా ఇదే విధానం కొనసాగుతోంది.

జాతీయ సమన్వయ కమిటీ ఏర్పాటు..

ఎస్‌జీటీలుగా కొనసాగుతున్న వారి సమస్యల పరిష్కారం కోసం రెండు తెలుగు రాష్ట్రా ల్లోనూ ఎస్‌జీటీ ఫోరమ్ పేరుతో వేర్వేరుగా రాష్ట్ర కమిటీలు కొనసాగుతున్నాయి. అయితే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు అనేది 7 రాష్ట్రా ల్లో సాధారణ సమస్యగా ఉన్నందున దీనిపై పోరాడేందుకు జాతీయ స్థాయిలోనే సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌జీటీలు నిర్ణయించారు. సమన్వయ కమిటీని ఎస్‌జీటీఎఫ్ఐగా నామకరణం చేసుకున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ ఫోరమ్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీటీఎఫ్ఐ)గా ఏర్పాటు చేసుకున్నారు. ప్రాథమికంగా కమిటీ కన్వీనర్‌గా తెలంగాణ రాష్ట్రా నికి చెందిన ఎ చంద్రశేఖర్‌ను కన్వీనర్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీనివాసరావును కోకన్వీనర్‌గా మరో ముగ్గురు సభ్యులు ఎండీ జమాల్, ఎస్ ప్రవీణ్‌కుమార్, జి సురేష్‌తో ప్రాథమికంగా సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ

రాజకీయ పక్షాలకు కృష్ణయ్య వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను పోటీలో నిలబెట్టి వారిని గెలిపించేలా చూడాలని 14 బీసీ సంఘాలు రాష్ట్రంలోని ప్రజలు, పార్టీలకు విజ్ఞప్తి చేశాయి. జనరల్ స్థానాల్లో బీసీలను నిలబెట్టేలా రాజకీయ పార్టీలు చూడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య లేఖలో కోరారు. సోమవారం బీసీ భవన్‌లో 14 బీసీ సంఘాల సమావేశం జరిగింది. సమావేశంలో జనరల్ స్థానాల్లో బీసీలను నిలబెట్టడమే కాకుండా వారిని గెలిపించేలా చూడాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, దాసు సురేష్, నీల వెంకటేష్, సి రాజేందర్, గొరిగే మల్లేష్ యాదవ్, ఉపేందర్‌గౌడ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులతో జరగవు కాబట్టి రాజకీయ పార్టీలన్నీ బీసీలకు మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిన నేపథ్యంలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశామని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం ఎన్నికలకు ఆదరాబాదరాగా నోటిఫికేషన్ జారీ చేసిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో బీసీలకు రిజర్వేషన్లు తగ్గినందున జనరల్ స్థానాలతోపాటు ఎక్కువ స్థానాల్లో బీసీలను పోటీలో నిలపాలని.. వారిని గెలిపించడం కోసం పార్టీలు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పెద్ద ఎత్తున మద్యం, డబ్బుల పంపిణీ జరుగుతోందని మండిపడ్డారు. ఎన్నికలు ముగిసే వరకు మద్యం షాపులను మూసేయించేయించడంతోపాటు.. బార్లను కూడా మూసి ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. అప్పుడే ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయని అన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో జనరల్‌స్థానాల్లో కూడా బీసీ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రంలోని బీసీలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ సోమవారం బీసీ ప్రజానీకానికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో బీసీలు 56 శాతం ఉంటే రిజర్వేషన్లు కాస్త 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 12751 గ్రామపంచాయతీలు ఉంటే వాటిలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం అయితే 4335 రావాలి. కానీ 22 శాతం రిజర్వేషన్ల ప్రకారం కేవలం 2345 పంచాయతీలే రిజర్వు కాబడ్డాయి. 1990 గ్రామ పంచాయతీలు తక్కువగా ఉన్నాయి. కాబట్టి జనరల్ స్థానాలుగా నిర్ణయించిన 5147 స్థానాల్లో ఎక్కువ స్థానాల్లో బీసీలు పోటీచేసేలా వారినే బీసీలు గెలిపించేలా చూడాలని బహిరంగ లేఖలో పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు కూడా బీసీలకు మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబువి దింపుడు కల్లం ఆశలు

రాజకీయాల్లో పవన్ సీనియర్ :వైసీపీ నేత సజ్జల

హైదరాబాద్,ఆంధ్రప్రభ : వచ్చేఎన్నికల్లో గెలుపుపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దింపుడు కల్లం అశలు పెట్టుకున్నారని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కేంద్రకార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సజ్జల మాట్లాడుతూ ఏపీలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతూ దుబారా ఖర్చులకోసం అప్పులు చేసిన సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఖజానాను ఊడ్చిపారేశారన్నారు. నాలుగేళ్ల కిందట జీరో అప్పులు ఉన్న రాష్ట్రాన్ని రూ.2.90లక్షల కోట్ల అప్పుల్లో ముంచేశారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఆరు వందల హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిని నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసగించారన్నారు. ఒక పక్క రాష్ట్రంలో జీడీపీ పరుగులు పెడుతుందని చెబుతూనే మరోపక్క అప్పుల్లో ఉన్నామంటూ రెండు నాల్కలధోరణి కనబురుస్తున్నారన్నారు. చంద్రబాబు మోసపుమాటలు రాష్ట్ర ప్రజలంతా గమనించారని వచ్చే ఎన్నికల్లో ప్రజల తీర్పు ఇప్పటికే రిజర్వ్ అయిపోయిందన్నారు.

రాజకీయాల్లో పవనే సీనియర్

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా మాటలు మారుస్తున్నారన్నారు. ఒక సారి మాట్లాడిన మాట మరో సారి ఉండటం లేదన్నారు. పవన్ రాష్ట్ర రాజకీయాల్లో జగన్ కంటే సీనియర్‌అని తమకు కూడా ఆయనపట్ల గౌరవం ఉందన్నారు. పవన్ ప్రజారాజ్యం పార్టీలో కీలకంగా పనిచేశారన్నారు. 14ఏళ్ల రాజకీయ అనుభవం వున్న పవన్ ఇప్పుడే కొత్తగా రాజకీయాల్లోకి వచ్చినట్టు తనకేమి తెలియదు అనటం రాజకీయ అనర్హతను సూచిస్తుందన్నారు.

కులవృత్తులకు మరింత బలం

• వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి మరింత ప్రాధాన్యం • గ్రామీణ యువత ఉపాధి లక్ష్యం • అన్ని రంగాల్లో అవకాశాలపై కేసీఆర్ అధ్యయనం • వ్యక్తిగత, యువజన సంఘాలకు ఆర్థిక చేయూత • ప్రభుత్వ గ్యారంటీతో బ్యాంకు రుణాలు • ఆ దిశగానే 2019-20 బడ్జెట్ ప్రతిపాదనలు • ఉపాధి రంగానికి భారీగా నిధులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించేందుకు దోహదపడిన కుల వృత్తుల చేయూతను మరింతగా పెంచాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న 10 కులాల వృత్తులకు మాత్రమే ఇస్తున్న ప్రోత్సాహకాలను 26 కులాలకు పెంచాలనుకుంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి దేశంలోనే మెరుగైన పాలసీని సిద్ధం చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చారు. పార్టీకి, ప్రభుత్వానికీ అండగా నిలిచిన కులవృత్తిదారులకు వృత్తి నైపుణ్యతతో పాటు లక్ష వరకు వడ్డీలేని రుణాలు, ఆపై దాటిన మొత్తానికి పావలా వడ్డీతో సరికొత్త పథకాలను అమల్లోకి తీసుకురావాలని కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జనంలో ఉన్న ఆకాంక్షను, అభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకుని సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా బడ్జెట్‌లో ప్రాధాన్యతలు కల్పించాలని ఆర్థికశాఖ అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తుపై తనకున్న ఆలోచనలు, ముందుచూపు మేరకే అన్ని శాఖలకు మార్గనిర్ధేశం చేసి బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నారు.

నేటితరం యువతకు ఎక్కడా అసంతృప్తి కలుగకుండా ఉపాధి రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించబోతున్నారు. సరికొత్త వ్యూహాలతో స్వయం ఉపాధి పథకాలను రూపొందించి చేయూతనివ్వబోతున్నారు.

అదే సమయంలో కుల వృత్తులను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచడంతో పాటు చదువుకున్న యువతను ఆ రంగంవైపు మళ్ళించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం అంతరించిపోయిన కుల వృత్తులను సైతం వెలికితీసి ప్రత్యేక ప్రోత్సాహకాలతో వాటిని ఆదరించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. మిగతా రంగాల్లోనూ గత కొంత కాలంగా ఉపాధి అవకాశాలపై అధ్యయనం చేసిన ఆయన కీలకశాఖల ద్వారా కొత్తపథకాలను ప్రకటించేందుకు ఆయన సంసిద్ధమయ్యారు. ఆ దిశగానే 2019-20 వార్షిక బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత కల్పిస్తూ ప్రతిపాదనలు తయారు చేయాలని సంక్షేమ శాఖాధిపతులకు ఆదేశాలిచ్చారు.

ఈ ఏడాది బడ్జెట్‌లో యువజనోపాధికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలనుకుంటున్న ముఖ్యమంత్రి అందుకోసం వ్యక్తిగతంగా, యువజన సంఘాల ద్వారా ఆర్థిక ప్రయోజనాలను కల్పించబోతున్నారు. దీన్ని బట్టిచూస్తే ఈ ఏడాది శాసనసభలో ప్రవేశపెట్టే రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో నవతరం యువతకు భారీ నజరానాలు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో తన ఆలోచనలను అధికారులతో పంచుకున్నారు. అనధికారిక సమాచారం మేరకు సుమారు లక్షా 75వేల కోట్ల రూపాయలుగా ఉండే రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు 25శాతం నిధులు వివిధ కోణాల్లో ఉపాధి రంగానికి కేటాయించబోతున్నారు. మారుమూల గ్రామాల్లో సైతం మౌలిక వసతుల కల్పన, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, కుల వృత్తులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు చేయూత ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలుగా ఉండబోతున్నాయి.

నెల ముందుగా నివేదికలు

తొలివిడత పాలనలో పరిపాలనా సౌలభ్యం కోసం, వ్యవస్థ స్థిరీకరణ కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలన్నీ విజయవంతమైనందున వచ్చే ఐదేళ్ళలో అన్ని రంగాల్లో ఎంచుకున్న లక్ష్యం మేరకు ఫలితాలను సాధించి చూపాల్సిన పట్టుదలతో ఉన్నారు. ఆ దిశగా సీఎం కేసీఆర్ అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేసి పదునైన ఆలోచనలతో, దూరదృష్టితో ముందడుగు వేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే అన్ని శాఖల్లోనూ ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించేలా నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ప్రతి శాఖలోనూ అభివృద్ధి, సంక్షేమం అనే రెండు వేర్వేరు విభాగాలను ఏర్పాటు చేసుకుని పథకాలు, కార్యక్రమాలను రూపొందించనున్నారు. అందుకు అవసరమయ్యే నిధులను దృష్టిలో పెట్టుకుని అంచనాలు తయారు చేయించారు. గత ఏడాది వివిధ రంగాలకు ఇచ్చిన ప్రాధాన్యత, నిధుల కేటాయింపులను తెలుసుకుని ఈ ఏడాది ఇవ్వాల్సిన ప్రాధాన్యతలను నెల రోజుల ముందుగానే నివేదికలు తెప్పించుకుని కేసీఆర్ పరిశీలించనున్నారు.

వస్తే ఇప్పుడే రండి

(మొదటిపేజీ తరువాయి)

సందిగ్ధంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తొలి అసెంబ్లీ సమావేశాల్లో టీడీపీ లేకుండా టీఆర్ఎస్‌లో విలీనమైతే ఒక సంపూర్ణలక్ష్యం నెరవేరుతుంది కాబట్టి ఆ మేరకు వారికి తగిన రీతిలో అవకాశాలు కల్పిస్తామని, ఇపుడు రాకుంటే తర్వాత వస్తామన్నా తమ గేట్లు తెరుచుకోవని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యేలు తమ అనుచరులతో సంప్రదింపులు కొనసాగిస్తుండగా, అసెంబ్లీ సమావేశాల నాటికి చేరుతారా లేదా స్పష్టతరానుంది. తాజా ఎన్నికల్లో టీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యతతో 88సీట్లు సాధించగా, ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు ఆ తర్వాత గులాబీతీర్థం పుచ్చుకున్నారు. ఆదినుండీ టీడీపీని లక్ష్యంగా చేసుకుని దెబ్బతీసిన టీఆర్ఎస్ రాష్ట్రంలో ప్రాతినిధ్యం లేకుండా చేయాలని భావిస్తోంది. టీఆర్ఎస్‌లో పదవులకు విపరీతమైన పోటీ ఉన్నా, సమర్ధులైన నాయకులు ఉన్నా.. ఒక్క కారణంతోనే టీఆర్ఎస్ ఇద్దరు టీడీపి నేతలకు పదవులు ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ పదవులు లేదా సామాజిక సమీకరణలను బట్టి మరింత ఉన్నతపదవులు ఇస్తామని ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు వస్తామని ఆయా జిల్లాల నేతల ద్వారా వర్తమానాలు పంపుతున్నా టీఆర్ఎస్ రెడ్‌సిగ్నల్ వేసినట్లు పార్టీ ముఖ్యులు చెబుతున్నారు. మేం తీసుకుంటామంటే గోడదూకేందుకు మెజారిటీ ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారు.. కానీ మాకు అవసరం లేదు.. ఇష్టం లేదు అని టీఆర్ఎస్ ముఖ్యనేత ఒకరు చెప్పారు. టీడీపీ నేతలు టచ్‌లో ఉన్నారు.. ఇద్దరూ వచ్చి విలీనం చేస్తామంటే కాదనం అని వ్యాఖ్యానించారు. ఈనెల 17నుండి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండగా, 20వ తేదీవరకు ఇవి జరగనున్నాయి. తెలంగాణ రాష్ట్రసమితి వ్యూహాత్మక నిర్ణయం నేపథ్యంలో టిడిపి ఎమ్మెల్యేల అడుగులపై ఉత్కంఠ ఏర్పడింది.

డోస్ట్‌లో సంస్కరణలు?

- విద్యార్థులకు అనుకూలంగా నిర్ణయాలు
- అడ్మిషన్లలో వెసులుబాటు.. సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం
- ప్రైవేటు కాలేజీల ఆగడాలకు చెక్
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన డోస్ట్ కమిటీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: డిగ్రీ అడ్మిషన్ల సందర్భంగా ప్రైవేటు కళాశాలల ఆగడాలకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. రెండేళ్లుగా డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లను డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (డోస్టు) ద్వారా చేపడుతున్న సంగతి తెలిసిందే. కొత్త అడ్మిషన్ల వ్యవహారంలో విద్యార్థులకు అనుకూలంగా సంస్కరణలు తీసుకురావాలని, తద్వారా ప్రైవేటు డిగ్రీ కాలేజీల ఆగడాలకు చెక్ పెట్టాలని సర్కార్ భావిస్తోంది. అందులో భాగంగా 2019-20లో సీటు పొందిన విద్యార్థులు కాలేజీకి వెళ్లి రిపోర్ట్ చేయవలసిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చేలా అవకాశం ఇవ్వాలని డోస్టు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గతంలో సీటు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీలకు వెళ్లి చేరుతున్నట్టుగా చెప్పాల్సి వచ్చేది.

ఇప్పటివరకు నిబంధనలు ఇలా...

ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం డిగ్రీ మొదటి సంవత్సరంలో ఒక కాలేజీలో సీటు వస్తే ఆ విద్యార్థి సంబంధిత కాలేజీకి వెళ్లి తాను కాలేజీలో చేరడానికి సమ్మతి తెలుపుతున్నట్టు తన సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను ఇవ్వాల్సి వస్తోంది. ఆ విద్యార్థికి రెండో విడతలో మరో కాలేజీలో సీటు వస్తే అక్కడ రిపోర్టింగ్ చేయడానికి కూడా ఆయా కాలేజీలకు వెళ్లాలి. ఇందుకోసం గ్రామీణ ప్రాంత విద్యార్థులు దూరాభారం, వ్యయప్రయాసలకు గురికావల్సి వచ్చేది. పైగా సీటొచ్చిన కళాశాలకు వెళితే ట్యూషన్ ఫీజు చెల్లించాకే అడ్మిషన్ ఇస్తామని నిర్వాహకులు మెలికపెడుతున్నారు. ముందే ఫీజు వసూలు చేస్తే ఆ విద్యార్థి మరో కాలేజీకి వెళ్లకుండా ఉంటాడని ఆయా కళాశాలల యాజమాన్యాలు భావిస్తున్నాయి. ఒకవేళ ట్యూషన్ ఫీజు చెల్లించాక మరో కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు తిరిగి ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. అలా ట్యూషన్ ఫీజు చెల్లించిన వారు మరో విడతలో ఇంతకంటే మంచి కాలేజీలో సీటువస్తే చెల్లించిన ఫీజు తిరిగి విద్యార్థులకు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో మరో విడతలో మంచి కాలేజీలో విద్యార్థులు సీటు పొందినప్పటికీ ఆ కాలేజీలో చేరలేని పరిస్థితుల్లో ఉన్నారు. కాబట్టి ఈ ఏడాది నుంచి అటువంటి పరిస్థితి విద్యార్థులకు ఉండకూడదనే ఉద్దేశంతో డోస్టు అధికారులు ఆన్‌లైన్ రిపోర్టింగ్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ విధానం ఇప్పటికే ఇంజనీరింగ్ ప్రవేశాలతోపాటు ఇతర వృత్తివిద్య కోర్సుల్లో అమలు చేస్తున్నారు. కాబట్టి అదే విధానాన్ని డోస్టులోకూడా అమలు చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. వచ్చే నెలలో జరిగే డోస్టు మీటింగ్‌లో దీనిపై తుది నిర్ణయం తీసుకుని ప్రభుత్వ అంగీకారంతో ముందుకు వెళ్లాలని డోస్టు అధికారులు భావిస్తున్నారు.

దరఖాస్తు ప్రక్రియ సులభతరం

డోస్టులో దరఖాస్తు చేసుకోవడానికి గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందిపడుతున్న విషయం డోస్టు అధికారులు గుర్తించారు. కాలేజీలను ఎంపిక చేసుకోవడంతోపాటు.. దరఖాస్తు చేసుకునే విషయంలోనూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను గుర్తించిన అధికారులు దరఖాస్తు ప్రక్రియలోనూ కొన్ని సంస్కరణలు తీసుకురావాలని నిర్ణయించారు. విద్యార్థి దరఖాస్తు చేసుకునే కోర్సుకు సంబంధించి ఆ కోర్సు ఏ ఏ కాలేజీల్లో ఉందో వెంటనే డిస్‌ప్లే అయ్యేలా డోస్టులోనూ సీజీజీతో మాట్లాడి మార్పులు తీసుకురావాలని, దరఖాస్తు కేంద్రాలను పెంచాలని ఆలోచిస్తున్నారు. ఒక కళాశాలలో సీటొస్తే తప్పనిసరిగా అక్కడే చేరాలన్న నిబంధనపై తల్లిదండ్రుల్లో అసంతృప్తి ఉంది. దీంతో అడ్మిషన్ల చివర్లో వారికి మరో కాలేజీలో సీటు వచ్చి ఉంటే, చేరడానికి అవకాశం కల్పించారు. ఈసారి అలా కాకుండా మొదటి ప్రాధాన్యతలో సీటు వచ్చిన వారికి కూడా మరో విడతలో కాలేజీ మార్పుకు అవకాశం కల్పించాలని డోస్టు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. విద్యార్థులకు సానుకూలంగా ఉండేలా సంస్కరణలు తీసుకురావాలని, ప్రభుత్వ అనుమతితో వాటిని వచ్చే 2019-20 విద్యాసంవత్సరం నుంచి అమలు చేయాలని భావిస్తున్న అధికారులు అందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నారు.

లింగాయపాలెంలో కాకతీయుల శాసనం!

- చారిత్రక పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ : గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని లింగాయపాలెం గ్రామంలో క్రీ.శ. 13 శతాబ్ది నాటి కొత్త కాకతీయ శాసనం బయటపడిందని ప్రముఖ చారిత్రక పరిశోధకులు , కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి సీఈవో ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. లింగాయపాలెం గ్రామానికి చెందిన అనుమోలు గణేశ ప్రసాద్ ఇచ్చిన సమాచారం మేరకు ఆ గ్రామ పరిసరాల్లో తమ బృందం పర్యటించిందని శివనాగిరెడ్డి చెప్పారు. ఈ గ్రామ రహదారి పక్కన ఉన్న పోతురాజు తోటలో ఈ కొత్త శాసనం బయల్పడిందని ఆయన తెలిపారు. ఒక అడుగు 3అంగుళాల చదరంగా ఉన్న రాయిపైన నంది, తూర్పున సూర్యచంద్రులు, దక్షిణాన మహిషమర్దిని, పశ్చిమాన గణేశ, అదే వైపు లకులీశుని ప్రతిమలు, నాలుగు వైపుల కాకతీయుల శిలాశాసనం చెక్కి ఉందని ఆయన చెప్పారు. మందడం - మల్కాపురంలోని రుద్రమదేవి జన్మదినోత్సవ శాసనాన్ని పోలిన ఈ శాసన స్తంభం దాదాపు 5 అడుగులు భూమిలోకి కుంగిపోయిందని, భూమిపైన కేవలం 2అడుగులు మాత్రమే కనిపిస్తుందని ఆయన తెలిపారు. మొత్తం శాసనాన్ని పైకితీసి శాసనపాఠాన్ని నకలు తీసి అందులోని విషయాన్ని త్వరలో వెల్లడిస్తానని ఆయన తెలిపారు. ఈ శాసనాన్ని నిలబెట్టి పరిరక్షించడం కోసం తగిన చర్యలు తీసుకోవాలని సీఆర్డీయే, పురావస్తు శాఖాధికారులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

నిరుపేద చిన్నారికి 'హెల్పింగ్ హ్యాండ్' చేయూత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: 11 ఏళ్ల నిరుపేద బాలికకు తక్కువ కోతతో క్లిష్టమైన ఎండోస్కోపిక్ అక్విడక్టోప్లాస్టీ చికిత్సను నిర్వహించారు వైద్యులు. మజీద్‌లో మౌజమ్‌గా పనిచేస్తున్న మహ్మద్ షరీఫ్ కూతురు 11 ఏళ్ల ఖాతిజ తీవ్రమైన తలనొప్పితో బాధపడుతుంటే వైద్యులకు చూపించారు. ఆ బాలిక 3వ వెంట్రిక్యులర్ ఆర్కనాయిడ్ సిస్ట్‌తో బాధపడుతోందని వైద్యులు నిర్ధారించారు. దీంతో బాలిక వైద్యానికి రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అంతపెద్దమొత్తంలో డబ్బులు తన వద్ద లేకపోవడంతో షరీఫ్ ఆందోళన చెందాడు. దీంతో హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ స్పందించి శస్త్రచికిత్సకు అవసరం అయిన నిధులను సమకూర్చిందని ఫౌండేషన్ ప్రతినిధి ముజ్తబా హసన్ అక్సారీ తెలిపారు. బాలికకు డాక్టర్ అమీర్ భాషా పాస్‌పాల శస్త్రచికిత్సను చేసిన బాలికను రక్షించారు. కేవలం 24 గంటల్లో ఆపరేషన్ చేసిన డిశ్చార్జ్ కూడా చేశారు. దీంతో వారం రోజుల్లో ఖాతిజ తిరిగి స్కూల్‌కి వెళ్లగలదని వైద్యులు తెలిపారు. తక్కువ కోతతో చేసేటటువంటి ఎండోస్కోపిక్ న్యూరో పద్ధతిని అమలు చేసి ఖాతిజ ప్రాణాలను కాపాడటం జరిగిందని వైద్యులు తెలిపారు.

రెండు చిరుతలు మృత్యువాత

- మాక్లూర్ అడవుల్లో వేటగాళ్ల ఉచ్చులోపడి ఒకటి మృతి
- మంచిర్యాల జిల్లాలో మరో కళేబరం లభ్యం
- రెండు రోజుల్లో వరుస సంఘటనలు
- మరో కేసులో నిందితులను పట్టించిన జాగిలాలు
- పులిచర్మం, గోళ్లు స్వాధీనం




మంచిర్యాల/మాక్లూర్, ప్రభన్యూస్ : తెలంగాణలో పులల వేట యథేచ్ఛగా సాగిపోతోంది. ఇటీవలి కాలంలో వెలుగుచూసిన వరస సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా రెండురోజుల్లో వరుసగా మరో రెండు పులులు వేటగాళ్ల బారినపడి ప్రాణాలు కోల్పోయాయి. మంచిర్యాల జిల్లా జైపూర్-బీమారం అడవుల్లో వేటగాళ్ళ ఉచ్చులో చిక్కి ఒక చిరుతపులి ప్రాణాలు కోల్పోగా... నిజామాబాద్ జిల్లా మాక్లూర్ అటవీప్రాంతంలో మరో చిరుతపులి కళేబరం లభ్యమవడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కాగా నాలుగురోజుల క్రితం పులిని హతమార్చిన దుండగులను జాగిలాలు పసిగట్టి పోలీసులకు పట్టించడం విశేషం.

మంచిర్యాల జిల్లాలో...

నెల రోజుల నుంచి మంచిర్యాల జిల్లాలో చిరుతపులుల వేట కొనసాగుతూనే ఉంది. జైపూర్, బీమారం మండలాల సరిహద్దున గల రంగపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో వేటగాళ్ళు ఏర్పాటు చేసిన ఉచ్చులో చిరుతపులి చిక్కుకొని మృతి చెందిన విషయం వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ అధికారులు అమర్చిన సీసీ టీవి ఫుటేజీ ద్వారా ఈ మృతి చెందిన చిరుత జాడను తెలుసుకున్నారు. చిరుత మెడకు వేటగాళ్ళ ఉచ్చు బిగుసుకుపోయి మృతి చెందగా అటవీ శాఖ అధికారులు పంచనామా నిర్వహించారు. చిరుత పులి మృతికి కారణమైన వేటగాళ్ళను పట్టుకునేందుకు ప్రత్యేక అటవీ దళాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను చేపడుతున్నారు.

నిజామాబాద్ జిల్లాలో...

నిజామాబాద్ జిల్లా, మామిడిపల్లి శివారులో గల దట్టమైన అడవిలో చిరుతపులి కళేబరాన్ని అధికారులు కనుగొన్నారు. ఆదివారం అటవీ శాఖ బీట్ అధికారులు విధి నిర్వహణలో భాగంగా అడవుల్లో తిరుగుతూండగా చిరుత పులి కళేబరాలు గుర్తించినట్లు ఆర్మూర్ డిజవిన్ అటవీ శాఖాధికారి రాములు చెప్పారు. సోమవారం ఘటనా స్థలానికి చేరుకున్న అటవీ, పోలీసు శాఖాధికారులు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మృతి చెందిన చిరుత అవయవాలు



చిందరవందరగా పడి ఉన్నాయి. ఘటనాస్థలాన్ని పరిశీలించిన డీఎఫ్‌వో రాములు జంతుశాలలో ప్రత్యేక శిక్షణ పొందిన జాగిలాన్ని జన్నారం నుంచి రప్పించారు. వా- ...ఎన పసిగట్టే క్రమంలో జాగిలం చూపించిన కొన్ని ఆనవాళ్లను గుర్తించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ స్థానిక పశువైద్యాధికారి కిరణ్ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేశారని, చిరుత మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. వేటగాళ్ల వేటుకు గురైందా లేక ఇతర జంతువులతో జరిగిన ఘర్షణలో మరణించిందా అనే విషయంలో విచారణ చేస్తున్నామని చెప్పారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని స్పష్టం చేశారు. ఒకవేళ పులి వేటగాళ్ల చేతిలో మరణించినట్లు ఆధారాలు లభిస్తే నిందితులను కఠినంగా శిక్షిస్తామని అన్నారు. ఈ నెల 4వ తేదీన తప్పించుకున్న చిరుత ఇదేనా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. కాగా చిరుత కళేబరానికి అధికారులు అంతిమ సంస్కారం నిర్వహించారు.

నిందితులను పసిగట్టిన జాగిలాలు

జన్నారం - నిజామాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం చిరుతను హతమార్చిన నిందితులను పోలీసు జాగిలాలు పసిగట్టి పట్టించాయి. ఈ కేసులో ఆర్మూర్ సమీపంలో ఉన్న రాంచందర్‌పల్లి తండాకు చెందిన నరేందర్, విజయ్, తులసీరామ్, రవిలను సోమవారం డాగ్ స్క్వాడ్ బృందం చాకచక్యంగా పట్టుకుందని స్థానిక ఎఫ్‌డిఓ కె.రవీందర్ తెలిపారు. డాగ్ స్క్వాడ్ బృందం ఇన్‌చార్జి శ్రీనివాస్, సత్యనారాయణలు ఆ జాగిలంతో అక్కడి అడవుల్లోకి వెళ్లి నాలుగు రోజుల క్రితం చంపబడిన చిరుతపులి, గొర్రెల కళేబరాలను పరిశీలించారు. వాటి ఆధారంగా జాగిలాలు ముందుకువెళ్లాయి. చివరకు నిందితులను పసిగట్టిన జాగిలాలు వారి జాడను కనిపెట్టాయి. జాగిలాలను అనుసరించిన అధికారులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులనుండి చిరుతపులి గోర్లను, చర్మాన్ని స్వాధీనం చేసుకున్న ఆర్మూర్ అటవీ అధికారులు కేసు నమోదు చేశారు.



బోయింగ్ బుగ్గి

టెహ్రాన్ : పశ్చిమ టెహ్రాన్ ప్రాంతంలో ఇరాన్ కార్గో విమానం (బోయింగ్707) కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో 16మంది మరణించారు. కేవలం ఒకరు మాత్రమే ప్రాణాలతో బయటపడినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది

ప్రయాణికులకు నీలిరంగు హెచ్చరిక

ముంబై: రైలు ప్రయాణికులను హెచ్చరించేందుకు సెంట్రల్ రైల్వే ముంబైలోని లోకల్ రైళ్లకు నీలిరంగు సూచికను పైలట్ ప్రాజెక్టుగా అమర్చింది. కాగా ముంబై సబర్బన్ నెట్‌వర్క్ ప్రపంచవ్యాప్తంగా 75లక్షల రోజువారీ ప్రయాణికులతో అతిపెద్ద నెట్‌వర్క్‌గా గుర్తింపు పొందింది. కోచ్ బయట నీలిరంగు బల్బు రైలు వేగం అందుకున్నపుడు ప్రయాణికులు కోచ్‌లోకి ఎక్కేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరిస్తుందని సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి సునీల్ యు దసీ తెలిపారు. ప్రయాణికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ విధానాన్ని విస్తృతం చేస్తామని ఆయన తెలిపారు. శబ్దం చేస్తూ వెలిగే నీలిరంగు బల్బు ఇండికేటర్ ప్రయాణికులను హెచ్చరిస్తుందని ఈ సిస్టమ్ ట్రైన్‌గార్డ్ అధీనంలో ఉంటుందని తెలిపారు.


ప్రధానిగా రాహుల్ ఓకే

- మాజీ ప్రధాని దేవేగౌడ స్పష్టీకరణ

బెంగుళూరు: తదుపరి ప్రధానమంత్రిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి మద్ధతులో ఇవ్వడంలో ఎలాంటి అసమ్మతి లేదని మాజీ ప్రధాని, జేడీఎస్ కురువృద్ధుడు దేవేగౌడ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ యువనాయకుడని, రాబో...యే నాయకుడని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఏడాది క్రితమే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని, రాహుల్ అనుభం పెరిగిందన్నారు. అయితే రాహుల్ ఇంకా పరిణితి చెందాల్సి ఉందన్నారు. కూటమి భాగస్వామిగా రాహుల్ ప్రధానమంత్రిగా మద్ధతు తెలపడానికి ఎలాంటి అసమ్మతి లేదని, రాహుల్ ప్రధాని కావాలని దేవేగౌడ అన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం, విపక్షాలను ఐక్యం చేయడం రాహుల్‌లో చూశామన్నారు. కర్నాటకలో 2019 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దృష్టిసారించామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీలా మరే ప్రధాని ప్రచారం కోసం ఇంత డబ్బును ఖర్చుచేయలేదన్నారు. డబ్బంతా మోదీ వ్యక్తిగత డబ్బు కాదని విమర్శించారు. ఈ విధానంతో అవినీతి రహిత పాలన తీసుకురావడం కుదరదని మోదీ ప్రసంగాలను ఊటంకించారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చే అన్నీ పథకాలను తాను తప్పుబట్టలేనని, కానీ డబ్బును వృథా చేయడాన్ని సమర్థించనన్నారు. తాను ప్రధానిగా ఉన్న సమయంలో వ్యవసాయ వృద్ధి పెరిగిందన్నారు. ఉత్తర భారత దేశంలో జాతీయ రహదారులను మంజూరు చేసింది తానేనన్నారు. రాఫెల్ వివాదంపై రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే నిర్మలా సీతారామన్ సమాధానమిచ్చారని, ప్రధాని మోదీ ఎందుకు సమాధానం ఇవ్వడంలేదని ప్రశ్నించారు. కాపలాదారు దొంగ అంటూ మోదీని రాహుల్ విమర్శించడాన్ని దేవేగౌడ తప్పుబట్టారు. దేశ ప్రధాని స్థానానికి విలువ ఇవ్వాలని సూచించారు.

ఇక గన్నవరం టు గల్ఫ్!

- దుబాయ్‌కి విమాన సర్వీసులు
- సింగపూర్ సర్వీసులకు అనూహ్య స్పందన
- అంతర్జాలంలో అభిప్రాయ సేకరణ
- నెలాఖరులో టెండర్లు దాఖలు చేసే యోచన




అమరావతి, ఆంధ్రప్రభ; గన్నవరం విమానాశ్రయం నుండి గత ఏడాది ప్రారంభించిన సింగపూర్‌కు సర్వీస్‌కు అనూహ్య స్పందన లభించడంతో దుబాయ్‌కు సర్వీస్ నడిపేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. గన్నవరం నుండి దుబాయ్‌కు సర్వీస్ నడిపేందుకు గత మూడు రోజులుగా అంతర్జాలంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోంది. సింగపూర్ సర్వీస్‌కు ప్రజాభిప్రాయ సేకరణలో రోజుకు ఏడు వేల మందికిపైగా ఉత్సాహం చూపగా దుబాయ్ సర్వీస్‌కు 10 వేల మంది తమ ఆమోదాన్ని చూపినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ ఎయిర్ పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ దుబాయ్ సర్వీసులపై ప్రజాభిప్రాయ సేకరణకు బహిరంగ ప్రకటన చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ నుండి దుబాయ్ మార్గంలో ఉన్న ఛార్జీల క్రమంలో గన్నవరం విమానాశ్రయం నుండి దుబాయ్ విమానాశ్రయానికి విమానాలు ప్రారంభించే సాధ్యాసాధ్యాలను పరీక్షించే ప్రతిపాదనపై ప్రజల నుండి అభిప్రాయం తెలుసుకోవడానికి ఏడీసీఎల్ ప్రయత్నిస్తోంది. గన్నవరం నుండి దుబాయ్ మధ్య విమాన సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ www.apadcl.com లో నెటిజన్ల నుండి స్పందన తెలుసుకుంటున్నారు. విజయవాడ - సింగపూర్ మధ్య సర్వీస్ ఏర్పాటుచేసే సమయంలో కూడా ఇదే విధంగా అభిప్రాయ సేకరణ చేయగా 10 రోజుల్లో 79,404 మంది వెబ్‌సైట్‌లో స్పందించారు. అలాగే 13,035 మంది ఈ మెయిల్‌లోనూ, 4,020 మంది వాట్సప్‌లో, 1,993 మంది మెస్సేజీల రూపంలో స్పందించారు. ప్రజాభిప్రాయ సేకరణలో నెటిజన్ల నుండి సానుకూల స్పందన లభించడంతో విజయవాడ - సింగపూర్‌ల మధ్య విమానయాన సేవలను ప్రారంభించారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం దుబాయ్ వంతు వచ్చింది. దుబాయ్ సర్వీసులకు ప్రజాభిప్రాయం అధికంగా ఉంటే విమాన సర్వీసులు నడిపేందుకు సానుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. దుబాయ్‌కు కూడా సర్వీసులు సాకారమైతే ప్రపంచ దేశాలకు ఎక్కడికైనా చేరుకోవడానికి విమానాల సదుపాయాలు కలిగిన డెస్టినేషన్ ఎయిర్ పోర్టులకు మరింత కనెక్టవిటీ ఏర్పడుతుంది.

నవ్యాంధ్రప్రదేశ్‌కు తలమానికమైన విజయవాడ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా వచ్చి 11 నెలలు అయినా విదేశాలకు ఒక్క సర్వీసు కూడా లేకపోవడం కేంద్రం కొర్రీలు మీద కొర్రీలు పెడుతూ ఉండటంతో ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగింది. అవసరమైతే ఎదురు పెట్టుబడి పెట్టి విదేశాలకు విమానాలు నడిపించాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే అభివృద్ధి చెందిన ఆసియా దేశాల్లో సింగపూర్‌కు తొలి విమాన సర్వీసు నడపాలని నిర్ణయించి ఏపీఏడీసీఎల్‌కు బాధ్యతలు అప్పగించింది. సింగపూర్‌కు సర్వీసులు ప్రారంభించేముందు ప్రజల అభిప్రాయాన్ని వెబ్ పోర్టు ద్వారా సేకరించగా సుమారు లక్ష మంది మద్దతు పలుకుతూ స్వాగతించారు. ఈ నేపథ్యంలో ఔత్సాహిక విమానయాన సంస్థలకోసం టెండర్లు పిలవగా ఇండిగో సంస్థ ప్రతిపాదన ఆమోదయోగ్యంగా ఉండటంతో దానిని ఎంపిక చేశారు.

వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) ప్రాతిపదికన సింగపూర్‌కు విమాన సర్వీసులు నడుపుతున్న నేపథ్యంలోనే దుబాయ్‌కు కూడా ఇదేవిధంగా సర్వీసులు నడిపేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వీజీఎఫ్ విధానంలో 50 శాతం సీట్లు నిండకపోతే ఆ విమానయాన సంస్థకు వచ్చే నష్టాన్ని రాష్ట్రప్రభుత్వం భరిస్తుంది. కాగా, సింగపూర్‌కు సర్వీస్ ప్రారంభించిన నాటి నుండి నేటి వరకూ ప్రభుత్వం వీజీఎఫ్ చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది. సింగపూర్ సర్వీసులకు ప్రభుత్వం ఊహించిన దానికంటే ప్రయాణీకుల నుండి అనూహ్య స్పందన లభించడంతో ప్రభుత్వం దుబాయ్ సర్వీసులపై దృష్టి సారించింది. దుబాయ్‌కు విమాన సర్వీసులు నడపడానికి ఇటీవలి వరకూ స్లాట్ లేదు. అయితే, స్పైస్ జెట్ సంస్థ ఇటీవల దేశం నుండి సింగపూర్‌కు పలు విమాన సర్వీసులను ఉపసంహరించుకోవడంతో స్లాట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో గన్నవరం నుండి దుబాయ్‌కు సర్వీసు నడిపేందుకు స్లాట్ అవకాశం లభిస్తుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచనలో ఏడీసీఎల్ ఉంది.

ఇదిలావుండగా దుబాయ్ సర్వీసులపై పోర్టల్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఏడీసీఎల్ ఔత్సాహిక విమాన సంస్థల నుండి టెండర్లను ఆహ్వానించనుంది. అన్నీ సజావుగా జరిగితే నెలాఖరుకు టెండర్లు పిలిచి సార్వత్రిక ఎన్నికల ప్రకటన తేదీకి లోపే దుబాయ్‌కు విమాన సర్వీసులు ప్రారంభించేందుకు అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. దుబాయ్‌కు సర్వీసులు ప్రారంభించడం వలన విజయవాడ విమానాశ్రయానికి అంతర్జాతీయంగా మరింత ఖ్యాతి పెరగనుంది. పర్యాటక, వ్యాపార, వాణిజ్య రంగాలకు ఊతం ఇవ్వనుంది. తద్వారా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడనుంది.



ఈ భూ ప్రపంచంలో జీవకోటి మనుగడకు జలమే ఆధారం. ఎక్కడ జలసిరులు పరిఢవిల్లుతాయో, అక్కడ జీవన వికాసం నిత్య నూతనంగా వర్ధిల్లుతుంది. మన దేశంలో వేద కాలం కంటే ముందు నుంచే నదులు, సరస్సుల పరిసరప్రాంతాల్లోనే నాగరికత విలసిల్లింది. జల నిధులను తన జీవనచక్రంలో భాగంగా మార్చుకున్న మనిషి.. నదీనదాల్ని దేవతా స్వరూపాలుగా ఆరాధించాడు. కుంభమేళాలు, పుష్కరాలు, పుణ్య స్నానాలు ఆ పరంపరకు చెందినవే. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుకగా మహాకుంభమేళా మకర సంక్రమణం జరిగిన రోజు ప్రారంభమౌతుంది. కుంభమేళాకు ప్రయాగ్ రాజ్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నేటి నుంచి 50 రోజుల పాటు(జనవరి 15 నుంచిమార్చి 4 వరకు) జరిగే కుంభమేళాకు దేశ నలుమూలల నుంచి 12 కోట్లకు పైగా భక్తులు తరలిస్తారని అంచనా. కుంభమేళా గ్రహాలను అనుసరించి నాలుగు ప్రదేశాల్లో జరుగుతుంది. హరిద్వార్,ప్రయాగ్ రాజ్ ,ఉజ్జయిని, నాసిక్ ప్రాంతాల్లో ఈ మహాక్రతువును నిర్వహిస్తారు.సాధారణంగా పూర్ణ కుంభమేళా ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. అర్ధ కుంభమేలా ఆరేళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. అర్ధ కుంభమేళా ప్రయాగ, హరిద్వార్‌లలో మాత్రమే జరుగుతుంది. ప్రయాగ్‌రాజ్ లోని త్రివేణి సంగమ ప్రాంతంలో సరస్వతీ నది ప్రవహిస్తోంది.



ప్రయాగ్.. కుంభమేళా

సంక్రాంతి నుంచి మహా శివరాత్రి వరకు ..

- 15 కోట్ల మంది పుణ్య స్నానానికి ఏర్పాట్లు
- 3,200 హెక్టార్లలో కుంభమేళా
- రూ. 2800 కోట్లు కేటాయించిన యోగి సర్కార్
- భక్తుల కోసం వేలాది గుడారాలు
- 1200 సీసీ కెమెరాలతో డేగ కన్ను

కుంభ అంటే సంస్కృతంలో కుండ, కలశం అని అర్థం. మేళా అంటే కూటమి, కలయిక లేక జాతర. మన ఖగోళ శాస్త్రం ప్రకారం కుంభం అనేది ఒక రాశిని కూడా సూచిస్తుంది. ఈ రాశిలోనే ఈ పండుగను నిర్వహిస్తారు. పుష్యభూతి వంశ రాజు హర్షవర్ధనుడి రాజ్యాన్ని క్రి.శ 629-645 మధ్య కాలంలో సందర్శించిన చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ తన రచనలలో కుంభ మేళా గురించి ప్రస్తావించాడు. నదీ సంబంధిత పండుగలు భారత దేశంలో వేద కాలం నుంచే ఉండేవని హుయాన్ త్సాంగ్ తన రచనల్లో నదీ పుణ్య స్నానాల గురించి పేర్కొన్నాడు. పురాణ గాథల్లోనే కుంభమేళా ప్రస్తావన ఉంది. క్షీర సాగర మధన సందర్భంలో, భాగవత పురాణంలో, విష్ణు పురాణంలో, మహా భారతంలో మరియు రామాయణం లో కుంభ మేళాకు సంబంధించిన ప్రస్తావన కనిపిస్తుంది.

దేవతలు తమ శక్తిని పోగొట్టుకుని దానిని తిరిగి పొందడం కోసం అమృతాన్ని సంపాదించాలని క్షీర సాగర మధనానికి పూనుకుంటారు. దీనికి గాను వీరు అమృతం లభించాక చెరి సగం తీసుకోవాలనే ఒప్పందంతో తమ శత్రువులైన అసురుల లేక రాక్షసుల సహాయం కోరతారు. అయితే అమృతాన్ని కలిగి ఉన్న కుంభం (కుండ) కనబడగానే పోట్లాట మొదలవుతుంది. పన్నెండు రాత్రులు మరియు పన్నెండు పగళ్ళు పాటు దేవతలు రాక్షసుల మధ్య అమృతపు కుండ కోసం భీకర పోరు జరుగుతుంది. ఈ యుద్ధ సమయంలో మహా విష్ణువు ఈ అమృతపు కుంభాన్ని తీసుకుని పారిపోతూ ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని మరియు నాసిక్ లలో కొన్ని అమృతపు బిందువులు చిలకరించాడని నమ్ముతారు.

ఇదే విశ్వాసంతో పయాగ, హరిద్వార్, ఉజ్జయిని మరియు నాసిక్‌లలో జరిగే కుంభమేళాలతో జనం భారీగా తరలివస్తుంటారు. కుంభమేళా జరిగే ప్రాంతంలోని నదీ జలాలతో పవిత్ర స్నానం ఆచరిస్తే పుణ్యం సిద్ధిస్తుందని ప్రజల విశ్వాసం.

అడుగడుగునా సీసీ కెమెరా

మహా క్రతువుకు విచ్చేసే యాత్రికులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు హైటెక్ టెక్నిక్స్‌తో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. నూతన ఆవిష్కరణల టెక్నాలజీలకు ప్రయోగ్ రాజ్ కుంభమేళా వేదిక కాబోతోంది. 3200 హెక్టార్లలో నిర్వహించే కుంభమేళాలో అణువణువునా పోలీసులు డేగకన్ను వేశారు. 1200 సిసి కెమెరాలతో 24 గంటల పాటు నిఘా పెట్టేలా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మహా క్రతువు భారీగా తరలివచ్చే భక్తుల క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం రియల్ టైం వీడియో అనలిటిక్స్‌ను, రియల్ టైం డిటెక్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే ఘాట్‌ల వద్ద పరిస్థితులను అంచనా వేసి అప్పటికప్పుడు తీసుకోవాల్సిన చర్యల కోసం అలర్ట్ అల్‌గరిథమ్‌లను కూడా ఏర్పాటు చేశారు.అనుమాన కదలికలు, అవాంచనీయ ఘటనలు జరిగే అవకాశమున్నా.. ఉగ్రముప్పును పసికట్టేందుకు అలర్ట్ అలారమ్‌లు వెంటనే పోలీసులకు సమాచారమందిస్తాయి. కుంభమేళాకు యోగి ప్రభుత్వం 2800 కోట్లు ఖర్చు చేస్తోంది. మహా క్రతువును విజయవంతం చేసేందుకు 250 కి.మీ పొడవైన రోడ్లు,22 పంటూన్ బ్రిడ్జిలు, 40 వేల ఎల్‌ఈడీలు అమర్చారు. మొత్తం 20 వేలమంది పోలీసులు విధుల్లో ఉన్నారు.ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రోబో సాఫ్ట్ వేర్లకు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థను అనుసంధానం చేశారు.

ప్రత్యేక యాప్

ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లో జరిగే కుంభమేళాకు వెళ్లే యాత్రికుల కోసం ఉత్తర మధ్య రైల్వే ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఆవిష్కరించింది. రైల్ కుంభ మేళా పేరుతో రూపొందించిన ఈ యాప్ ద్వారా కుంభమేళా ప్రత్యే కతలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందిస్తున్నారు. కుంభమేళాకు ఏఏ సమయాల్లో ఎక్కడెక్కడి నుంచి రైళ్లు వెళ్తాయో అనే విషయాన్ని కూడా తెలుసుకోవచ్చు. రైల్వే రిజర్వేషన్ చేసుకోలేని కుంభమేళా యాత్రికులు కూడా రిజర్వేషన్ చేసుకోకపోయినా యాప్ ద్వారా సమాచారాన్ని పొందవచ్చు. కుంభమేళా జరుగుతున్న ప్రాంతంతో పాటు చుట్టుపక్కల సందర్శించాల్సిన ప్రదేశాల సమాచారాన్ని కూడా యాప్‌లో పొందుపరిచారు. ప్రయాగ్‌రాజ్ సమీపంలోని రైల్వే స్టేషన్లతో పాటు ప్రముఖ హోటళ్లు, బస్ స్టేషన్లు, ఇతర వివరాలు కూడా తెలుసుకునే విధంగా యాప్‌ను రూపొందించారు. గతంలో జరిగిన కుంభమేళాలకు సంబంధించిన ఫొటో గ్యాలరీని కూడా యాప్‌కు అనుసంధానం చేశారు. ప్రయాగ్‌రాజ్ రాజ్ కుంభమేళాకు వెళ్లే భక్తులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు లభించే ప్రాంతాలతో పాటు సమీపంలో ఉన్న ఏటీఎంలు, బ్యాంకుల వివరాలు కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఆధ్యాత్మికంలో అపశ్రుతులు

2003 సంవత్సరంలో నాసిక్ వేదికగా జరిగిన కుంభ మేళాకు దాదాపు 8 కోట్ల మంది ప్రజలు తరలివచ్చారు. జులై 27 నుండి సెప్టెంబరు 7 మధ్య నాసిక్ లో నిర్వహించిన కుంభ మేళాలో స్నాన ఘట్టాల వద్ద అపశృతి చోటుచేసు కోవడంతో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 28 మహిళలు మరియు 11 మంది పురుషులు. పవిత్ర స్నానం ఆచరించేందుకు గోదావరి నది ఒడ్డున దాదాపు 30 వేల మంది భక్తులు రామకుండ్ ఘాట్‌కువెళ్లారు. ఆ సమయంలో ఒక సాధువు కొన్ని వెండి నాణాలను విసరడంతో తోపులాట తొక్కిసలాట జరిగింది. దీంతో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక 2013లో ప్రయాగ వేదికగా జరిగిన కుంభమేళా సందర్భంగా జరిగిన తోపులాట కారణంగా42 మంది ప్రాణాలు కోల్పోయారు. అలహాబాద్ రైల్వే ఫుట్ బ్రిడ్జి కూలిపోవడంతో.. ప్రజలను కంట్రోల్ చేసేందుకు పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. దీంతో తోపులాట జరిగి 29 మంది మహిళలు, 12 మంది పురుషులు చనిపోయారు.

గ్రహాలు.. రాశుల ఆధారంగా..

సూర్యుడు, బృహస్పతి స్థానాల ఆధారంగా కుంభమేళా జరుపుకోవడం జరుగుతుంది. సూర్యుడు మరియు బృహస్పతి సింహ రాశిలో ఉన్నప్పుడు ఈ కుంభ మేళాను నాసిక్ లోని త్రయంబకేశ్వర్‌లో, సూర్యుడు మేష రాశిలో ఉన్నప్పుడు హరిద్వార్‌లో.. సూర్యుడు మకర రాశిలో, బృహస్పతి వృషభ రాశిలో ఉన్నప్పుడు కుంభ మేళాను ప్రయాగలో... సూర్యుడు, బృహస్పతి వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు ఉజ్జయినిలో కుంభమేళా నిర్వహిస్తారు. ప్రతి స్థలం లోను కుంభ మేళా నిర్వహించేతేదీలను సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి స్థానాల ఆధారంగా నిర్ణయిస్తారు.

ఎప్పుడు..ఎక్కడ..

కుంభమేళా ప్రతి మూడేళ్లకు ప్రయాగ (అలహాబాద్), నాసిక్, హరిద్వార్, ఉజ్జయినిలలో... ప్రతి ఆరేళ్లకు హరిద్వార్, ప్రయాగలలో అర్ధ కుంభమేళా జరుగుతుంది. పన్నెండేళ్లకోసారి ప్రయాగలోని త్రివేణి సంగమంలో పూర్ణకుంభమేళాగా వెల్లివిరుస్తుంది. పన్నెండు పూర్ణకుంభమేళాలు అంటే 144 సంవత్సరాలకోసారి మహాకుంభమేళా వస్తుంది. దీన్ని ప్రయాగలోనే నిర్వహిస్తారు. మహాకుంభమేళాలో మకర సంక్రాంతితో పాటు పుష్యపౌర్ణమి, మౌని అమావాస్య (ఫిబ్రవరి 10), వసంత పంచమి (ఫిబ్రవరి 15), రథసప్తమి (ఫిబ్రవరి 17), మాఘ పౌర్ణమి (ఫిబ్రవరి 25), మహా శివరాత్రి పర్వ దినాల్లో ఆచరించే పవిత్ర స్నానాలు మరింత విశేషమైనవిగా చెబుతారు.

నాగ సాధువులు

కుంభమేళాలో నాగ సాధువుల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు.. దిగంబరంగా తిరుగాడుతూ, శరీరంపై విభూతి పూసుకుని, నృత్యం చేస్తూ కనిపించే నాగా సాధువులు కుంభమేళా జరిగే సమయాల్లోనే కనిపిస్తారు. కుంభమేళా పూర్తికాగానే మాయమవుతారు. మహా క్రతువు తర్వాత వీరు ఎక్కడికెళ్తారు? ఏం చేస్తారు. వీరి జీవిన విధానం ఏంటీ..? అనేది ఆశ్చర్యకరంగా ఉంటుంది. నాగ సాధువుల్లో కొందరు వస్త్రధారణతో మరికొందరు దిగంబరంగా ఉంటూ తపస్సు చేస్తుంటారు. వీరు ఇష్టాఇష్టాలకు అతీతంగా ఆహారం స్వీకరిస్తారు. వనమూలికలు, కందమూలాలు తింటూ జీవనంసాగిస్తారు. నాగా సాధువుల నివాసాలు గుహలే. అయితే ఒకే గుహను స్థిర నివాసంగా మాత్రం ఏర్పాటు చేసుకోరు. కొన్ని రోజులు ఒక గుహలో.. మరికొన్ని రోజులు మరో గుహలో ఉంటూ.. వీరు రాత్రివేళల్లో నడక సాగిస్తూ, ఉదయం వేళల్లో అడవుల్లో గడుపుతారు. నిద్రించేందుకు చెట్ల కొమ్మలను ఆశ్రయిస్తుంటారు. అత్యంత విచిత్ర రీతిలో వీరు నిద్రిస్తుంటారు. ఇటువంటి నాగా సాదువులు హిమాలయాలు, కాశీ, గుజరాత్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో ఉంటుంటారు.

మానవ శరీరంలో..

ఇడ, పింగళ అనే రెండు ముక్కు రంధ్రాల ద్వారా మన శ్వాసక్రియ కొనసాగుతుంది. ఇడ, పింగళ ద్వారా తీసుకున్న శ్వాస సుషుమ్ననాడి (తిలకం దిద్దుకునే ప్రదేశం) దగ్గర ఏకీకృతమవుతుంది. ఇదే త్రివేణీ సంగమం. ఇడ, పింగళ రంధ్రాలు గంగ, యమునలకు ప్రతీకలైతే బయటకు కనిపించని..సుషుమ్ననాడి అంతర్వాహిని అయిన సరస్వతి నదికి సూచిక. శిరస్సు అనే కుంభంలో జరిగే ఈ సమ్మేళన ప్రక్రియే కుంభమేళా. మన వెన్నెముక అడుగున కుండలినీ అనే పాము దాగి ఉంటుంది. యోగ సాధనద్వారా సాధకుడు ఆ సర్పాన్ని మెల్లిగా పైకి ప్రయాణించేలా చేసుకుని తన (కుంభం)లోని సహస్రారానికి చేర్చాలి. అప్పుడు ఆ కుంభం అమృత భాండమవుతుంది. తద్వారా జ్ఞానసిద్ధి ఏర్పడుతుంది. దేవదానవులు ఇడ, పింగళ రంధ్రాలద్వారా తల(కుంభం)లో ఉచ్ఛ్వాస, నిశ్వాసాలతో చిలికినప్పుడు జ్ఞానమనే అమృతం వెలువడిందని చెబుతారు. కుంభమనే శిరస్సులో జ్ఞానామృతాన్ని నింపుకోవడం ద్వారా సాధకుడు దైవత్వాన్ని సాధించవచ్చని క్షీరసాగర మథన ప్రక్రియ సందేశమిస్తుంది.





ప్రయాగ మేళా ప్రత్యేకతలు

ప్రయాగ కుంభమేళాలోని కొన్ని రోజులను అత్యంత పవిత్రమెనవిగా భావిస్తారు. వీటిలో ఈ యేడాది జనవరి 15వ తేదీన వచ్చిన మకర సంక్రాంతి, 27వ తేదీన వచ్చే పౌర్ణమి, ఫిబ్రవరి 6న వచ్చే ఏకాదశి రోజు, 10న వచ్చే అమావాస్య, 15న కనిపించే వసంత పంచమి, 17న రథ సప్తమి రోజు, 18న భీష్మాష్టమి, 25వ తేదీ మాఘ పౌర్ణమి రోజుల్లో ఎక్కువ మంది భక్తులు పవిత్ర పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు.

కుంభమేళాలు

2001లో జరిగిన చివరి మహా కుంభ మేళాకు దాదాపు 6 కోట్లకు పైగా ప్రజలు హాజరయ్యారు. ఎటువంటి సందర్భంలోనైనా ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవడం ప్రపంచ చరిత్రలోనే తొలిసారి కావడం విశేషం. జనవరి 2007లో చివరగా ప్రయాగలో 45 రోజుల పాటు జరిగిన అర్ధ కుంభ మేళాలో 17 మిలియన్ లకు పైగా హిందువులు హాజరవగా అన్నింటిలోకి పవిత్రంగా భావించే మకర సంక్రాంతి అయిన జనవరి 15 ఒక్క రోజే 50 లక్షలకు పైగా భక్తులు హాజరయ్యారు.

2010

2010లో పూర్ణ కుంభమేళాకు హరిద్వార్ ఆతిథ్యమిచ్చింది. జనవరి 14 నుంచి ప్రారంభమైన ఈ కుంభమేళా ఏప్రిల్ 28 వరకు సాగింది. ఏప్రిల్ 14 వ తేది నాడే దాదాపు కోటి మంది ప్రజలు గంగా నదిలో స్నానం ఆచరించడం విశేషం. 2010 పూర్ణ కుంభమేళాలో దాదాపు 4 కోట్ల మంది గంగానదిలో పుణ్య స్నానమాచరించి నట్లు తెలుస్తోంది. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యే ఆధ్యాత్మిక వేడుకగా పిలిచే కుంభ మేళాకు భారతీయులతో పాటు విదేశీయులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

2013



2013 లో ప్రయాగ వేదికగా జనవరి 27 నుండి ఫిబ్రవరి 25 వరకు పూర్ణ కుంభమేళా జరిగింది. ఈ కుంభమేళాకు కూడా 12 కోట్ల మంది ప్రజలు తరలివచ్చారు.ఫిబ్రవరి 10 వ తేదీన ఒక్కరోజే 3 కోట్ల మంది కుంభమేళాకు హాజరయ్యారు. దీంతో కుంభమేళాకు యునెస్కోలో చోటు దక్కింది.

2015

2015 లో ఆగస్టు 15 నుండి సెప్టెంబరు 13 వరకు జరిగిన అర్ధ కుంభమేళాకు నాసిక్ ఆతిధ్యం ఇచ్చింది. ఈ కుంభమేళలో 70 వేలకు పైగా సాధువులు పాల్గొన్నారు. సెప్టెంబర్12, 13 తేదీల్లో అత్యధికంగా 5.85 లక్షల మంది భక్తులు కుంభమేళాకు తరలివచ్చారు.

2016

2016 సంవత్సరంలో ఏప్రిల్ 22 నుండి మే 21 వరకు ఉజ్జయిని వేదికగా పూర్ణ కుంభమేళా జరిగింది.

దిగంబర్ అనిఅఖర లో అగ్నిప్రమాదం



పులకించిన శబరి గిరులు

మకరజ్యోతిని దర్శించుకున్న భక్తులు

తిరువనంతపురం: మకరజ్యోతి దర్శనంతో అయ్యప్ప భక్తులు పులకించారు. పుణ్యక్షేత్రం శబరిమల భక్తులతో కిటకిటలాడింది. అయ్యప్ప నామస్మరణలు, పాటలతో శబరిగిరులు మారుమోగాయి. వేలాదిమంది భక్తులు మకరజ్యోతిని దర్శించుకున్నారు. కేరళ, తెలుగు రాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రా లకు చెందిన భక్తులు మకరజ్యోతిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో సన్నిధానం ద్వారా తెరిచిన తర్వాత దీపారాధన నిర్వహించారు. దీపారాధన అనంతరం భక్తులు మకరజ్యోతిని దర్శించుకున్నారు. దాదాపు 2.5 లక్షల మంది శబరిమల అయ్యప్ప దేవాలయాన్ని దర్శించుకున్నారని ట్రావెన్‌కోర్ దేవస్థానం వెల్లడించింది. ఆలయానికి కొద్ది కిలోమీటర్ల దూరంలోని పొన్నంబలమేడు కొండపై జ్యోతిని భక్తులు దర్శించుకున్నారు. జనవరి 20 వరకు భక్తులు దర్శించుకునేందుకు ఆలయాన్ని తెరచివుంచనున్నారు. అనంతరం జనవరి 20న పందళం రాజకుటుంబం ఆలయంలో ప్రార్ధనలు నిర్వహించనుంది.

షా సైనికులు

బీజేపీ అధ్యక్షుడికి కుడి భుజాలు



- ఎన్నికల గెలుపులో సూత్రధారులు
- పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర
- సమన్వయకర్తల వ్యవస్థకు కొత్త శక్తి
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మారుతున్న షా వ్యూహాలు

న్యూఢిల్లీ: బీజేపీలో పార్టీ నిర్మాణం అనేక పొరలుగా ఉంటుంది. అధికారాల విభజన, వికేంద్రీకరణతో పాటు.. ఏకీకృత నిర్మాణానికి కషాయం పార్టీ పెట్టింది పేరని అంటారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా లోక్‌సభ ఎన్నికల యుద్ధంలో గెలవడానికి కొంతమంది సైన్యాధ్యక్షులను నియమించుకున్నారు. వీరు పార్టీ రాజ్యాంగం ప్రకారం, ఆ నిబంధనల ప్రకారం నియమించినవారు కాదు. బీజేపీ పార్టీ రాజ్యాంగం ప్రకారం ప్రధాన కార్యదర్శులు ఉంటారు. వీరు బీజేపీలో పని చేస్తున్నప్పటికీ నిశ్శబ్దంగా ఆర్ఎస్ఎస్ ఆదేశాలు, ఆంకాంక్షలు, మార్గదర్శకాలు పాటిస్తూ ఉంటారు. స్వయం సేవక్ సంఘ్‌తో బీజేపీ ప్రధాన కార్యదర్శులకు ప్రత్యక్షంగానే సంబంధాలుంటాయని అంటారు. ప్రధాన కార్యదర్శులకు అపరిమితమైన అధికారాలుంటాయి. వారు ఏ విషయంలో అయినా, ఏ సమయంలో అయినా నేరుగా పార్టీ అధ్యక్షుడిని సంప్రదించే అధికారముంటుంది. ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చిన సూచనను, సలహాను లేదా ఆదేశాన్ని పార్టీ కేంద్ర నాయకత్వం సీరియస్‌గా తీసుకుంటుందంటారు. ఎన్నికల సమయంలో పార్టీ గెలుపు కోసం, మిగిలిన సమయంలో పార్టీ నిర్మాణంలో ప్రధాన కార్యదర్శులు కీలక పాత్ర పోషిస్తారు.

ప్రధాన కార్యదర్శితో సమానంగా..

బీజేపీ పార్టీ నిబంధనావళిలో స్పష్టంగా ప్రధాన కార్యదర్శి పాత్ర, అధికారాలు, బాధ్యతలు, విధుల గురించి ఉన్నప్పటికీ సమన్వయకర్తల గురించి వీసమెత్తు ప్రస్తావన ఉండదు. అనధికారికంగా పార్టీలో పని చేసే ఈ సమన్వయకర్తలు ప్రధాన కార్యదర్శులంత శక్తివంతులని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. 1980ల్లో బీజేపీ సొంతంగా రాష్ట్ర ఎన్నికలు గెలవడంతో ఈ సమన్వయకర్తలు తెరపైకి వచ్చారు. అప్పట్లో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తి లేకపోవడం, రాష్ట్రాల్లోని నాయకత్వాలు కేంద్ర నాయకులను ప్రభావితం చేసే స్థాయిలో ఉండడంతో సమన్వయకర్తల ఆలోచన బీజేపీకి వచ్చింది. వీరు కేంద్ర నాయకత్వానికి, రాష్ట్ర పార్టీకి, ప్రజలకు మధ్య సమన్వయం చేస్తూ గెలుపు కోసం పాటు పడతారు. ఇక ఏ రాష్ట్రానికైనా సమన్వయకర్తలుగా ఉంటారో వారు విధాయకంగా అదే రాష్ట్రానికి చెందిన వారై ఉండక్కర్లేదు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా..

బీజేపీలో చాన్నాళ్లుగా వస్తున్న ఈ సమన్వయకర్తల వ్యవస్థను ఇప్పుడు ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా మరింత పరిపుష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో ప్రత్యర్థులను విఫలం చేసి, గెలుపే లక్ష్యంగా పనిచేసే స్థాయికి సమన్వయకర్తల బాధ్యతలు, అధికారాలను షా పునర్ నిర్వచించారని అంటారు. ఎన్నికల వ్యవహారాలను సమన్వయం చేసే వారిని ఎన్నికల సమన్వయకర్తగా పిలుస్తారు. పార్టీ సమన్వయకర్తలు సంస్థాగత వ్యవహారాలతో పాటు బూత్ స్థాయి కార్యకర్తల వరకు నిర్వహిస్తారు. ఎన్నికల సమన్వయకర్తలు మాత్రం పార్టీలో అంతర్గత వ్యవహారాలు, ఆర్ఎస్ఎస్‌తో సమన్వయం చేసుకుంటూ, బీజేపీ ప్రజా సంఘాలతో సంబంధాలు నెరుపుతూ ఉంటారు. బీజేపీకి మిత్రపక్షాలు ఉన్న రాష్ట్రంలో ఆయా వ్యవహారాలు కూడా ఈ ఎన్నికల సమన్వయకర్తలు పర్యవేక్షిస్తారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంతో..

తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తరువాత బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా చేసిన మొదటి పని ఏంటంటే అన్ని రాష్ట్రాలకు సమన్వయకర్తలను నియమించడం. అంటే ఈ సమన్వయకర్తలకు బీజేపీలో ఎంత ప్రాధాన్యత ఉందో తెలిసిపోతోంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతో పొత్తు కారణంగా దెబ్బ తిన్న పార్టీ నిర్మాణానికి జవసత్వాలు సమకూర్చడానికి వీ మురళీధరన్, సునీల్ దియోదార్‌లను సమన్వయకర్తలుగా నియమించారు. ఏపీలో బీజేపీని అట్టడుగు నుంచి బలోపేతం చేయడంతో పాటు, ఎన్నికల్లో ఓటు శాతాన్ని మెరుగు పర్చుకోవడానికి ఈ ఇద్దరు పనిచేస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందులో మురళీధరన్‌కి అనుభవం ఉంటే, దియోదార్ త్రిపుర ఎన్నికల్లో తన సత్తా ఏంటో రుజువు చేసుకున్నారు. రాష్ట్రాల్లో నియమిస్తున్న బీజేపీ సమన్వయకర్తల్లో ఎక్కువగా మంది ఆర్ఎస్ఎస్ విభాగం అఖిల భారతీ విద్యార్థి పరిషత్ నాయకులు ఉండడం విశేషం. ఏబీవీపీలో పనిచేసిన వారికి నాయకత్వ లక్షణాలుంటాయని, రాజకీయ అవగాహన కూడా మెండుగా ఉంటుందని షా బలంగా విశ్వసిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

వి. మురళీధరన్




ఆంధ్రప్రదేశ్‌కి సమన్వ యకర్తగా నియమితులైన ఈ నాయకుడు కేరళ స్వస్థలం. మహారాష్ట్ర నుంచి రాజ్యసభకి ఎన్నికయ్యారు. ముంబైలో ఉన్నప్పుడు ఏబీవీపీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన మురళీధరన్ పట్టుబట్టి హిందీ నేర్చుకోవడం విశేషం. కేరళలో ప్రధాని మోడీ పర్యటించిన ప్రతిసారి ఆయన హిందీ ప్రసంగాలను మురళీధరనే మలయాళంలోకి అనువాదం చేస్తారు.

నరోత్తమ్ మిశ్రా



ఉత్తరప్రదేశ్‌కి ముగ్గురు సమన్వయకర్తలు ఉంటే అందులో నరోత్తమ్ మిశ్రా ఒకరు. మిశ్రాకి ఏబీవీపీ మూలాలుండడం విశేషం. ఈయన ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని దాతియా నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దాతియాలో మిశ్రాకు గట్టి పట్టు ఉండడం విశేషం.

స్వతంత్ర్య దేవ్ సింగ్



మధ్యప్రదేశ్ సమన్వయకర్తగా ఉన్న ఈయన యోగి ఆదిత్యనాథ్ మంత్రి వర్గ సభ్యుడు కావడం విశేషం. ఏబీవీపీ నుంచి పార్టీ యువజన విభాగంలోని ప్రతి స్థాయిలో పనిచేసిన దేవ్‌సింగ్ 2009లో ఎల్‌కే అద్వానీ ఎన్నికల సభలు నిర్వహించారు. 2014లో మోడీ సభలకు భారీగా యువతను తరలించడంలో కీలక పాత్ర పోషించారు.

సుధాంశు త్రివేది



యూపీ నుంచి బీజేపీ ప్రతినిధిగా ఉన్న సుధాంశు త్రివేది రాజస్థాన్ ఎన్నికల్లో ప్రాంతీయ మీడియా సమన్వయకర్తగా పని చేశారు. త్రివేది పనితీరుతో అమిత్ షా ఆయన్ను కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో కలిపి రాజస్థాన్ సమన్వయకర్తగా నియమించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న త్రివేది బీజేపీ ఆస్థాన జ్యోతిష్యుడిగా పేరు పొందారు.

కెప్టెన్ అభిమన్యు



పంజాబ్ సమన్వయకర్తగా నియమితులైన అభిమన్యు హరియాణ మంత్రి వర్గ సభ్యుడు. హరియాణ ముఖ్యమంత్రి రేసులో ప్రస్తుత సీఎం మనోహర్ లాల్ ఖట్టార్‌తో పోటీ పడ్డారు. మాజీ సైనికాధికారిగా అభిమన్యు 1997లో అద్వానీ స్వర్ణ జయంతి రథయాత్రను నిర్వహించారు. హరియాణాలో అటల్ బీహారీ వాజ్‌పేయి ఎన్నికల సభలు విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. సంస్థాగత నిర్వహణలో అభిమన్యు సామర్థ్యానికి సాక్షాత్తు ప్రధాని మోడీ సైతం ముగ్ధులయ్యారు.

అరవింద్ లింబావలి



బెంగలూరులోని మహదేవ్‌పూర్ నియోజవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన అరవిద్ మాజీ ఏబీవీపీ కార్యకర్త. అరవింద్ లింబావలిలోని సామర్థ్యాన్ని మొదట కనిపెట్టింది దివంగత బీజేపీ నేత అనంత్ కుమార్. కర్నాటకలోని దళిత వర్గాల్లో బీజేపీకి ఎక్కువగా పలుకుబడి లేకపోవడంతో లింబావలి సేవలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఏళ్ల తరబడి బీజేపీ నేతలుగా ఉంటూ ఎలాంటి ఎన్నికల ఫలితాలు రాబట్టని తెలంగాణాకి లింబావలి సూత్రప్రాయంగా సమన్వయకర్తగా నియమితులయ్యారు.

మహేంద్ర సింగ్



యూపీ సీఎం ఆదిత్యనాథ్ యోగి మంత్రి వర్గ సభ్యుడైన మహేంద్రసింగ్‌ని బీజేపీ దళపతి అమిత్ షా అసోం సమన్వయకర్తగా నియమించారు. 2016 అసోం ఎన్నికల్లో బీజేపీ గెలుపులో క్రియశీల పాత్ర పోషించిన మహేంద్రసింగ్ సేవలను అదే రాష్ట్రంలో రాబోయే ఎంపీ ఎన్నికలకు వినియోగించుకోనున్నారు. అసోం బీజేపీ కోర్ టీమ్‌లో మహేంద్రసింగ్ చురుగ్గా వ్యవహరిస్తున్నారు.

యోగి ఆదిత్యకు అగ్ని పరీక్ష!

యూపీలో సన్నగిల్లుతున్న శాంతిభద్రతలు

- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పని చేయని ఆకర్షణ
- శంకుస్థాపనలకే పరిమితమవుతున్న ప్రాజెక్టులు
- మంత్రులు, కార్యదర్శులపై అవినీతి ఆరోపణలు
- లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలవడమే యోగికి సవాల్



న్యూఢిల్లీ: నీళ్ల నమలడం, మాటల కోసం వెదుక్కోవడం తెలీని బీజేపీ నేతల్లో యోగి ఆదిత్యనాథ్ పేరు ప్రముఖంగా వినపబడుతోంది. 2017 మార్చిలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ పగ్గాలు చేపట్టడానికి చాలా క్రితమే యోగి ఆదిత్యనాథ్ కరడుకట్టిన హిందుత్వవాదిగా పేరు సంపాదించారు. ఇటీవల లక్నోలో జరిగిన పోలీస్ మీట్‌లో మాత్రం ఆయన ఆచితూచీ మాట్లాడడం విశేషం. ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలు మెరుగుపడడానికి, ఫలితంగా పెట్టుబడులు రావడానికి అనువైన వాతావరణం కల్పించడంలో పోలీసులు పోషించిన పాత్రను యోగి తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించారు. సాధారణ ప్రజల్లో భరోసా కల్పించడానికి సీనియర్ పోలీసు అధికారులు కాలి నడకన పర్యటించడం, అమ్మాయిలను వేధించే పోకిరీల ఆట కట్టించే యాంటీ రోమియో స్క్వాడ్‌లపైనా యోగి ప్రశంసల జల్లు కురిపించారు.లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం యోగి యూపీ పోలీసులకు గట్టి సందేశాన్నే వినిపించారు. లక్నోలో ప్రముఖ మొబైల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌ను పోలీసు కానిస్టేబుల్ కాల్చి చంపడం, బులంద్‌షహర్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌ను హత్య చేయడం, తరు వాత గోవధ సంఘటనలతో ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులకు చెడ్డపేరు వచ్చింది.

2018లో యూపీలో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీకి గట్టి దెబ్బ తగిలింది. గోరఖ్‌పూర్, ఫుల్పూర్ ఎంపీ స్థానాలతో సహా మరో రెండు అసెంబ్లీ సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో విపక్షాలు ఏకతాటిపైకి వచ్చి బీజేపీని ఓడించాయి. గోరఖ్‌పూర్ ఎంపీ స్థానం స్వయంగా సీఎం యోగి ఆదిత్యనాథ్‌కి సంప్రదాయంగా కంచుకోటగా వస్తున్నప్పటికీ అక్కడ బీజేపీ ఓడిపోవడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. గోరఖ్‌పూర్‌కి పొరుగునే ఉన్న తూర్పు యూపీలోని జిల్లాల్లో యువతపై యోగి ఆదిత్యనాథ్ ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ ఆ ఎంపీ స్థానంలో ఓడిపోవడం బీజేపీకి కోలుకోలేని దెబ్బగా పరిశీలకులు భావిస్తున్నారు.

శంకుస్థాపనలకే పరిమితం!

యూపీలో శాంతిభద్రతల పరిస్థితి రోజురోజుకీ క్షీణిస్తుంటే, మిగిలిన ప్రభుత్వ విభాగాల పరిస్థితి ఏమంత గొప్పగా లేదనే వార్తలొస్తున్నాయి. కరుడుగట్టిన అధికార యంత్రాంగాన్ని దారి తేవడంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ బలమైన పాత్ర పోషించారని ఎంత పేరు వచ్చినా.. చివరికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందనే విమర్శలు ఇప్పుడు వెల్లువెత్తున్నాయి. యూపీ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించడం, ప్రధాని మోడీ చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయించడం మినహా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తన పారిశ్రామిక విధానానికి కార్యరూపంలో ఇవ్వడంలో విఫలమైందంటున్నారు. గత ఏడాది జులై 14 ప్రధాని మోడీ రూ.23 వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన 341 కిలోమీటర్ల పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేకి శంకుస్థాపన చేశారు. ఇక బుందేల్‌ఖండ్ డిఫెన్స్ కారిడార్ నిర్మాణమైతే రూ.20 వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనాలున్నా.. దీనికి అవసరమైన భూసేకరణలో యోగి ప్రభుత్వం విఫలమైందంటారు. నిజానికి ఈ ప్రాజెక్టును గత ఫిబ్రవరిలో యూపీ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ సమ్మిట్‌లోనే ఏకంగా రూ.4.68 లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. జులై, 2018లో రూ.60 వేల కోట్ల విలువైన పారిశ్రామిక ప్రాజెక్టు లకు ప్రధాని మోడీ యూపీలో శంకుస్థాపనలు చేశారు. వాటి విలువ లక్ష కోట్లు ఉంటుందని, డిసెంబర్‌లో భారీగా ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామని సీఎం యోగి చేసిన ప్రకటన కూడా ఉత్త మాటగానే మిగిలిపోయింది.

అసెంబ్లీ ఎన్నికల్లో పని చేయని ఆకర్షణ!

యూపీలో సీఎం ఆదిత్యనాథ్ పరిస్థితి ఇలా ఉంటే.. హిందుత్వానికి ప్రతీకగా పిలువబడే ఆయన ప్రచారం చేసిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో కూడా బీజేపీకి ఏమంత లాభించలేదని విశ్లేషకులంటున్నారు. ఈ రాష్ట్రాల్లో యోగి ఆదిత్యనాథ్ 75కి పైగా సభల్లో ప్రసంగించారు. యూపీలో పాలన గాలికి వదిలి పొరుగు రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారని ఆ రాష్ట్ర విపక్షాలు విమర్శలు సైతం చేశాయి. యోగి ఆది త్యనాథ్ వంటి ఫైర్ బ్రాండ్ హిందుత్వ నాయకుడు ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పర్యటిస్తే మెజారిటీ ఓట్లు పటిష్టంగా బీజేపీకి పడతాయని కమలం పార్టీ వ్యూహం కాస్త దెబ్బతిందని అంటున్నారు.

సొంత మంత్రుల కార్యదర్శులపై ఆరోపణలు

యోగి ప్రభుత్వంపైన యూపీ కాంగ్రెస్ బాగానే విమర్శలు గుప్పిస్తోంది. ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని ప్రభుత్వంలాగా కాకుండా ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలాగా నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. . యోగి ఆదిత్యనాథ్ మంత్రి వర్గంలోని ముగ్గురు సీనియర్ మంత్రుల వ్యక్తిగత కార్యదర్శులపై అవినీతి ఆరోపణలు టీవీ ఛానళ్ల స్ట్రింగ్ ఆపరేషన్‌లో బయట పడడం మరో తలనెప్పిగా మారింది.

ఇప్పుడు యూపీలో యోగి ఆది త్యనాథ్ పరిస్థితి ఎంత వరకు వచ్చిందంటే ఆయన పనితీరుపై సొంత పార్టీ నుంచే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక యూపీలో బీజేపీ భాగస్వామ్య పార్టీలు సైతం యోగిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. అయితే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు, ప్రకటించిన ప్రాజెక్టులు పూర్తి చేయడంలోనే యోగి ఆదిత్యనాథ్ నాయకత్వ పాటవం బయట పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మోడీకి ఫిలిప్ కొట్లర్ అవార్డు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ మొట్టమొదటి ఫిలిప్ కొట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు ప్రతి సంవత్సరం అత్యుత్తమ దేశనేతలకు అందిస్తారని ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. దేశానికి అసాధారణ ఆర్థిక, సాంఘిక, సాంకేతిక పురోగతి అందించటంతోపాటు భారత్‌కు అలు పెరగకుండా నిస్వార్థమైన సేవ చేసినందుకు ఈ అవార్డు ప్రధానికి లభించిందని పీఎం కార్యాలయ అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. సమాచార, సాంకేతిక, అకౌంటింగ్ మరియు ఫైనాన్స్ వంటి వృత్తిపరమైన సేవలకు ప్రపంచ కేంద్రంగా ఉందని పీఎం కార్యాలయం తెలిపింది. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలతో భారత్ ప్రపంచంలోనే అత్యంత లాభదాయకమైన తయారీ, వ్యాపార కేంద్రంగా గుర్తింపు పొందిందన్నారు. ఫిలిప్ కొట్లర్ నార్త్ వెస్టన్ విశ్వవిద్యాలయం కెల్లోగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో మార్కెటింగ్ ప్రొఫెసర్, ఆయన తరపున ఎమోరీ యూనివర్సిటీకి చెందిన జగదీష్ షేత్ ప్రధాని మోడీకి అవార్డు అందజేశారు.

కన్హయ్యపై దేశద్రోహం కేసు



న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూని యన్ (జేఎన్‌యూఎస్‌యూ) మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్‌పై ఢిల్లీ పోలీసులు దేశద్రోహం కేసు నమోదు చేశారు. ఫిబ్రవరి, 2016లో వర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఊరేగింపునకు నేతృత్వం వహిం చిన కన్హయ్య దేశ వ్యతిరేక నినాదాలు చేశారని చార్జిషీటులో పోలీసులు పేర్కొన్నారు. భారత వ్యతిరేక నినాదాలు చేసేందుకు సామూహాన్ని కన్హయ్య కుమార్ ప్రేరేపించాడని నివేదికలో పేర్కొన్నారు. పార్లమెంటుపై దాడి సూత్రధారి అఫ్జల్ గురు ఉరిశిక్ష జ్ఞాపకార్థం ఫిబ్రవరి 9, 2016లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత వ్యతిరేక నినాదాలు చేశారనే ఆరోపణలతో జేఎన్‌యూ మాజీ విద్యార్థులు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్యపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలను రుజువు చేసేందుకు తమవద్ద వీడియో ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. కాశ్మీరీ విద్యార్థులు అక్విబ్ హుస్సేన్, ముజీబ్ హుస్సేన్, మునీబ్ హుసెన్, ఉమర్ గుల్, రాయా రాసూల్, బషీర్ భట్, బష్రత్‌లతోపాటు మరొకొందరు జేఎన్‌యూ, అలీఘర్ ముస్లీం యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలకు చెందినవారు ఉన్నారని తెలిపారు. మొత్తం 36 మంది విద్యార్థులతోపాటు సరైన ఆధారాల కోసం సీపీఐ నేత డీ. రాజా కూతురు అప్రజిత్, షేహ్లా రషీద్(అప్పటి జేఎన్‌యూ ఉపా ధ్యక్షుడు), రామ నాగ, అశుతోష్ కుమార్, బనోజ్యోత్స్నా లహిరితోపాటు పలువురు మాజీ విద్యార్థుల పేర్లను చార్జిషీటులో చేర్చామన్నారు. భారత పీనల్ కోడ్‌లోని సెక్షన్ 124ఏ(దేశద్రోహం), 323, 465, 471, 143, 149, 147, 120బీ సెక్షన్ల కింద విద్యార్థులపై కేసులు నమోదు చేశారు. మొత్తం 1200 పేజీలతో కూడిన చార్జిషీటును పోలీసులు తయారు చేశారు. వీడియో పుటేజీలలో విద్యార్థులు ఉన్నా రని, వీడియో వాస్తవమైనవేనని పోలీసులు పేర్కొన్నారు. యూనివర్సిటీ అనుమతి లేకుండానే చట్టవిరుద్ధంగా విద్యార్థులు గుమిగూడారని, యూనివర్సిటీలో దేశ వ్యతిరేక నినాదాలు చేశారని, బీజేపీ ఎంపీ మహేష్ గిర్రి, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఫిర్యాదు మేరకు ఫిబ్రవరి 11, 2016న గురు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశామని చార్జిషీటులో పోలీసులు వివరించారు.

షట్‌డౌన్.. డేంజర్ బెల్స్



- ఇంకా కొనసాగితే మరిన్ని ఇబ్బందులు
- కొన్ని రకాల నష్టాలను ఎప్పటికీ పూడ్చలేం
- రైతులు, పేదల జీవనం దుర్భరమవుతుంది
- ఉద్యోగుల నెలసరి చెల్లింపులు స్తంభిస్తాయి
- పరోక్షంగా అప్పుల్లో కూరుకుపోతారు
- ప్రభుత్వ, ప్రైవేటు వ్యవస్థలు కుదేలవుతాయ్
- ఖజానాకు రాబడులు గణనీయంగా తగ్గుతాయ్
- అమెరికా పరిణామాలపై ఆర్థికవేత్తల ఆందోళన

వాషింగ్టన్: మునుపెన్నడూ లేని విధంగా తొలిసారి కొనసాగుతున్న సుదీర్ఘ షట్‌డౌన్ అమెరికా ఆర్థికవ్యవస్థను కలవరానికి గురిచేస్తున్నది. ఈ పరిణామం ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికవ్యవస్థ వృద్ధిరేటును తీవ్రంగా ప్రభావితం చేస్తుందని మేధోవర్గాలు చెబుతున్నాయి. 1976 నుంచి ఇప్పటి వరకు 21 పర్యాయాలు అమెరికాలో షట్‌డౌన్ పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే మూడు వారాలకు పైగా ప్రభుత్వం అచేతన స్థితిలో కొనసాగడం ఇదేతొలిసారి. సమస్య త్వరగా పరిష్కారం కాకుంటే, వృద్ధిరేటు మందగించే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికి ఫరవాలేదు.. ఇంకొన్ని రోజులు కొనసాగితేనే ప్రమాద ఘంటికలు మోగుతాయి అని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్‌లో అమెరికా చీఫ్ ఎకనామిస్ట్ బెత్ అన్న బొవినొ అభిప్రాయపడ్డారు. షట్‌డౌన్ మూలంగా ఆర్థికవ్యవస్థకు వారానికి 1.2 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని, నాలుగోవంతు ప్రభుత్వ ఉద్యోగులు ఇళ్లకే పరిమితం అయ్యారని బొవినొ వెల్లడించారు.

- 1995, 2013 షట్‌డౌన్ సందర్భాల్లో స్టాక్ మార్కెట్లు నెమ్మదించాయి. ఉద్యోగుల వేతనాల నష్టాన్ని భర్తీ చేయడం ద్వారా ఒక త్రైమాసికంలో కోల్పోయిన జీడీపీని తదుపరి త్రైమాసికానికి పుంజుకునేలా చేయవచ్చు కానీ, కొన్నిరకాల నష్టాలను ఎప్పటికీ పూడ్చలేమని బొవినొ స్పష్టం చేశారు.
- రైతులు, పేదకుటుంబాలకు చెల్లింపులు నిలిచిపోయాయి. వాణిజ్య డాటా తిరోగమనం పట్టింది. అదే సమయంలో పన్ను రిటర్నులు, రుణగ్రహీత ఆదాయ ధ్రువీకరణ పనులు స్తంభించి మార్టిగేజ్ ఇండస్ట్రీకి అపార నష్టం వాటిల్లుతోంది. విత్తనాల కొనుగోలు, పశువుల దాణా, వ్యవసాయ నిత్యావసరాలకు ప్రభుత్వ రుణాలు నిలిచిపోవడంతో తదుపరి పంటసాగుపై దుష్ప్రభావం చూపబోతున్నది.
- చివరకు జీడీపీ గణన కూడా ఆలస్యమవుతున్నది. ప్రభుత్వ కాంట్రాక్టర్లకు సగటున రోజుకు 200 మిలియన్ డాలర్ల నష్టం కలుగుతోంది. పర్యాటకం ద్వారా వచ్చే (రోజుకు 18 మిలియన్ డాలర్లు) ఆదాయానికీ గండిపడింది. 400 జాతీయ పార్కుల్లో చాలా వరకు సేవలు నిలిపివేయబడ్డాయి.
- పేదలకు ఆహారం అందించే ప్రభుత్వ పథకం మరో నెలరోజులు మాత్రమే కొనసాగించగలుగుతారు. అద్దెలు, రుణ వాయిదాలచెల్లింపులు, కుటుంబ పోషణ తదితర ఖర్చులతో ప్రభుత్వ ఉద్యోగులకు నెలకు 438 మిలియన్ డాలర్లు అవసరం అవుతుంది. వేతనాలు లేకపోవడంతో ఈ చెల్లింపులు స్తంభించే ప్రమాదం ఉందని ప్రముఖ రియల్ సంస్థ అంచనా వేసింది.
- 2013లో ఉద్యోగులకు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. సకాలంలో చెల్లింపులు చేయలేక అప్పుల్లో కూరుకుపోయారు. ఏదేమైనా ఈ షట్‌డౌన్ దేశానికే గాక, పౌరులకూ చాలా నష్టం కలిగించిందని చికాగొ యూనివర్సిటీ ఆర్థికవేత్త యన్నెలిస్ తెలిపారు.

వివాహాలకు గ్రీన్‌సిగ్నల్..

షట్‌డౌన్ కారణంగా వాషింగ్టన్‌లో ప్రేమ సంబరాల జోష్ తగ్గింది. ఈ వాతావరణం ఇంకెన్ని రోజులు ఉంటుందో చెప్పలేం. కానీ, షట్‌డౌన్ వల్ల తమ పెళ్లిళ్లకు బ్రేక్ పడినట్లే అని నిరుత్సాహంతో ఉన్న నవ వధూవరులకు స్థానిక సిటీ కౌన్సెల్ ఊరటనిచ్చింది. అధికారిక మ్యారేజ్ బ్యూరో వ్యవస్థ స్తంభించినా వివాహాలు చేసుకోవచ్చని, పాలన పునరుద్ధరించ బడగానే ఈ వివాహాలకు ఆమోదముద్ర లభిస్తుందని సిటీ కౌన్సెల్ చట్టసవరణ తీసుకొచ్చింది. డిసెంబర్ 22 తర్వాత దంపతులైన వారికి అధికారిక సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు. ఈ ఆదేశాలు 90 రోజుల వరకు చెల్లుబాటవుతాయని తెలిపారు. ప్రస్తుతం మేం చట్టబద్ధమైన పత్రాల మీద సంతకాలు చేయించలేక పోవచ్చు. కానీ ప్రేమికులను ఒక్కటి చేస్తున్నాం. బంధుమిత్రుల సమక్షంలో పసందైన వేడుక నిర్వహిస్తున్నాం.

అయినా అధికారిక సర్టిఫికెట్ లభిస్తేనా ఈ వివాహాలకు చట్టబద్ధత ఉంటుదని వాషింగ్టన్ డీసీలోని వెడ్డింగ్ ప్లానర్ ఒకరు తెలిపారు. మరొకవైపు షట్‌డౌన్ ఎప్పుడు పరిష్కారం అవుతుందో తెలీనప్పటికీ, పెళ్లి వేడుకల కోసం ఎంతోమంది ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుండటం విశేషం.

విధుల్లోకి 500 మంది ఏవియేషన్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్స్

షట్‌డౌన్ పరిస్థితుల నేపథ్యంలో ఇంటికే పరిమితమైన దాదాపు 3000 మంది భద్రత తనిఖీ అధికారులను తిరిగి విధులకు రప్పించేందుకు ఫెడరల్ ఏవియేషన్ విభాగం ప్రయత్నాలు చేస్తున్నది. 22 రోజుల పాక్షిక షట్‌డౌన్ పరిస్థితుల నేపథ్యంలో పౌరవిమాన రంగానికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ఎఫ్ఏఏ రంగంలోకి దిగింది. వీరి చర్చల ఫలితంగా 500 మంది నేటి నుంచి విధులకు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తంచేసినట్లు ఎఫ్ఏఏ అధికార ప్రతినిధి గ్రెగొరి మార్టిన్ మీడియాకు తెలిపారు. తనిఖీ అధికారులు, మెకానిక్ షాప్ సిబ్బంది అత్యవసర ఉద్యోగుల జాబితాలో లేనందున, గత మూడు వారాలుగా వీరు విధులకు దూరంగా ఉన్నారు. పౌరవిమానయానంలో రక్షణ చర్యలకు సిబ్బంది సేవలు అనివార్యమైనందున ఎఫ్ఏఏ ఉద్యోగులను విధులకు రప్పించేందుకు సంప్రదింపులు జరుపుతున్నది. ఇప్పటికే 10వేల ఎఫ్ఏఏ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు వేతన రహిత సేవలు అందిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ స్క్రీనర్స్ కొందరు ఇళ్లకే పరిమితం అయ్యారు.





మా ఊరు - మా రాజ్యం

రెండో విడతలో 25,419 నామినేషన్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రెండవ విడుత ఎన్నికలు ప్రకటిచిన 4,135 పంచాయతీల్లో నామినేషన్ల గడువు ముగిసిపోయింది. ఈ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 25,419 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 36,602 వార్డు స్థానాలకు 91,458 నామినేషన్లు దాఖలైనట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది.

గీత దాటితే వేటే

శామీర్‌పేట, ప్రభ న్యూస్: గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని పోటి చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను ఉల్లంగిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల సహాయ అధికారి జ్యోతి అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ పరిదిలోని శుభం గార్డెన్‌లో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల సహాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించెందుకు అందరు సహకరించాలని ఆమె కోరారు. సర్పంచ్ పదవికి పోటి చేయు అభ్యర్థులు 2 లక్షల 50వేలు, వార్డు సభ్యలు 50 వేలు మించకుండా ఒక్కొక్కరు ఖర్చు చెయాలని సూచించారు. ఎన్నికల ప్రచారానికి పర్మిషన్ తీసుకోవాలని అన్నారు. మండలంలో మొతం 216 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చెయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 21 జరుగను న్న పంచాయతీ ఎన్నికల రోజు ప్రతి పోలింగ్ స్టేషన్ నుండి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఉదయం 7 గంటల నుండి ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, ఒం టి గంట తరువాత ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఏకగ్రీవం... నిర్మల్ తంత్రం

- మొదటి విడతలో 57 ఏకగ్రీవం
- రెండో విడతలో 18 గ్రామ పంచాయతీల్లో సింగిల్ నామినేషన్లు
- ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వ నజరానా
- పెంబి మండలంలో 24కు గాను 20 ఏకగ్రీవ పంచాయతీలు



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న పెంబితాండా అభ్యర్థి కరుణ విలాస్

నిర్మల్, ప్రభ న్యూస్: నిర్మల్ జిల్లాలో 396 గ్రామపం చాయతీల్లో మాత్రమే మూడు విడతల్లో ఎన్నికలు జరుగను న్నాయి. అందులో భాగంగా మొదటి విడతలో ఖానాపూర్, దస్తు రాబాద్, పెంబి, మామడ, కడెం, లక్ష్మణచాంద ఆరు మండలాలకు గాను 134 గ్రామపంచాయతీలు, 1058 వార్డులకు గాను ఈనెల 21న ఎన్నికలు జరుగనున్నాయి. అయితే నిర్మల్ జిల్లాలో 57 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా యి. ఇందులో 134 గ్రామపంచాయతీలకు గాను 57 మంది ఏకగ్రీ వంగా ఎన్నిక కాగా, మిగిలిన 77 గ్రామపంచాయతీల ఎన్నికలలో 284 మంది పోటీలో ఉన్నారు. అలాగే 1058 వార్డులకు గాను 574 ఏకగ్రీవంగా ఎంపికయ్యాయి. మరో నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం 480 వార్డు మెంబర్లు పోటీలో ఉన్నారు.

రెండో విడతలో..

రెండో విడతలో నిర్మల్, సోన్, సారంగా పూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), లోకేశ్వరం, కుంటాల మండలాల్లో ఈనెల 25న 131 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. నామి నేషన్ల గడువు ముగిసే సరికి 18 గ్రామపం చాయతీల్లో ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఈ పంచాయతీలు ఏకగ్రీవం కానున్నాయి. వీటితో పాటు మరిన్ని గ్రామపంచాయతీలు వీటి చేరువలో రానున్నాయి. దీంతో ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రకటించిన రూ.10 లక్షల నజరానాకు గ్రామస్తులు ముందుకువచ్చి పంచాయతీ ఎన్నికల్లో ఒక్కరినే బరిలో నిలిచేందుకు చేసిన ప్రయత్నాలు సఫలమయ్యాయి.



అభ్యర్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

జిల్లాలో..

జిల్లాలోని ఏడు మండ లాల్లో ఖానాపూర్ మండలంలో మొత్తం 24 గ్రామాలకు గాను 10 ఏకగ్రీవం అయ్యాయి, అలాగే పెంబిలో మొత్తం 24 గ్రామపంచాయతీలకు గాను 20 గ్రామపంచాయతీలు, మామడ మండలంలో మొత్తం 27 మండలాలకు గాను 13 గ్రామపంచాయతీలు, లక్ష్మణచాందలో 18 గ్రామపం చాయతీలకు గాను 4 గ్రామపంచాయతీలు, కడెం మండలంలో మొత్తం 28 గ్రామపంచాయతీలకు గాను 9 గ్రామపంచాయతీలు, దస్తూరాబాద్ లో మొత్తం 13 గ్రామపంచాయతీలకు గాను 1 గ్రామపంచాయతీలు, మొత్తం 134 గ్రామపంచాయతీలకు గాను మొదటి విడతలో 58 ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. రెండో విడతలో ఈనెల 25న జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఏడు మండలాలకు గాను 131 గ్రామపంచాయతీలు, 1253 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో నిర్మల్ మండలంలో 4 అందులో 18 గ్రామపంచాయతీల్లో ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకా శాలున్నాయి. వాటితో పాటు ఈనెల 17న ఉపసంహరణలకు గడువు ఉండడంతో అప్పటి వరకు మరిన్ని గ్రామపంచాయతీ లు ఏకగ్రీవాలకు ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నిర్మల్ 20 గ్రామపంచాయతీలకు గాను 4 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం, సోన్ మండలంలో 14 గ్రామపం చాయతీలకు గాను 1 ఏకగ్రీవం, సారంగాపూర్ మండలంలో 32 గ్రామపం చాతీలకు గాను 9 పంచాయతీలు, కుంటాల మండలంలో 15 గ్రామపంచాయతీలకు గాను 1గ్రామపంచాయ తీ, లోకేశ్వరం మండ లంలో 25 గ్రామపంచాయ తీలకు గాను 2, నర్సా పూర్ మండలంలో 13 గ్రామ పంచా యతీలకు 1 గ్రామపం చాయతీ 18 గ్రామపంచాయతీ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. దిలావర్‌పూర్ మండలంలో 12 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిం చనున్నారు. ఏడు మండలాల్లో 131 గ్రామపంచాయతీలకు గాను 737 మంది అభ్యర్ధులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే 1170 వార్డు మెంబర్లకు గాను 2,296 మంది నామినేషన్లను సమర్పించారు. ఈనెల 17న నామినేషన్ల ఉపసంహారణకు గడువు ఉంది. ఈనెల 21న రెండో విడత ఎన్నికలు జరుగ నున్నాయి. అదేరోజున మధ్యా హ్నం నుండి ఓట్ల లెక్కింపు చేసి సాయంత్రం వరకు ఫలితాలను వెల్లడించనున్నారు.



లోతర్య తాండాలో నామినేషన్ సమర్పిస్తున్న సాంకీబాయి

రుద్రంగి 'ఏక'వీర

- 10 పంచాయతీల్లో ఏడు ఏకగ్రీవం
- నాలుగు జిల్లాల్లో 31 పంచాయతీలు ఏకగ్రీవం
- తండా పంచాయతీలే అధికం
- కోరెం నుంచి ఎంపీ వినోద్ అత్త మూడోసారి ఏకగ్రీవం

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో: మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో నాలుగు జిల్లాల్లో 31 గ్రామపంచాయతీల్లో సర్పంచులు, 770 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరం అనంతరం అధికారికంగా ఎన్నికల అధికారులు ఏకగ్రీవ పంచాయతీల వివరాలు ప్రకటించారు. మొదటి విడతకు ఈ నెల 21న ఎన్నికలు జరగనున్నాయి. ఏకగ్రీవంగా పోను మిగతా పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. సరాసరిగా సర్పంచ్ స్థానాలకు ఐదుగురికిపైనే పోటీలో ఉన్నారు. నాలుగు జిల్లాలో 414 పంచాయతీలకు ఏకగ్రీవం జరగవలసి ఉండగా 31 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కావడంతో 383 గ్రామ పంచాయతీల్లో 1700 అభ్యర్థులు సర్పంచ్ బరిలో ఉన్నారు. 2981 వార్డు సభ్యులకు గాను 7194 మంది బరిలో మిగిలారు. ఏకగ్రీవంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని రుద్రంగి మండలం నుంచి అత్యధిక సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమైనాయి. మండల పరిధిలో 10 గ్రామాలు ఉండగా 7 పంచాయతీలు ఏకగ్రీవమైనాయి. ఏకగ్రీవమైన వాటిలో ఎక్కువగా కొత్తగా ఏర్పడ్డ తండా పంచాయతీలు ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో నాలుగు పంచాయతీలు, పెద్దపల్లిలో నాలుగు, జగిత్యాల జిల్లాలో 10, రాజన్న సిరిసిల్ల జిల్లాలో అత్యధికంగా 13 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా, చొప్పదండి నియోజవర్గం పరిధిలోని బోయినపల్లి మండలం కోరెం గ్రామ సర్పంచ్‌గా చెన్నాడి మార్తండరావు సతీమణీ, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్‌కుమార్ అత్త చెన్నాడి రాజ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఇదే మండలం నర్సింగపూర్ నుంచి ప్రతిమ వైద్యకళాశాల డైరెక్టర్, మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు బంధువు జోగినపల్లి ప్రేమ్‌సాగర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కోరం గ్రామం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన చెన్నాడి రాజ్యలక్ష్మి భర్త చెన్నాడి మార్తండరావు 2001లో జనశక్తి నక్సల్స్ చేతిలో కిడ్నాప్‌కు గురైన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇదే సమయంలో విద్యాసాగర్‌రావు కేంద్ర మంత్రిగా ఉన్నారు. కిడ్నాప్ చెరనుంచి విడుదలైన అనంతరం కొద్దిరోజుల తరువాత అనారోగ్యంతో మార్తండ రావు మృతి చెందారు. తదనంతరం కోరెం గ్రామం నుంచి మార్తండరావు సోదరుడు చెన్నాడి సుధాకర్‌రావు సర్పంచ్‌గా గెలుపొందారు. మార్తండరావు కూతురు డాక్టర్ మాదవిని వివాహం చేసుకున్న బోయినపల్లి వినోద్‌కుమార్ రాజకీయాల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ పార్లమెంటు సభ్యునిగా పనిచేస్తున్నారు. మార్తండరావు మరణం తరువాత కుటుంబ సభ్యులు కోరెం గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కోరం ను ఆదర్శ గ్రామంతా తీర్చిదిద్దుతున్న కుటుంబానికి గౌరవ సూచకంగా సర్పంచ్ స్థానంలో మార్తండరావు సతీమణిని ఏకగ్రీవంగా ఎన్నకున్నారు. రామడుగు మండలం గోలిరామయ్యపల్లె నుంచి ఉప్పు రాధమ్మ (65) ఏకగ్రీవంగా ఎన్నికైనారు, ఆమె ఇదే గ్రామం నుంచి మూడోసారి ఎన్నికైనారు, రెండు సార్లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ గ్రామాన్ని అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించారు.



రాధమ్మ



ప్రేమ్‌సాగర్‌రావు



రాజ్యలక్ష్మి

పల్లెల్లో పదునెక్కిన ప్రచారం

ఏకగ్రీవాల ఏరువాక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు పల్లె వాతావరణాన్ని భోగి మంటలకు మించిన రీతిలో వేడెక్కిస్తున్నాయి. తొలి విడుత పంచాయతీల్లో నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ముగిసిపోవటంతో రిటర్నింగ్ అధికారులు పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ ఎన్నికల గుర్తులు కేటాయించారు. దీంతో వారంతా ప్రచారం ముమ్మరం చేశారు. సంక్రాంతి పండగను కూడా ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకుంటూ పండక్కు పల్లెకొచ్చిన చుట్టాలను సైతం పలకరిస్తూ ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. బంధుత్వాలను అడ్డం పెట్టుకుని ఓట్లకోసం పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తున్నారు. తెలంగాణ పల్లె జనాలు ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు పండగ దావత్‌ల పేరుతో ఏర్పాటు చేస్తున్న మందు పార్టీలతో ఖుషీ చేసుకుంటున్నారు. ఈనెల 21న తొలివిడుత పోలింగ్ జరగనుండటంతో గెలుపుకోసం అందివచ్చిన ఏ అవకాశాన్ని కూడా వదిలిపెట్టడం లేదు. కుల సంఘాలవారీగా విందులు ఏర్పాటు చేస్తూ ఎన్నికల్లో తమ బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్ని స్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది. అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులను, దగ్గరి బంధువు లను బృందా లుగా ఏర్పా టు చేసి ఎన్నికల ప్రచార బాధ్యత లు అప్పగిస్తున్నారు. గ్రామంలో బలమైన సామాజికవర్గ నేతల తో ఎన్నికల మంత్రాంగాలు చేస్తున్నారు. ఒక పక్క సంక్రాంతి పండుగ సంబరాలు , మరో పక్క ఎన్నికల ప్రచార హోరుతో పల్లెలు సందడి సందడిగా మారాయి.

> **769 సర్పంచ్ స్థానాల్లో ఏకగ్రీవం**
> **3707 పంచాయతీల్లో పోటీ..**
> **బరిలో 12202 మంది**
> **వార్డుల్లో 10, 654 వార్డులు ఏకగ్రీవం**
> **28976 చోట్ల పోటీ..**
> **బరిలో 70,094 మంది**
> **9 పంచాయతీలు.. 192 వార్డుల్లో నామినేషన్లు నిల్**

769 పంచాయతీలు ఏకగ్రీవం

తొలివిడత ఎన్నికల్లో 4479 గ్రామ పంచాయతీలకు ఉన్నికలు ప్రకటించగా అందులో 769 పంచాయతీలు ఏకగ్రీవం అయినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటిచింది. ఈ పంచాయతీల్లో సర్పంచ్ స్థానంతోపాటు వార్డు స్థానాలకు కూడ సింగిల్ నామినేషన్లు దాఖలవటంతో ఈ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అందులో జిల్లాల వారీగా అదిలాబాద్‌లో 50, కొమరంబీంలో 18, మంచిర్యాలలో 18, నిర్మల్‌లో 8, జగిత్యాల్‌లో 10, కరీంనగర్‌లో 4 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. పెద్దపల్లిలో 4, రాజన్న సిరిసిల్లలో 13, భద్రాద్రి కొత్తగూడెంలో 22, ఖమ్మంలో 21, జోగులాంబ గద్వాలలో 30, మహబూబ్ నగర్‌లో 44, నాగర్ కర్నూల్‌లో 37, వనపర్తిలో 18 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యియి. మెదక్‌లో 32, సంగారెడ్డిలో 23, సిద్దిపేట్‌లో 21, నల్లగొండలో 52, సూర్యాపేట్‌లో 16, యాదాద్రి భువనగిరిలో 22, కామారెడ్డిలో 31, నిజామబాద్‌లో 36 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.

మేడ్చెల్ మల్కాజిగిరిలో 4, రంగారెడ్డిలో 20, వికారాబాద్‌లో 34, జనగాంలో 18 జయశంకర్ భూపాలపల్లిలో 33, మహబూబాబాద్‌లో 36, వరంగల్ రూరల్‌లో 45, వరంగల్ అర్బన్ జిల్లాలో 10 పంచాయతీల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి.

తొలి విడత రేసులో 12,202 మంది


తొలివిడత ఎన్నికలు జరుగుతున్న 3701 గ్రామ పంచాయతీలో 12,202 మంది అభ్యర్థులు పంచాయతీ పదవు ల కోసం పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాలకంటే సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 764మంది పంచాయతీ సర్పంచ్ పదవుల రేసులో ఉన్నారు. సిద్దిపేట్ జిల్లాలో 697 మంది, కామరెడ్డిలో 688మంది, మహబూబ్‌నగర్ జిల్లాలో 593 మంది, నల్లగొండ జిల్లాలో 666 మంది, వికారాబాద్ జిల్లాలో 581మంది, రంగారెడ్డి జిల్లాలో 471మంది పోటీలో ఉన్నారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలో అతితక్కువగా 33 పంచాయతీల్లో 111మంది పోటీలో ఉన్నారు.

10,654 వార్డులు ఏకగ్రీవం

రాష్ట్రంలో తొలివిడత ఎన్నికలు ప్రకటించిన 39822వార్డుల్లో 10654 వార్డులకు సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ పంచాయతీల్లో ఎన్నికలు ఏకగ్రీం అయినట్టు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఇక మిగిలిన 28976 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 70094మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

9 పంచాయతీల్లో మళ్లీ ఎన్నికలు

తొలివిడుతలో ఎన్నికలు ప్రకటించిన 9 పంచాయతీల్లో ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. ఈ పంచాయతీలకు రీనోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సర్పంచ్ స్థానంతోపాటు వార్డు స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఇందులో మంచిర్యాల జిల్లాలో రెండు పంచాయతీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు పంచాయతీలు, నాగర్ కర్నూల్ జిల్లాలో 5 పంచాయతీలు ఉన్నాయి. అంతే కాకుండా 192 వార్డులకు ఎవరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. వీటికి కూడా రీనోటిఫికేషన్ వెలువడనుంది.



వేద కాలంలోనే గ్రామ పాలన!

పంచాయతీరాజ్ వ్యవస్థకు మూలాలు భారతదేశ ప్రాచీనా కాలాల్లోనే ఉన్నాయి. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో గ్రామ స్వపరిపాలన ప్రాధాన్యత ప్రస్తావన ఉంది. అధికార వికేంద్రీకరణ ద్వారానే ప్రజ లకు న్యాయం జరుగుతుందని కౌటిల్యుడు బలంగా విశ్వసించేవారు. రాజు అనేవాడు ప్రజలకు సేవకుడిగా ఉండాలి. తన వ్యక్తిగత ఇష్టాయిష్టాలను పక్కనపెట్టి ప్రజల ఆకాంక్షకు పెద్దపీట వేయాలి. ప్రజల వ్యక్తిగత, సాంఘిక జీవనాన్ని సామాజిక, మత సంస్థలు ప్రభావితం చేస్తుండడంతో ఇందులో రాజ్యం పాత్ర పరిమితంగా ఉం టుదని గుర్తించారు. రాజ్య రక్షణ, న్యాయం విషయంలో రాజు పాత్ర ఉంటుందని స్పష్టం చేశారు. అర్థశాస్త్రంలో గ్రామ పరిపాలనను గుర్తించారు. ప్రాథమిక పాలనా వ్యవస్థగా నిర్వచనం ఇచ్చారు. ఆ రోజుల్లోనే గ్రామ పరిపాలన ప్రజాస్వామ్య బద్ధంగా ఉండేదని కౌటి ల్యుడి అర్థశాస్త్రం తెలియజేస్తున్నది. దీన్నిబట్టి వేద కాలంలోనూ గ్రామాలు క్షేత్రస్థాయి రాజ్యాలుగా ఉన్నట్లు తెలుస్తోంది.

మెట్‌కాఫ్ పరిశోధనల్లో గ్రామస్వరాజ్యం ప్రస్తావన

ముస్లిం రాజుల పాలనలో గ్రామ స్వపరిపాలన దెబ్బతిన్నప్పటికీ మూలాలు బలంగానే ఉన్నాయి. 1830లో భారత్‌కు గవర్నర్ జనరల్‌గా వ్యవహరించిన చార్లెస్ మెట్‌కాఫ్ రాతల ద్వారా ఈ విషయం తెలుస్తున్నది. భారతీయ గ్రామాలు చిన్నపాటి స్వయం పోషక రాజ్యాలుగా ఉన్నాయని మెట్‌కాఫ్ కొనియాడారు. ఆర్థిక, వ్యవసాయ తదితర అవసరాలన్నీ గ్రామంలోనే తీరిపోయేవి. పొరుగు గ్రామాలపై ఆధారపడాల్సిన అవసరం లేని స్థితిలో ఆనాడు భారతీయ గ్రామాలు వర్ధిల్లాయని మెట్‌కాఫ్ పేర్కొన్నారు. గ్రామ కమిటీలు దాదాపు రాజ్యం అంత బలంగా ఉండేవని, భారతదేశం సర్వ తోముఖాభివృద్ధిలో ఇవి కీలక భూమిక పోషించేవని మెట్‌కాఫ్ రాసుకొచ్చారు. పరాయి పాలనలో ధ్వంసమైన భారతీయ గ్రామ స్వపరిపాలన పునరుద్ధరించ బడితేనే దేశంలో నిజమైన ప్రజాస్వా మ్యం ఉన్నట్లని మహాత్మా గాంధీ భావించడానికి చరిత్ర లో తగిన ఆధారాలు న్నట్లు మెట్‌కాఫ్ రాతల ద్వారా స్పష్టమవుతోంది. ఏ గ్రామానికి చెందిన పాలన అదే గ్రామం చేతిలో ఉండాలని, అప్పుడే స్థానిక ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని గాంధీ కలగన్నారు. నిజానికి గాంధీ రాజకీయ తత్వంలో గ్రామమే మూలాధారం. గ్రామ స్వరాజ్యం మార్గంలో యావత్ భారతం వెళ్లినప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లినట్లని గాంధీ సూత్రీకరించారు.

పంచాయతీ కథలు 12

- అప్పట్లో అధికారం పైనుంచి కిందకు వికేంద్రీకరణ కాలేదని, అది స్వయంభూగా అవతరించిందని రుజువులు దర్శనమిస్తున్నాయి. మొదట్లో పెద్ద పెద్ద రాజ్యాల బదులు.. గ్రామాలు, చిన్న చిన్న జనవా సాలే ఉండేవని, అప్పట్లో స్వపరిపాలనే కీలకమని చరిత్రకారులు పేర్కొంటున్నారు.
- గ్రామ పాలన నుంచే రాజ్యపాలన అవిర్భవించిదనే వాదన కూడా ఉంది. పరాయి రాజులు భారతదేశాన్ని ఆక్రమించడానికి ముందు స్వపరిపాలన గ్రామ స్థాయిలో ఉండేది. పరాయి పాలకుల వైఖరి, విధానాల కారణంగా గ్రామస్వరాజ్యం అంతరించింది.
- ముస్లిం రాజుల దాడిలో స్థానిక సంస్కృతులు, పరిపాలనా విధానాలు ధ్వంసమయ్యాయి. రాజ్యపాలనకు మూలంగా ఉన్న గ్రామ స్వపరిపాలన క్షీణించింది. దీంతో సంప్రదాయంగా వస్తున్న ప్రజల ప్రమేయంతో, భాగస్వామ్యంతో నడిచే ప్రజాస్వామ్య ప్రక్రియ బలహీనపడింది.
- ఆ తరువాత బ్రిటీష్ వారి ఏలుబడితో అంతోఇంతో మిగిలి ఉన్న గ్రామ స్వపరిపాలన సమూలంగా నాశనమైంది. ఆంగ్లేయులు గ్రామస్వరాజ్య వ్యవస్థను నిర్వీర్యంచేశారు. వారి స్వప్రయోజనాలకు అనుగుణ మైన వ్యవస్థలను ఏర్పాటు చేశారు. గ్రామాల స్థాయిలో స్వపరిపాలనను దెబ్బతీస్తే తప్ప ఇక్కడ తమ పరిపాలన పునాదులు బలపడవని భావించి, దేశీయ ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేశారన్నది ఆధునిక చరిత్రకారుల విశ్లేషణ.

క్రీడాప్రభ

దూండై..!



నేడు ఆస్ట్రేలియాతో కీలక రెండో వన్డే

- ధోనీ ఆటతీరుపైనే సర్వత్రా చర్చ
- నాల్గో స్థానంలోనే రాణిస్తున్న మాజీ సారథి
- టీమిండియాకు తప్పని బ్యాటింగ్ ఆర్డర్ సమస్య
- ఉదయం 7.50 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



ఆడిలైడ్: ఆసీస్‌పై టెస్టు సిరీస్ చరిత్ర తిరగరాసిన టీమిండియాకు మూడు వన్డే మ్యాచుల సిరీస్‌లో తొలి ఆటలో ఓటమిని మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో రెండో వన్డే టీమిండియాకు ఎంతో కీలకంగా మారింది. నేడు (మంగళవారం) ఆడిలైడ్ వేదికగా రెండో వన్డే ఆడనుంది. సిడ్నీ వేదికగా జరిగిన మొదటి వన్డేలో 34 పరుగుల తేడాతో భారత్‌పై ఆసీస్ విజయం సాధించిన విషయం తెలిసిందే. రోహిత్ శర్మ శతక్కొట్టినా మిగిలిన సభ్యులు ఎవరూ రాణించకపోవడంతో ఓటమి పాలైంది. నేడు ఆడిలైడ్ వేదికగా జరిగే రెండో వన్డేలో టీమిండియా పరిస్థితి డూ ఆర్ డైగా మారింది. గెలిస్తే సిరీస్‌పై ఆశ పెట్టుకోవచ్చు. లేదంటే వన్డే సిరీస్ ఆసీస్‌కు సమర్పించుకున్నట్టే. అయితే ప్రధానంగా ధోని ఆటతీరుపైనే ఇప్పుడు అందరి కేంద్రీకృతమైందని చెప్పుకోవచ్చు. హార్దిక్ పాండ్యాపై వేటు పడటంతో టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో లయ తప్పినట్టయ్యింది. తొలి వన్డేలో ధోనీ 96 బంతుల్లో 51 పరుగులు మాత్రమే చేశాడు. స్ట్రైక్ రేట్‌ను రొటేట్ చేయడంలో విఫలమయ్యాడనే భావించొచ్చు. ధోని 5వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. ఇంకా టీమిండియాకు బ్యాటింగ్ ఆర్డర్ సమస్య వెంటాడుతోంది. ఇది తొలి వన్డే ఆడిన సిడ్నీ మైదానంతో వెలుగులోకొచ్చింది. 2016 నుంచి తొలి ముగ్గురు ఆటగాళ్లు రోహిత్, శిఖర్ ధావన్, కోహ్లీ బ్యాటింగ్‌లో ఎంజాయ్ చేస్తూ వస్తున్నారు. ధోనీ నాల్గో స్థానంలో ఆడటం చాలా అరుదుగా కనిపిస్తోంది.

రెండో వన్డే కోసం టీమిండియా ఇంకా షార్ట్ లిస్టును ప్రకటించలేదు. హార్దిక్‌పై వేటు వేయడంతో అవకాశం లేదు. రెండో వన్డేలో రాణించేందుకు బ్యాటింగ్, బౌలింగ్‌లో కొన్ని మార్పులు చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది. ముగ్గురు ఫాస్ట్ బౌలర్లలో మహ్మద్ షమీ బాగా రాణించాడు. రెండో వన్డేలో రాణించడానికి ఖలీల్ తీవ్రంగా శ్రమిస్తున్నాడు. మహ్మద్ సిరాజ్ రెండో వన్డేలో ఆడనున్నాడు. సిరాజ్ బౌలింగ్‌పై కోచ్ రవి శాస్త్రి ప్రత్యేక దృష్టిసారించినట్టు తెలుస్తున్నది.

అన్ని ఫార్మాట్లలో కోహ్లీ 73.44 సగటుతో రాణిస్తున్నాడు. వన్డేల్లో చూసుకుంటే 46.66 సగటుతో దూసుకెళ్తున్నాడు. ఎంతో ఇష్టమైన ఆడిలైడ్ మైదానంలో మాత్రం విరాట్ పరుగుల వరద పారిస్తాడని భావిస్తున్నారు. ధోని, రాయుడు ఇద్దరూ డొమెస్టిక్ క్రికెట్, బార్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆడలేదు. టెస్టు క్రికెట్ నుంచి ధోనీ తప్పుకున్న విషయం తెలిసిందే.

భారత్ జట్టు : విరాట్ కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, రాయుడు, దినేష్ కార్తీక్, జాదవ్, ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, చాహల్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, విజయ్ శంకర్.

ఆసీస్ జట్టు : ఆరోన్ ఫించ్ (కెప్టెన్), జాన్సన్ బెహ్రెండోర్ఫ్, కేరి (వికెట్ కీపర్), పీటర్ హాండ్స్‌కాంబ్, ఖవాజా, నాథన్ లియాన్, మిట్చ్ మార్ష్, షాన్ మార్ష్, మ్యాక్స్‌వెల్, రిచర్డ్‌సన్, సిడిల్, స్టాయినిస్, బిల్లీ స్టాన్లెక్, ఆష్టన్ టర్నర్, ఆడం జంపా.

♦ ధోనీ నాల్గో స్థానంలో ఆడినప్పుడు 52.95 సగటుతో రాణించాడు. కెరీర్ పరంగా చూస్తే 333 వన్డేల్లో 50.11 సగటుతో దూసుకెళ్లాడు.

♦ ఐదో స్థానంలో వస్తే 50.70 సగటుతో, ఆరో స్థానంలో 46.33 సగటుతో రాణించాడు. వీటన్నింటితో పోలిస్తే ధోనికి నాల్గో స్థానం ఎంతో కలిసి వచ్చిందని తెలుస్తున్నది.

♦ నాల్గో స్థానంలో 94.12 స్ట్రైక్ రేట్ చూపించాడు. ఓవరాల్ కెరీర్ స్ట్రైక్ రేట్ 87.60గా నమోదైంది. ఐదో స్థానంలో 86.08, ఆరో స్థానంలో 83.23 స్ట్రైక్ రేట్‌తో రాణించాడు. ♦ 2016, జనవరి, ఆస్ట్రేలియాలో టీమిండియా వన్డే ఆడినప్పుడు రెండు మ్యాచుల్లో నాల్గో స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. అప్పుడు కేవలం 18 పరుగులు మాత్రమే చేశాడు. 2018 ఆసియా కప్ నుంచి ఆడిన 8 వన్డేల్లో ధోని నాల్గో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. 2016 అక్టోబర్‌లో 24.75 సగటుతో, 77.34 స్ట్రైక్ రేట్‌తో న్యూజిలాండ్‌పై అత్యధికంగా 84 పరుగులు మాత్రమే చేశాడు.

సఫారీల క్లీన్ స్వీప్



దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ మధ్య సాగిన మూడు టెస్టుల సిరీస్‌ను సఫారీ జట్టు 3-0తో కైవసం చేసుకుంది. మూడో టెస్టులో దక్షిణాఫ్రికా జట్టు 107 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా డికాక్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా డ్యూన్నే నిలిచాడు.

"గతేడాది డిగ్రీ నకిలీ పట్టా విషయంలో మహిళల టీ20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? 2017 వరల్డ్ కప్‌లో రాణించినందుకు గాను పంజాబ్ సీఎం అమరిందర్ సింగ్ డీఎస్పీ కేడర్ పోస్టు ఇచ్చారు. పాండ్యా, రాహుల్‌ను సస్పెండ్ చేసి విచారణను పెండింగ్‌లో ఉంచారు. మరి కౌర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదు..? ఆమె టీమిండియాకు కెప్టెన్. నకిలీ డిగ్రీ పట్టా వ్యవహారంలో ఎందుకు కాపాడుతున్నారు..?"

- బీసీసీఐ అధికారి

విచారణ జరపండి

- పాండ్యా, రాహుల్‌కు శ్రీశాంత్ మద్దతు



న్యూఢిల్లీ : టీవీ షోలో అభ్యంతరక వ్యాఖ్యలు చేసి క్రికెట్‌కు తాత్కాలికంగా దూరమైన హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌పై విచారణ జరపాల్సిందే అని బీసీసీఐ డిమాండ్ చేస్తున్నది. ఇద్దరి క్రికెట్ జీవితాలతో ఆడుకోవద్దని కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ చీఫ్ వినోద్ రాయ్ కోరుతున్నారు. వీరిద్దరిపై విచారణ జరిపించేందుకు గాను అంబుడ్స్‌మెన్ ఆధ్వర్యంలో స్పెషల్ జనరల్ మీటింగ్ నిర్వహించాలని బీసీసీఐ కోరుతున్నది. కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ ద్వారా విచారణ జరిపించాలని రాయ్‌తో పాటు సభ్యుడు డయానా ఇదుల్జీ భావిస్తున్నారు. దీనిపై బీసీసీఐ సీనియర్ అధికారి మాట్లాడుతూ... షోకాజ్ నోటీసులపై పాండ్యా, కేఎల్ రాహుల్ స్పందించారని, వారు వివరణ ఇచ్చారని తెలిపారు. కొత్త బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం.. క్లాస్ 41(సీ) కింద విచారణ జరిపించాలని సీఓఏ చీఫ్ సీఈఓను ఆదేశించడం జరిగిందన్నారు. కాఫీ విత్ కరణ్ షోలో ఇద్దరు యువ క్రికెటర్లు మహిళలనుద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం వారి మెడకు చుట్టుకుంది. భారత్‌లో క్రికెట్ ఉన్న ఆదరణ చూడాలని రాయ్ బీసీసీఐకి రాసిన లేఖలో తెలిపాడు. ఎంతో విచారకరంగా భావిస్తున్నామని, టూర్‌లో ఉన్న వారికి ఆడనివ్వకుండా సస్పెండ్ విధించామని అన్నారు.

పాండ్యా, రాహుల్ మ్యాచ్ విన్నర్‌లు : శ్రీశాంత్

బహిష్కరణకు గురైన పాండ్యా, రాహుల్ మ్యాచ్ విన్నర్‌లు. వారు మాట్లాడింది తప్పే. దీనికి నేను ఏకీభవిస్తున్నాను. కానీ ఇంతకంటే పెద్ద పెద్ద తప్పులు చేస్తున్నారు. వారిని ఎందుకు వదిలిపెట్టేస్తున్నారు...? భారత్‌కు వీరిద్దరి సేవలు ఎంతో అవసరం. రానున్న ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకుని వారిపై నిషేధం ఎత్తేయాలి. ఇలాగే వ్యవహరిస్తే జట్టుకే తీవ్ర నష్టం. వీరి కంటే పెద్ద తప్పులు చేసిన వారు సమాజంలో తిరుగుతున్నారు. బీసీసీఐ స్పందించాలి. నిషేధం ఎత్తేవేయాలి.

ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ
మెరిసిన నాదల్, ఫెదరర్

- నిరాశపర్చిన ప్రజ్నేష్ గున్నేశ్వరన్



మెల్‌బోర్న్ : కొత్త ఏడాదిలో ప్రారంభమైన తొలి గ్రాండ్ స్లామ్ ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీలో ప్రజ్నేష్ గున్నేశ్వరన్ నిరాశపరిచాడు. అమెరికా క్రీడాకారుడు ఫ్రాన్సెస్ టియాఫో చేతిలో వరుస సెట్లలో ఓటమి చవి చూశాడు. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ టోర్నీలోని తొలి రౌండ్‌లో టియాఫో, 7-6 (9-7), 6-3, 6-3 పాయింట్ల తేడాతో గున్నేశ్వరన్‌ను ఓడించాడు. 39వ ర్యాంకులో కొనసాగుతున్న టియాఫో, ప్రజ్నేష్ మధ్య గంట, 52 నిమిషాల పాటు ఆట సాగింది. మొదటి సెట్‌లో ప్రజ్నేష్ బాగా పోరాడాడు. ఇద్దరు ఆటగాళ్లు 12వ సర్వీస్ తరువాత టైబ్రేక్‌కు వెళ్లారు. టియాఫో మినీ బ్రేక్ తీసుకొని మొదటి సెట్‌ను 9-7తో ముగించాడు. ఆ తరువాత నుంచి ఫ్రాన్సెస్ 106వ ర్యాంకు భారత్ ఆటగాడు ప్రజ్నేష్‌పై ఆధిపత్యం కొనసాగిస్తూనే వచ్చాడు. దాంతో రెండు, మూడు సెట్లు కోల్పోవాల్సి వచ్చింది. టియాఫో రెండో సెట్‌లో మూడు, ఆరో గేమ్‌లో రెండు బ్రేక్ పాయింట్లు తీసుకొని 6-3 తేడాతో ప్రజ్నేష్‌పై విజయం సాధించాడు. మహిళల క్వాలిఫైర్ విభాగంలో అంకితా రైనా, కర్మాన్ కౌర్‌లు రెండో, మూడో రౌండ్‌లో నిరాశపరిచాడు.

ఆండీ ముర్రే ఔట్

17 సార్లు గ్రాండ్ స్లామ్ విన్నర్ రఫేల్ నాదల్ తొలి రౌండ్‌లో సత్తా చాటాడు. ఆస్ట్రేలియాకు చెందిన వైల్డ్‌కార్డ్ ఆటగాడు జేమ్స్ డక్‌వర్త్‌ను 6-4, 6-3, 7-5 పాయింట్ల తేడాతో ఓడించాడు. ఈ సందర్భంగా నాదల్ మాట్లాడుతూ.. గెలుపు కోసం తీవ్రంగా కష్టపడాల్సి వచ్చిందని వివరించాడు. నా ఎనర్జీపై ఎంతో ఆనందంగా ఉందన్నారు. మూడో సీడ్ స్విట్జర్‌లాండ్ ఆటగాడు రోజర్ ఫెదరర్ 6-3, 6-4, 6-4 పాయింట్లతో ఉజ్బెకిస్తాన్ ఆటగాడు డెయినిస్ ఇస్టోమిన్‌ను మట్టికరిపించాడు. ఆండీ ముర్రే, 22వ సీడ్ ఆటగాడు రాబర్ట్ బటిస్టా చేతిలో 6-4, 6-4, 6-7 (5/7), 6-7 (4/7) పాయింట్ల తేడాతో ఓడిపోయాడు.

యార్కర్లు ప్రాక్టీస్ చేస్తున్నా



జస్ప్రీత్ బుమ్రా లేకపోవడంతో రెండో వన్డే కోసం యార్కర్లు ప్రాక్టీస్ చేస్తున్నాను. యార్కర్లు వేయడంలో బుమ్రా దిట్ట. బుమ్రా లేని లోటును పూడ్చేందుకు ప్రయత్నిస్తున్నాను. బ్యాట్స్‌మెన్ కాళ్లను లక్ష్యంగా చేసుకుని బౌలింగ్ వేయడం అంత ఈజీ కాదు. దీనికి కఠోర సాధన, ప్రత్యేక నైపుణ్యం కావాలి. చివరి ఓవర్లలో వికెట్లు తీస్తూ బ్యాట్స్‌మెన్‌కు పరుగులు ఇవ్వకుండా నియంత్రించే అవకాశం ఉంటుంది. అందుకే యార్కర్లు వేయడంలో ప్రాక్టీస్ చేస్తున్నాను. ఇలాంటి బంతులు విసరక చాలా ఏళ్లు అయ్యింది. యార్కర్లు వేయడం ఓ డిఫరెంట్ స్కిల్. నెల రోజులుగా టెస్టు మ్యాచులు జరిగాయి. ఈ ఫార్మాట్‌లో ఎక్కువ యార్కర్లు విసరరు. కొత్త బంతితో బౌలింగ్ చేస్తున్న సమయంలో వృత్తం బయట ఇద్దరు ఫీల్డర్లు ఉంటారు. అదే పాత బంతి వేస్తున్నప్పుడు ఎంత మంది ఫీల్డర్లు ఉన్నా బ్యాట్స్‌మెన్ భయపడడు. కొత్త బంతి అయితే స్వింగ్ చేసి వికెట్లు తీయవచ్చు. టెస్టులు ఆడలేదు. వన్డే, టీ20 జట్టుకు ఎంపికైనందుకు సంతోషంగా ఉంది. బంతి పాతబడ్డ తరువాత యార్కర్లు లేదా స్లో బౌలింగ్ చేస్తే వికెట్లు లభించే అవకాశాలు ఉన్నాయి. ఏ ఫార్మాట్‌లో అయినా వికెట్లు తీసేలా బౌలింగ్ చేస్తున్నాను.

సిరీస్ గెలిస్తే గొప్పగా భావిస్తా



టీమిండియాపై వన్డే సిరీస్ గెలిస్తే ఎంతో గొప్పగా భావిస్తాను. ఇదో పెద్ద ఘనత. 12 నెలలుగా గెలుపు కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్నాం. 2017 జనవరిలో పాకిస్థాన్‌పై 4-1 తేడాతో సిరీస్ గెలిచాం. 2018లో 18 వన్డేల్లో 2 మాత్రమే గెలిచాం. 2019ను టీమిండియాపై విజయంతో ప్రారంభించాం. ఎంతో సంతోషంగా ఉంది. ఆస్ట్రేలియా ఇలాంటి విజయాలు చూసి ఎన్నో ఎళ్లైంది. ప్రపంచ కప్‌కు ఈ సిరీస్ ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. భారత్ ప్రతీకారం ఎక్కువ తీర్చుకుంటుంది. మొదటి వన్డేలో ఓడిందంటే రెండో వన్డే మాకెంతో కీలకం అని అనుకుంటున్నాం. రోహిత్, ధోనీ పార్టనర్‌షిప్‌ను బ్రేక్ చేయడంతోనే తొలి వన్డేలో విజయం సాధించాం. తమ సత్తా చూపించడానికి ఈ సిరీస్ ఎంతో కీలకం అని అనుకుంటున్నాను. నాథన్ లియాన్, రషీద్ ఖాన్ బౌలింగ్ ఎంతో బాగుంది. ఫించ్ కూడా టాప్ ఆర్డర్‌లో బాగా రాణిస్తున్నాడు.

కిదాంబి జాక్‌పాట్

చైనా కంపెనీతో రూ.35 కోట్లకు ఒప్పందం



న్యూఢిల్లీ : ఇండియన్ షట్లర్, తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ జాక్‌పాట్ కొట్టాడు. చైనాకు చెందిన లి నింగ్ అనే కంపెనీతో కిదాంబి నాలుగేళ్ల కాలానికి స్పాన్సర్‌గా నిలుస్తాడు. దీని కోసం చైనాకు చెందిన అతిపెద్ద స్పోర్ట్స్ బ్రాండ్ కంపెనీ రూ.35 కోట్లు ఇవ్వనుంది. దీనికి సంబంధించి కిదాంబి, సదరు కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని సంతకం కూడా చేసేశాడు. మాజీ ప్రపంచ నెంబర్ వన్ క్రీడాకారుడు అయిన కిదాంబి భారత్ తరఫున ఆరు సూపర్ సిరీస్ టైటిళ్లను కైవసం చేసుకున్నాడు. ఇన్ని టైటిళ్లు గెలిచిన ఒకే ఒక్క ఆటగాడు కిదాంబి కావడం విశేషం.

చైనాకు చెందిన లి నింగ్ బ్రాండ్ కంపెనీ స్పాన్సర్ షిప్‌తో పాటు క్రీడా సామాగ్రిని సరఫరా చేస్తూ ఉంటుంది. ఈ సందర్భంగా కిదాంబి శ్రీకాంత్ మాట్లాడుతూ.. భారత్‌తో పాటు అంతర్జాతీయ స్థాయిలో లీ నింగ్‌కు కంపెనీకి ప్రచారకర్తగా ఉండటం ఎంతో ఆనందంగా భావిస్తున్నా అని అన్నారు. కంపెనీ ఉత్పత్తులు అంటే ఎంతో ఇష్టమని, కొత్త కొత్త వస్తువులను ఉపయోగిస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకుంటూ దేశ ప్రతిష్ట పెంచేందుకు శాయ శక్తులా కృషి చేస్తానని వివరించాడు.

2020 టోక్యో ఒలింపిక్స్ వరకు భారత్‌కు స్పాన్సర్

లీ నింగ్ కంపెనీ చైనాతో పాటు ఇండోనేషియా, సింగపూర్, ఆస్ట్రేలియాలో బ్యాడ్మింటన్ జట్లకు మద్దతు ఇస్తూ ఉంటుంది. 2018, జకార్తలో జరిగిన ఆసియా క్రీడల్లోనూ భారత్ జట్టుకు లీ నింగ్ కంపెనీ అధికారిక స్పాన్సర్‌గా నిలిచింది. 2020 టోక్యో ఒలింపిక్స్ క్రీడలు జరిగే వరకు భారత్ జట్టుకు అధికారిక దుస్తువుల స్పాన్సర్‌గా వ్యవహరిస్తుంది. లీ నింగ్ ఇండియా భాగస్వామి, సన్‌లైట్ స్పోర్ట్స్ డైరెక్టర్ మహేందర్ కపూర్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో శ్రీకాంత్ మంచి ఆటగాడు అని, అదేవిధంగా భారత్ పురుషుల జట్టులో మెరుగైన ప్రతిభ కనబరుస్తూ ముందుకు దూసుకెళ్తున్నాడని తెలిపారు. లీనింగ్ కంపెనీ అంటే మన్నిక, నాణ్యతకు మారు పేరు అని, ఈ కంపెనీ ప్రచారకర్తగా శ్రీకాంత్ సరిగ్గా సరిపోతాడని అన్నారు. శ్రీకాంత్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఇందుకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని వివరించారు.


Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
Lively Interaction For Ever
మంగళవారం 15 జనవరి 2019

పొలిటికల్ పొంగల్!


హై హై నాయక... సంక్రాంతి వేడుక!

సంక్రాంతి పండుగ సంవత్సరానికి ఒకసారి వస్తుంది. సంక్రాంతి సందర్భంగా కనిపించే హరిదాసులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు వంటి సంప్రదాయాలు తిరిగి సంవత్సరం తరువాతే చూస్తాము. అయితే ప్రజలను పాలించే నాయకులు సమర్ధతతో సత్య సంధతతో ఉంటే ప్రజల జీవితం నిరంతరం ఆనందాల పండుగలాగే ఉంటుంది. ఈ ఏడాది సంక్రాంతి నాటికి తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుతీరితే...కేంద్రంలోనూ, మరికొన్ని రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్నికలు జరగనున్నాయి. ముఖ్యంగా కేంద్రంలో కొత్త ప్రభుత్వం రానున్న నేపథ్యంలో ఎన్నికల సందడి రాజకీయ వర్గాల్లో మరింతగా కనబడుతోంది. అందుకే ఈ ఏడాది ప్రజలకు సంక్రాంతి సందళ్లతో పాటు పొలిటికల్ పొంగల్ హడావుడులు సైతం ఎక్కువే ఉన్నాయి. ఈ రెండింటినీ కలిపి చూస్తే....కనిపించే రాజకీయ సంక్రాంతి ఇది-




కవ్విస్తున్న పందెం కోడి -రాహుల్ గాంధీ

అనేక విమర్శల అనంతరం...రాహుల్ గాంధీ రాజకీయాల్లో ఫామ్‌లోకి వచ్చారు. ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తమ నాయకునికి ఈ విజయాలను కానుకగా ఇస్తున్నామన్నారు ఆ పార్టీ నాయకులు. సాధారణంగా వివిధ ఉద్యోగాల్లో ఉన్నవారికి వారి నైపుణ్యాలను పెంచే శిక్షణా కార్యక్రమాలు తరచుగా జరుగుతుంటాయి. కానీ రాజకీయ నాయకులకు ఓటములే పాఠాలవుతుంటాయి. తమ పార్టీకి జవజీవాలు రావాలంటే తనలో ఎలాంటి మార్పులు అవసరం అనే విషయంలో రాహుల్ గాంధీకి స్పష్టత పెరుగుతున్నట్టే ఉంది. ఇంతకుముందు...మోడీ వర్సెస్ రాహుల్ అంటే కాస్త అసౌకర్యంగా, అసహజంగా అనిపించేదేమో కానీ ఇప్పుడు మాత్రం...ఈ రెండు పేర్లు...సంక్రాంతి కోళ్లపందేల్లో ఢీకొంటున్న పందెం కోళ్లలాగే అనిపిస్తున్నాయి. పార్లమెంటులో ప్రధానిమోడీకి కన్నుగీటి ఆలింగనం చేసుకుని...ఒక చిన్నపాటి సంచలనానికి తెరతీసిన రాహుల్...'మీరు ఎంత తిట్టినా నేను ప్రేమిస్తూనే ఉంటాను' అనే సందేశాన్ని ఆ రూపంలో ఇచ్చారు. నిదానంగా దగ్గరగా వచ్చి....ఒక్కసారిగా ఎగిరి ప్రత్యర్థి కోడిని చిత్తు చేయాలని చూసే పందెం కోడి...వ్యూహం... రాహుల్ గాంధీలో కనబడుతున్నట్టే ఉంది. బిజెపిపై ద్వేషం లేదంటున్నా...పోటీ ఉంటుంది...పందెం ఉంటుంది...నువ్వా నేనా అనే పోరాటం ఉంటుందని రాహుల్ గాంధీ రాజకీయ అడుగులు చెబుతున్నాయి. 'మీరు పప్పు అని పిలిచినా నాకు కోపం రాదు...మీలోని ద్వేషాన్ని నేను ప్రేమగా మారుస్తాను. నేను కాంగ్రెస్‌ని' అంటున్నారు ఆయన. ఇంతకంటే కవ్వింపు చర్యలు ఏముంటాయి...అయితే కాంగ్రెస్‌కి రాహుల్ పందెం కోడా...లేదా రాహుల్‌కి కాంగ్రెస్ పందెంకోడా... అనేది కాస్త కన్‌ఫ్యూజనే అయినా పందెం మాత్రం గట్టిగానే ఉంటుందని భావించవచ్చు.



గాలివీస్తోంది... ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలు -కేసీఆర్

గాలిపటానికి ఆకాశమే హద్దు. పిల్లలు డాబాలు ఎక్కి.... వీలయి నంత ఎక్కువ ఎత్తుకి ఎక్కి తోటిపిల్లలతో పోటీపడుతూ తమ హవా చాటాలనుకుంటారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్...అంతా తానై సాధించిన విజయం కూడా కేసీఆర్‌కి జనంలో ఉన్న క్రేజ్‌కి ఆకాశమే హద్దు... అనిపించేలా చేసింది. ఇప్పుడు ఆయన దృష్టి జాతీయ రాజకీయాలవైపు ఉంది. గాలిపటాలను ఎగరేసే పిల్లలను గమనించండి. వారికి ఎండ వేడి లాంటివి పట్టవు...ఆకలి నీళ్లు గుర్తురావు. చాలా సహనంగా మరింత ఎత్తుకి ఎగరేయాలని ప్రయత్నిస్తుంటారు. కేసీఆర్ కూడా అదే అంటున్నారు. 'నాకు చాలా సహనం ఉంది..సరైన సమయం కోసం ఎదురుచూ స్తున్నాను. ప్రజలకు అర్థమయ్యేలా చేయడానికి సమయం కావాలి...' అంటున్నారు ఆయన. తన ప్రయత్నాలను ఒక మహాయజ్ఞంతో పోలుస్తున్నారు. ఎవరెవరు మీతో వస్తారు...అనే ప్రశ్నకు తొందరెందుకు...అని బదులిస్తున్నారు. తమ ఫెడరల్ ఫ్రంట్... ఒక సరికొత్త ఎకనమికల్ మోడల్ అని వివరిస్తున్నారు. గాలిపటం...పైకెళ్లే కొద్దీ...ఎవరు దాంతోపాటు ప్రయాణం చేస్తారు...ఎవరు మెలికలు వేసి తెంచాలని చూస్తారు...అనేవిషయంలో దానిని ఎగరేసే వారికి సైతం స్పష్టత ఉండదు...ప్రయత్నం, కృషి, సహనం, పట్టుదలగా ఎగరేయడమే...లక్ష్యమై ఉండాలి. ఫెడరల్ ఫ్రంట్ విషయంలో కేసీఆర్‌లో అలాంటి లక్షణాలు అన్నీ పుష్కలంగా ఉన్నాయి.




2019 ఎన్నికల మేనిఫెస్టో... రంగుల రంగవల్లి! -నరేంద్రమోడీ

పార్లమెంటు ప్రాంగణంలో ప్రధాని నరేంద్రమోడీ ఇప్పుడు...ప్రజా సంక్షేమ పథకాల రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు. ఎన్నికల వేళ అవుతుంటే... ప్రాంతఃవేళ లేచి శ్రద్ధగా సంక్రాంతి ముగ్గులు వేసే వనితల్లాగే ఆయనకూడా నడుంవంచి కష్టపడుతున్నారు. ఎలాగూ యోగా ఆయనను నిటారుగానే ఉంచుతుంది... అలాగే...ఎన్నికల బరిలో కూడా వెన్నుచూపని వీరునిలా నిలబడాలని మోడీ ఆశిస్తున్నారు. మోడీ అంటే...బిజెపి...బిజెపి అంటే భారత్..అన్నంతగా ప్రజల్లో పేరు సంపాదించుకున్న ప్రధాని... అటు బిజెపిని...ఇటు భారత్‌ని రెండింటినీ రెండు భుజాలమీద మోస్తున్నారు. ఇంటికి అందాన్ని తెచ్చే రంగవల్లుల్లాంటివే...జీవితానికి ఆదా, ఆదాయం, సంక్షేమం వగైరాలు. నల్లధనం వెలికి తీస్తామంటూ పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి, జన్‌ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్, మేక్ ఇన్ ఇండియా....యోగాడే, స్కిల్ ఇండియా, స్వచ్ఛభారత్... లాంటి అంశాల ద్వారా మోడీ దేశంపై తన ముద్రవేశారు. ఇప్పుడు అగ్రవర్ణాలకు పదిశాతం రిజర్వేషన్లు అంటున్నారు. కానీ మరింత కొత్తగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది ఆయనకు. అటు రాహుల్ గాంధీ రాజకీయాల్లో రాటుదేలుతున్నారు...ఇటు ప్రాంతీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కాంగ్రెస్‌ని ఓడించడమే కాదు... దేశంలో కాంగ్రెస్‌ని గుర్తు చేసే భావాజాలాన్ని, చిహ్నాలను సైతం తుడిచివేయాలని అనుకుంటున్న మోడీ...2019 ఎన్నికల మేనిఫెస్టోని సంక్రాంతి రంగవల్లిక కంటే అందంగా ఆకట్టుకునేలా తీర్చి దిద్దాల్సిందే.



ఓదార్పు వెచ్చదనం అందేనా! :జగన్

నిజంగానే జగన్ మడమ తిప్పని మనిషి. తండ్రి చనిపోయినప్పటినుండీ విరామమెరుగని ప్రయాణం ఆయనది. ఒక్కక్షణం కూడా నిరాశా నిస్పృహలకు లోను కాకుండా ముందుకు అడుగువేసే తత్వం జగన్‌లో మనకు కనబడుతుంది. జగన్ జనంలోకి మొదటగా వెళ్లింది....వైఎస్ మరణానంతరం...తమ ఇళ్లలోని వైఎస్ అభిమానులైన కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న...కుటుంబాలను ఓదార్చడానికి. చాలా సందర్భాల్లో సాధారణ సగటు జనం ఇళ్లలో భోజనం చేస్తూ...పిల్లలను వృద్ధులను ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ...తలపై చేయి వేసి ముద్దు పెడుతూ...ఇలా అంతులేని ఓదార్పుని ఆయన బాధిత కుటుంబాలకు ఇచ్చారు. తండ్రి ముద్ర చెరిగిపోకుండా...తనవంతు ప్రయత్నాలు చేశారు. నిజానికి ఇప్పుడు జగన్‌కు కావాలి ఓదార్పు. పాదయాత్రతో పాదాలకు కష్టంగా ఉన్నా...పెదవులపై చిరునవ్వుని వదలలేదు. ప్రజలకు దగ్గరవడమే ధ్యేయంగా ముందుకు వెళ్లారు. తండ్రి మరణం, అక్రమ ఆస్తుల కేసులు, ఈడీ దాడులు, తాజాగా కత్తి దాడి...ఇన్ని చుట్టుముట్టినా రానున్న ఎన్నికల కోసం ఎడతెగని ప్రయత్నాలు, పోరాటం చేస్తూనే ఉన్నారు...ఇప్పుడు జనం జగన్‌ని అక్కున చేర్చుకోవాల్సిన సమయం వచ్చింది....సూర్యుడి కిరణాలకు ....తెరలు కట్టి చలి తన ప్రతాపాన్ని చూపే భోగినాడు వేసుకునే చలిమంట...లోని వెచ్చదనం లాంటి ఓదార్పు ఆయనకు అందాలి.




రైతే... ఎన్నికల రాజు!

జై జవాన్, జైకిసాన్...అనే నినాదం మనదేశానికి కొత్త కాదు...రైతు పడే కష్టం జై కొట్టేదిగానే ఉన్నా...అతని జీవితం మాత్రం జైత్రయాత్ర కానేకాదు. రైతుల ఆత్మహత్యల విషయంలో దేశంలోని రాష్ట్రాలు పోటీపడుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల్లో చైతన్యం కనబడుతోంది. రైతులు ర్యాలీలు నిర్వహిస్తూ... ఢిల్లీలో తమ గళం వినిపిస్తున్నారు. రైతుని పట్టిం చుకున్నవాడు నిజమైన రాజకీయ నాయకుడు అనే పేరు కూడా దేశవ్యాప్తంగా ఇప్పుడు వినబడుతోంది. తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులే కాదు...దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలన్నీ ఇప్పుడు రైతునామజపం చేస్తున్నాయి. మరి వ్యవసాయదారుని సాయం...ఎవరికి అందుతుందో... సంక్రాంతి పంటలాంటి ఓట్లపంటని ఆయన ఎవరి ఇంట పండించనున్నాడో...



ఓట్లు రాబడితేనే పండుగ - చంద్రబాబు నాయుడు

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతికి మించిన ఎన్నికల సందడి రానుంది. 'హరిలో రంగ హరి...మీరంతా హరి...మాకు మేమే సరి' అంటున్నాయి ప్రధాన రాజకీయ పార్టీలన్నీ. ప్రతిపార్టీ ప్రతిరాజకీయనాయకుడు... ప్రజలకు మేమే దగ్గర అంటున్నారు. ప్రజాకీర్తనలే ఆలపిస్తున్నారు. అధికారంలో ఉన్న చంద్రబాబూ ఇందుకు మినహాయింపు కాదు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయి...ఇప్పటివరకు చేసిన పాలనకు ఇప్పుడు మార్కులు పడబోతున్నాయి. ప్రజలందరికీ సమిష్టిగా పాలన చేసినా...ప్రజలు ఓట్లను వ్యక్తిగతంగానే వేయాలి. ప్రతి ఇంటినీ ప్రతి ఓటరుని ఆకట్టుకుంటేనే ఓట్లు. ఏం చేయబోతున్నాం ...అనేదానికంటే ఇప్పటివరకు ఏం చేశాము... అనేది జనంలోకి తీసుకుని వెళ్లటం పాలక పార్టీకి మరింత ముఖ్యం. సంప్రదాయాన్ని భక్తిని జనంలోకి తీసుకువెళుతూ వారిచ్చే ధాన్యంతో జీవిక సాగించే హరిదాసులా...ఇప్పుడు చంద్రబాబు సైతం తమ ప్రభుత్వం చేసినమంచి పనులను జనంలోకి తీసుకుని వెళ్లి..ఓట్లను పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. నిధులులేని పరిస్థితుల్లో...ప్రత్యేక హోదా పాటని మానేసి ఆయనిప్పుడు మోడీపై విమర్శలనే తన ఎన్నికల బాటలుగా మార్చుకుంటున్నారు. జగన్ పవన్‌లు తన రాజకీయ చాతుర్యం, అనుభవం ముందు సరిరారు...అంటున్నారు. ఆయనిప్పుడు హరిదాసులా అణకువగా ప్రజాభక్తిని చాటుతున్నారు. పెరిగిన పెన్షన్లతో పాటు ప్రజాకర్షక పథకాలన్నీ ఆ భక్తిలో భాగాలే.



నూతన ఆశలు ఆకాంక్షలతో కొత్త కలల పంట : పవన్ కల్యాణ్

ప్రజా జీవితాలను మలుపు తిప్పటంలో రాజకీయ నేతలను మించినవారు లేరు. ప్రజల నూతన ఆశలు ఆకాంక్షలను అర్థం చేసుకోవాలంటే... అలాంటివే నేతల్లోనూ ఉండాలి. జనానికి మేలు చేయాలనే ఆకాంక్ష కోరిక పాలకుల్లో లేనప్పుడు ప్రజలకు ఏ మేలూ జరగదు. పవన్ కల్యాణ్...ప్రజలకు మేలు చేయాలనే ఆకాంక్షలతో రాజకీయాల్లోకి వచ్చారు. ఆ ఆశతోనే ఆయన రాజకీయాల్లో అడుగులు వేస్తున్నారు. తను ఏ పార్టీ తరపున ఉన్నా...ప్రజల పక్షం మాత్రం వీడననే సంకేతాలు, సందేశాలు చాలా బలంగానే ఇచ్చారు. ఏటా సంక్రాంతి వచ్చినట్టే సంక్రాంతికి కొత్త పంట కూడా ఇంటికి వస్తుంది. పండుగ వస్తే...పంట రావటం కాదు...అసలు పంటవస్తేనే పండుగ. పంట చేతికి రాకుండా పండుగ కేలండర్ ప్రకారం వచ్చినా ఫలితం ఏముంటుంది. పవన్ కల్యాణ్...తన రాజకీయఅరంగేట్రంతో ఎన్నో పదునైన ప్రశ్నలను మోసుకొచ్చారు...సమస్యలకు ఎదురెళ్లి వాటిని భుజాన వేసుకుని పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేశారు. చేస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తూ కొత్త ఆశలను ఆకాంక్షలను ప్రజల్లో నింపుతున్నారు. జోడెడ్ల బండిలో వచ్చే కొత్త పంటల్లాంటి ప్రజోపయోగపనులను తెస్తున్నారు....తేబోతున్నారు. రాజకీయ నాయకులు ఎవరైనా అధికారంపైన దృష్టితోనే ముందడుగులు వేస్తుంటారు. కానీ పవన్ కల్యాణ్...బాధిత పీడిత జనాల ప్రతినిధిగా పనిచేయడమే, ప్రశ్నించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారు. కొత్త కలలపంట పండిస్తానంటున్నారు.

- వడ్లమూడి దుర్గాంబ


* రంగవల్లిక *



16 చుక్కలు
3 వరుసలు
3 వచ్చే వరకు



ఆత్మూరి సింధు
నిమ్మలూరు



17 చుక్కలు
17 వరుసలు



గోతవరపు సుహాసిని
మచిలీపట్నం
కృష్ణాజిల్లా



మద్దుల పద్మావతి
కొత్తపేట
తెనాలి

19 చుక్కలు నుండి
1 వచ్చేవరకు





బలపాల సునీత
వనపర్తి



23 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు

చింతన

49 రోజుల ఉత్సవం అర్ధకుంభమేళా



క్షీరసాగర మథన సమయంలో ఉద్భవించిన అమృత కలశం కోసం దేవతలు, రాక్షసులు యుద్ధం చేస్తుండగా ఆ కలశం ఒలికి నాలుగు చుక్కల అమృతం అలహాబాద్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌లలోని నదుల్లో పడ్డాయి. అందువల్ల ఈ నాలుగు ప్రదేశాలలో ఒక చోట ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి ఆ అమృత పవిత్ర శక్తి వస్తుందని అంటారు. ఆ రోజుల్లో అర్ధ కుంభమేళా జరుగుతుంది.

లక్షలాది మంది పవిత్ర స్నానాలు చేసే అర్ధ కుంభమేళా ఈ సంక్రాంతి పర్వ దినం నాటి నుంచి మరో పర్వదినమైన మహాశివరాత్రి వరకూ 49 రోజులపాటు జరగనుంది. కుంభము అంటే కుండ లేదా కలశము అని అర్థము. మేళా అంటే కలయిక, కూటమి అని అర్థము. ఈ కుంభమేళా గురించి భాగవతము, మహాభారతము, రామాయణము, విష్ణుపురాణము మొదలైన గ్రంథాలలో ఉంది.

అఘోరాలు, సాధువులు స్నానం చేయడానికి ఈ పుణ్య తీర్థాలకు వస్తారు.

క్షీరసాగర మథన సమయంలో ఉద్భవించిన అమృత కలశం కోసం దేవతలు, రాక్షసులు యుద్ధం చేస్తుండగా ఆ కలశం ఒలికి నాలుగు చుక్కల అమృతం అలహాబాద్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌లలోని నదుల్లో పడ్డాయి. అందువల్ల ఈ నాలుగు ప్రదేశాలలో ఒక చోట ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి ఆ అమృత పవిత్ర శక్తి వస్తుందని అంటారు. ఆ రోజుల్లో కుంభమేళా జరుగుతుంది. దీనిని సాధారణ కుంభ

కుంభమేళాలో ముఖ్యమైన రోజులు

జనవరి 15 మంగళవారం: రాజ స్నానము.


జనవరి 21 సోమవారం: పుష్య పౌర్ణమి.

ఫిబ్రవరి 4 సోమవారం: మౌని అమావాస్య.

ఫిబ్రవరి 9 శనివారం: శ్రీపంచమి

ఫిబ్రవరి 19 మంగళవారం: వ్యాసపూర్ణిమ, మాఘపూర్ణిమ

మార్చి 4 సోమవారం: మహాశివరాత్రి.



అఖాడా సాధువుల సందడి


కుంభమేళా అనగానే నాగ సాధువుల స్నానాలు, వాళ్ళు చేసే విన్యాసాలు గుర్తుకువస్తాయి. ఈ కుంభమేళా సంక్రాంతి నాడు 13 అఖాడాలనుండీ వచ్చే సాధువుల స్నానాలతో ప్రారంభమౌతుంది. అఖాడా అనే పదానికి అర్థం మల్ల యుద్ధవేదిక. ఆంగ్లంలో ఎరీనా అంటారు. మనవైపు వ్యాయామకళాశాలలో మల్లయుద్ధం చేసే స్థలాలవంటివన్నమాట. ఎక్కడ, ఎప్పుడు కుంభమేళా జరిగినా ఈ 13 అఖాడాల సాధువులు వెళ్ళి మొదటగా స్నానం చేయడం ఆనవాయితీ. వాళ్ళు ఎవరో చూద్దాం.

జూనా అఖాడా: దీని ప్రధానకార్యాలయం కాశీలో ఉంది. ఇందులో సుమారు 4 లక్షల సాధువులు ఉన్నారు. ఇదే అతిపెద్ద అఖాడా. వీరి ఇష్టదైవం దత్తాత్రేయుడు. ఇందులో మహిళా సాధ్వీమణులు కూడా ఉన్నారు. వీరికి నివాసం (మాయీ బాడా) విడిగా ఉంటుంది. ఇం దులో ఎంతోమంది విదేశీ సాధువులు కూడా ఉండటం విశేషం.

అటల్ అఖాడా: వీరి ఇష్టదైవం గణపతి. ఇందులో సుమారు 700 మంది సాధువులున్నారు. దీని ప్రధాన కార్యాలయం కూడా కాశీలోనే ఉంది. ఇందులో మహిళలు ఉండరు. వీరు బల్లెంను ఆయుధంగా పూజిస్తారు. ఆ బల్లెంనకు సూర్యప్రకాశ్ అని పేరు. వీరివద్ద ధర్మధ్వజం, పర్వధ్వజం అనే 2 జెండాలుంటాయి. కుంభమేళాలో ధర్మధ్వజంతో ప్రవేశించి, పర్వధ్వజంతో స్నానం చేస్తారు.

ఆనంద్ అఖాడా: ఇది కూడా కాశీలోనే ఉంది. వీరి ఇష్టదైవం సూర్యభగవానుడు.

ఆహ్వాన్ అఖాడా : ఇది కాశీలోని దశాశ్వమేధ్ ఘాట్ వద్ద ఉన్నది. గణపతి వీరి ఇష్టదైవం. ఇందులో సుమారు 12,000 మంది సాధువులున్నారు. ఇందులో కూడా




పంచాగ్ని అఖాడా : ఇది కాశీలో ఉంది. ఇందులో కూడా అగ్నిని, గాయత్రీదేవిని పూజిస్తారు. సుమారు 3,000 మంది సాధువులున్నారు.

దిగంబర అఖాడా: వీరి ఇష్టదైవం బాలానందస్వామి. ఇందులో మహిళలు ఉండరు.

నిర్మోహీ అఖాడా: రామానందాచార్య దీనిని స్థాపించారు. హనుమంతుడు వీరి ఇష్టదైవం. ఇందులో సుమారు 15,000 మంది సాధువులున్నారు.

నిర్వాణీ అఖాడా: వీరి కార్యాలయం అయోధ్యలో ఉంది. ఇష్టదైవం

మేళా అంటారు. 6 సంవ త్సరాలకు ఒక్కసారి జరిగే కుంభమేళాని అర్ధకుంభమేళ అని, 12 సంవత్సరాలకు ఒకసారి జరిగేదాన్ని పూర్ణ కుంభమేళ అంటారు. 12 పూర్ణ కుంభమేళాలు 12x12=144 ఏళ్లకోసారి చేసే కుంభమేళాని మహాకుంభ మేళా అంటారు. 2025 లో మరల పూర్ణ కుంభమేళా జరగనుంది. అలాగే ప్రతి సంవత్సరము కొన్ని పుణ్య నదులకు పుష్కరాలు వస్తాయి. గురుడు ఏ రాశిలో ప్రవేశిస్తే ఆ నదికి పుష్కరం వస్తుంది. పుష్కరం అంటే 12 సంవత్సరాలు అని అర్థం. ఈసారి గురుడు ధను రాశిలో ప్రవేశిస్తున్నాడు. కనుక 2019 నవంబర్ 5 మంగళ వారం నుండి బ్రహ్మపుత్ర నదికి అనగా పుష్కరవాహిని నదికి పుష్కరాలు ప్రారంభం అవుతాయి. ఇక అర్ధకుంభమేళా విషయానికి వస్తే జనవరి 15 నుండి గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో ప్రయాగ్ రాజ్ (అలహాబాద్) వద్ద జరుగుతాయి. ఈ అర్ధకుంభమేళా సందర్భంగా సామాన్యులతో పాటు ఎన్నో లక్షలమంది



హనుమంతుడు. వీరంతా ఊర్ధ్వత్రిపుండ్రం ధరించి ఉంటారు.

బల్లెంను పూజిస్తారు.

నిరంజనీ అఖాడా : వీరి ఇష్టదైవం కార్తికేయుడు. గాయత్రీదేవి, అగ్నిదేవుడు వీరి ఇష్టదైవాలు. ఇది ప్రయాగరాజ్ లోనే ఉంది. ఇందులో సుమారు 10,000 మంది సాధువులున్నారు.

మహానిర్వాణీ అఖాడా : ఇది కూడా ప్రయాగరాజ్‌లోనే ఉంది. వీరి ఇష్టదైవం కపిలముని. ఇందులో సుమారు 6,000 మంది సాధువులున్నారు. వీరికి కూడా రెండురకాల ధ్వజాలు న్నాయి.

పంచాయతీ బడాఉదాసీన్ అఖాడా: ఉదాసీన సంప్రదాయవాదులైన వీరు పంచాయతన దేవతలను పూజిస్తారు. ఇందులో 20,000 మంది సాధు వులున్నారు. కార్యాలయం ప్రయాగరాజ్‌లోనే ఉంది.

పంచాయతీ నయా ఉదాసీన్ అఖాడా : ఉదాసీన సంప్రదాయవాదులైన వీరి కార్యాలయం హరిద్వార్ లోని కనఖల్‌లో ఉంది. వీరు సుమారు 5,000 మంది ఉన్నారు. వీరు కూడా పంచాయతన దేవతలను పూజిస్తారు.

నిర్మల్ అఖాడా: సిక్కు సంప్రదాయంతో ముడివడిన ఈ అఖాడాను గురుగోవింద్ సింగ్ మిత్రుడైన వీరసింహుడు స్థాపించాడు. ఇది హరిద్వార్‌లో ఉంది. ఇందులో మహిళా సాధువులుండరు. వీరు గురుగ్రంథ్ సాహెబ్‌ని పూజిస్తారు.

మంచి మార్పునకు సంకేతం సంక్రాంతి

సంక్రాంతి ఒకటి కాదు. 12. సంక్రాంతికి మార్పు అన్న అర్థం తీసుకుంటే సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశిలోకి మారినప్పుడల్లా సంక్రాంతి అవుతుంది. 12 రాశులు కనుక 12 సంక్రాంతులు వస్తాయి.

మనకు ఉన్న పండుగలలో పెద్ద పండగగా పేరున్నది సంక్రాంతి. ప్రకృతిలో త ద్వారా మానవుల జీవన పరిస్థితిలో వాతావరణపరంగా మంచి మార్పునకు నాంది సంక్రాంతి. అంతేకాక ఇకపై వచ్చేది ఉత్తరాయన పుణ్యకాలం. ఉత్తరాయనంలో సూర్యుని శక్తి పెరగడం వల్ల ఇబ్బందులు ఉన్నా కొన్ని రకాల క్రిమి కీటకాల బాధ తప్పుతుంది. జలుబు , ఉబ్బసం వంటివి అంతగా బాధించవు. కనుక ఇది మంచి రోజులు వచ్చే కాలం. అందుచేత ఈ సంక్రమణాన్ని మంచి మార్పునకు సంకేతంగా భావించవచ్చు. అయితే సంక్రాంతి ఒకటి కాదు. 12. సంక్రాంతికి మార్పు అన్న అర్థం తీసుకుంటే సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశిలోకి మారినప్పుడల్లా సంక్రాంతి



అవుతుంది. 12 రాశులు కనుక 12 సంక్రాంతులు వస్తాయి.

సూర్యుడు కర్కాటక రాశిలో చేరినపుడు దక్షిణాయన పుణ్య కాలం, మకర రాశిలోకి ప్రవేశించినపుడు ఉత్తరాయన పుణ్యకాలం అని అంటారు. అలాగే మేష, తుల రాశులలో చేరినపుడు విషువ పుణ్యకాలం అంటారు. ధన, మీనరాశులలో చేరినపుడు విష్ణు పద పుణ్యకాలం అని, సింహ, కుంభ రాశులలో చేరినపుడు ప్రహర పుణ్యకాలం అని శాస్త్రం చెబుతోంది. అయితే అయనాలు మారే కర్కా టక, మకర సంక్రాంతులే ఎక్కువగా ప్రచారంలో ఉన్నాయి. ఆయా సంక్రమణాలలో దేవతారాధన, దాన, జపాలు చేయాలని శాస్త్ర నిర్దేశం. ఇపుడు వచ్చిన మకర సంక్రమణ సమయంలో పుణ్యనదుల్లో స్నానం, దానం, జపం, హోమం వంటివి చేయాలి. ఈ రోజున పితృదేవతలకు తర్పణాలు చేస్తారు.

ఈ సమయంలో చేసిన ప్రతి పని లక్షరెట్ల అధిక ఫలితాన్ని ఇస్తుం దని శాస్త్రం చెబుతోంది. దానాల విషయానికి వస్తే వస్త్రదానం ఉత్తమం. మకర సంక్రాంతి నాడు మనం దానం చేసే వస్త్రంలో ఎన్ని దారాలు ఉన్నాయో అన్ని వేల సంవత్సరాలు మనకు స్వర్గవాసం కలుగుతుందని పురాణాలు పేర్కొం టున్నాయని



పండితులు చెబుతున్నారు. సంక్రాంతి ఒక పుణ్యకాలం అని చెప్పు కున్నాము. అయితే పుణ్యకాలాలు ఇంకా ఉన్నాయి.

అవి అమ్మవారికి ఇష్టమైన పౌర్ణమి, అమావాస్య, దసరా, దీపా వళి, సంవత్సరాది, గ్రహణాలు. ఈ సమయాలలో చేసే పుణ్యకర్మలు విశేష ఫలదాలు.

మకర సంక్రాం తి నాడు తిలదానం కూడా అత్యంత ప్రశస్తం. కొన్ని ప్రాంతాల్లో ఈ రోజున నువ్వులు బెల్లంతో చేసిన వంటకాలను తింటారు. అందువల్లనే ఈ సంక్రాంతిని తిల సంక్రాంతి అని కూడా అనడం ఉంది.

- అశోక్

దిన ఫలాలు

మేష రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయవృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/ సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్య పరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కొగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభ వ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: ఋణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్యరీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



శరీరంలో అతి పెద్ద అవయవం చర్మం. ఈ చర్మాన్ని నిర్లక్ష్యం చేస్తే వృద్ధాప్యం తరుముకొస్తుంది. ప్రతీజీవికి వృద్ధాప్యం అనివార్యం. వయసు మీద పడ్డతర్వాత అద్దంలో చూసుకుంటూ బాధపడేకంటే జాగ్రత్తపడటం ఎంతైనా మంచిది. వ్యక్తిగత క్రమశిక్షణ, ఆహారపుటలవాట్ల వల్ల యవ్వనాన్ని కాపాడుకోవచ్చు.

నవ యవ్వనానికి అడుగేయాలి



మీ వయస్సుని హోల్డ్‌లో ఉంచాలనుకుంటున్నారా? మళ్లీ నవయవ్వనం తొణికిసలాడాలంటే అతి సులభమైన స్టెప్స్ పాటిస్తే చాలు. యంగ్ లుక్స్ అదరహో అనిపించవచ్చు అంటున్నారు ప్రముఖ కాస్మోటాలజిస్ట్ డాక్టర్ మాధవి పూడి.

నో స్మోకింగ్

నిత్యయవ్వనం కోసం పరితపించే వాళ్లు మన సమాజంలో కోకొల్లలు. అయితే ఇది ఒక రాత్రికి రాత్రి జరిగే పనికాదు. రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు మెయిన్‌టైన్ చేస్తే సాధ్యం. దీర్ఘకాలంలో ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే









తక్షణం తీసుకునే నిర్ణయాలలో సిగరెట్ స్మోకింగ్ త్యజించడం ప్రధానమైంది. సిగరెట్ తాగడం వల్ల అతని ఆరోగ్యంతో బాటు పక్కవారి ఆరోగ్యం కూడా దెబ్బతీస్తుంది. గుండె, ఊపిరితిత్తులు వంటి అవయవాలు దెబ్బతింటాయి. చర్మం మీద ముడతలు పడతాయి. సిగరెట్ తాగడం వల్ల చర్మ కణాలు బాగా దెబ్బతింటాయి.

ఆల్కాహాల్ వద్దు

మద్యపానానికి బానిస కాకుండా పరిమితంగానే ఆల్కాహాల్ తీసుకుంటే ఆరోగ్యానికి ఉపయోగకరం. ఆల్కాహాల్ వల్ల మన శరీరంలోని ప్రతీ కణం దెబ్బతింటుంది. జన్యువులను దెబ్బతీస్తుంది. కాలేయం వాచిపోతుంది. మహిళలకు ఒక పెగ్గు, పురుషులకు రెండు పెగ్గుల వైన్ తీసుకుంటే మాత్రం ప్రయోజనం చేకూరవచ్చు.

ఆల్కాహాల్ తీసుకోవడం వల్ల మీ చర్మంలో ఉన్న నీటిశాతం తగ్గిపోతుంది. దీనివల్ల చర్మం ముడతలు పడుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఒకటి రెండు పెగ్గుల ఆల్కాహాల్ తీసుకుంటే నీళ్లు బాగా తగ్గాలి.

ఆహారం మితం

ఆహారాన్ని మితంగానే తీసుకోవాలి. అలాగే మాంసాహారం కంటే శాఖాహారానికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలి. రెడ్ మీట్ జోలికి వెళ్లకూడదు. పొట్టుతీయని ధాన్యం, పండ్లు, తాజా ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి. చేపలు ఎక్కువ తినాలి. సాల్మాన్ చేప చాలా మంచిది. సాల్మాన్ చేపలో కొవ్వు శాతం చాలాతక్కువగా ఉంటుంది. అంతేకాదు ఒమేగా-3 పుష్కలంగా ఉంటుంది. మీ శరీరంలోని కణాలు దెబ్బతినకుండా సాల్మన్ చేప కాపాడుతుంది.

మీ చర్మ పరిరక్షణకు ఆహారం కీలకపాత్ర పోషిస్తుంది. తీపిపదార్థాలు, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం, డీప్ ఫ్రై చేసిన ఆహారం మంచిది కాదు. చర్మం వదులుగా, సాగినట్లుగా తయారవ్వడానికి ఈ ఆహారమే ప్రధాన కారణం. విటమిన్స్, ఖనిజలవణాలు, ఆరోగ్యకర కొవ్వు చర్మానికి చాలా మంచిది. మంచి ఆహారం వల్ల శరీరంలో వాపులు తగ్గుతాయి. చర్మం ఆరోగ్యకరంగా తయారవుతుంది.

పొట్టుతీయని ధాన్యాలు తినడం మంచిది. పొట్టుతీసిన ధాన్యాల జోలికి వెళ్లకూడదు. రోజూప గుప్పెడు బాదం తింటే మంచిది. బాదంలో విటమిన్ ఇ ఉంటుంది. ఆలూ చిప్స్ తినడం మంచిది కాదు.

నీళ్లు తాగండి

శరీరానికి నీళ్లు చాలా మంచిది. రోజంతా మంచినీళ్లు పుష్కలంగా తాగితే చర్మంలో ఉండే మలినపదార్థాలు విసర్జించడానికి అవకాశం ఉంటుంది. ఎన్ని నీళ్లు తాగితే అంత మంచిది. శరీరంలో ఉండే విషపదార్థాలు శరీరం వెలుపలికి వెళ్లాలంటే నీళ్లు మంచిది. నీళ్లు ఎక్కువగా తాగితే అవయవాలు చక్కగా పనిచేస్తాయి. చర్మం మన శరీరంలో అతిపెద్ద అవయవం. కాబట్టి దీనికి నీళ్లు ఎక్కువగా అవసరముంటుంది. మీ చర్మం నీటిశాతం లేకపోతే ఎండిపోతుంది. ప్రతిరోజు ఎనిమిది గ్లాసుల మంచినీరు తీసుకోవడం అవసరం.

సూర్యకిరణాలు ప్రమాదం

మీరు తీసుకునే ఆహారం అతిముఖ్యం. కాబట్టి ఉదయం లేచినప్పటినుంచి రాత్రి పడుకునేవరకు ఏం ఏం తిన్నామో రాసుకోండి. పౌష్టికాహారలోపం వల్ల చాలామందికి వృద్ధాప్యం వెంటనే వచ్చేస్తుంది.

చర్మ సంరక్షణకు సూర్యరశ్మి పాత్ర కీలకంగా ఉంటుంది. వేకువజామున సూర్యరశ్మికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ వేసవికాలంలో మధ్యాహ్నం పూట బయటతిరగకపోవడమే మంచిది. సూర్యకిరణాలు శరీరంమీద పడకుండా సన్ స్క్రీన్ లోషన్ అప్లయ్ చేయాలి. ప్రతిరోజు సన్ స్క్రీన్ అప్లయ్ చేయడం మంచిది. అలాగే సన్‌టాన్ లోషన్ రాసుకోవాలి.

మీరు బయటికి వెళ్లదల్చుకుంటే శరీరమంతా కప్పేసుకోవాలి. భుజాలు, ఛాతి, కాళ్లు, ముఖం అంతా కప్పేసుకోవాలి.

చర్మం దెబ్బతినడానికి యువిఏ, యువిబి కిరణాలు ప్రధాన కారణం అని చెప్పొచ్చు. సూర్యుడి నుంచి వచ్చే ఈ కిరణాలు అత్యంత ప్రమాదకరమని శాస్త్రవేత్తలు నిగ్గు తేల్చారు.

ఫేషియల్ మసాజ్

కొందరు ముఖానికి మసాజ్ చేసుకోవడం అంతమంచి పద్ధతికాదు. ఈ మసాజ్ ఒకే భాగంలో పునరావృతమైతే ప్రమాదమే. మీ చర్మం తళ తళ మెరవాలంటే లోషన్స్ అప్లయ్ చేయాలి. చర్మం సహజంగా మెరవాలంటే మాయిశ్చరైజ్ చేయడం మంచిది. ఉదయం సాయంత్రం చేసుకోవడం మంచిది.

- లోషన్ క్రీమ్‌కి బదులుగా కొబ్బరినూనె వాడటం మంచిది.
- మెడ భాగంలో మాయిశ్చరైజ్ చేసుకోవడం మరవద్దు.
- మీకు డ్రై స్కిన్ ఉంటే మాత్రం ఆల్కాహాల్ ఆధారిత ఉత్పత్తులు వాడకూడదు.
- చర్మం జిడ్డుగా ఉంటే మాత్రం ఆయిల్ ఉత్తత్తుల జోలికి వెళ్లకూడదు.

వ్యాయామం

కొన్ని అధ్యయనాలు తెలియజేస్తున్నదాని ప్రకారం వ్యాయామం తప్పనిసరి. దీనివల్ల వ్యాధినిరోధక శక్తి పెరిగిపోతుంది. దీనివల్ల చర్మం మరింత నిగనిగలాడుతూ అందరినీ ఆకర్షిస్తుంది. వ్యాయామం చేయడం వల్ల నడుము చుట్టుకొలత తగ్గడానికి అవకాశం ఉంటుంది. అధిక కొవ్వు కరిగిపోతుంది. దీనివల్ల కండరాలు తగ్గిపోతాయి. చర్మం కూడా ఆరోగ్యంగా కనిపిస్తుంది. శారీరక వ్యాయామం వల్ల రక్త ప్రసరణ అన్ని భాగాలకు అందుతుంది. రక్తకణాల ద్వారా పోషకాలు, ఆక్సిజన్ అందుతుంది. చర్మంలో కొత్త కణాలు ఏర్పడటానికి ఇవి కీలక పాత్ర వహిస్తాయి. చర్మంలోపలి కణాలను శుభ్రపరుస్తుంది.





చర్మం శుభ్రం

చర్మం ద్వారా ఆరోగ్యమే కాదు అందాన్ని ఇనుమడింజేయవ్చని తెలుస్తోంది. మీ చర్మాన్ని శుభ్రంగా కడుక్కోండి. కాలుష్య రహిత ప్రాంతాల్లో ఉండాలి. బట్టలు ఎప్పటికప్పుడు ఉతికి ఆరేసుకోవాలి. దీనివల్ల తాజా బట్టలు వేసుకోవచ్చు.

ప్రతిరోజుకు రెండుసార్లు సబ్బుతో కడుక్కోవాలి. కాలుష్యం, మేకప్ లేకుండానే చర్మ సౌందర్యాన్ని పెంపొందిచుకోవచ్చు. సబ్బుతో కడుక్కోవడం వల్ల ముఖం మీద దుమ్ముధూళివంటివి లేకుండా జాగ్రత్తపడొచ్చు. హెల్మెట్ వంటివి చర్మ సంరక్షణను దెబ్బతీస్తాయి.

ముఖాన్ని శుభ్రంగా కడుక్కోవాలి

ప్రతిరోజు ఒకటి రెండుసార్లు ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ముఖం మీద జిడ్డు, దుమ్ము, ధూళి తొలగిపోవాలి. దీనివల్ల బ్యాక్టీరియా వచ్చే ప్రమాదముంది. ఏదిపడితే ఆ ఆయిల్ ముఖానికి రాసుకోవద్దు. వెచ్చటినీటితో ముఖాన్ని శుభ్రంగా కడుక్కోవాలి. రాత్రి పడుకునే ముందు ఉదయం శుభ్రంగా కడుక్కోవాలి.

వయసు మీద పడుతున్న కొద్దీ చర్మం నుంచి నూనె తక్కువగా విడుదలవుతుంది. ఈ సమయంలోనే రెండుసార్లకు మించి ముఖాన్ని శుభ్రం చేసుకుంటే చాలా ప్రమాదకరం.

ఫేషియల్ మాయిశ్చరైజర్ ప్రతిరోజు అప్లయ్ చేసుకోవాలి. స్కిన్ కేర్ ప్రొడక్టుల జోలికి వెళ్లకూడదు.

జీవనశైలి మార్పులతో వృద్ధాప్యాన్ని దరిచేరకుండా జాగ్రత్తపడవచ్చు.

ఒత్తిడిని జయించండి

మీరు ఒత్తిడికి గురికావడం వల్ల లేదా ఆందోళనకరంగా ఉండటం వల్ల వయసు పెరిగినట్లు అనిపిస్తుంది. ఒత్తిడి వల్ల కార్టిసాల్ హార్మోన్ ప్రభావితమౌతుంది. ఈ హార్మోన్ వల్ల శరీరం ఎరుపువర్ణంలోకి మారిపో తుంది. మంట, దురద ఉంటుం ది. ఒత్తిడిని జయించడానికి అనేక మార్గాలున్నాయి. యోగా, ప్రాణాయా మం వంటివి చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించడానికి అవకాశం ఉంది. ఒత్తిడి తగ్గాలంతే ఆరెంజ్, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి.

నిద్ర

నిద్ర. మనిషికి రోజుకి ఆరునుంచి ఎనిమిది గంటల గాఢనిద్ర ఆరోగ్యాన్ని చేకూర్చడానికి కీలకపాత్ర పోషిస్తుంది.

నిదలేమి వల్ల వృద్ధాప్యం త్వరగా వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్యకరంగా ఉండటానికి, చర్మం నిగనిగ మెరవాలంటే మంచి నిద్ర అవసరం. మీకు మంచి నిద్ర రావాలంటే స్మార్ట్‌ఫోన్ పక్కన పెట్టేయాలి. లాప్‌టాప్, టీవీలకు దూరంగా ఉండాలి. పడుకోవడానికి గంట ముందే ఎలక్ట్రానిక్ పరికరాల జోలికి వెళ్లకూడదు. కళ్లకు బ్లూ స్క్రీన్ కళ్లకు మంచిది కాదు. బ్లూ స్క్రీన్ వల్ల నిద్రాభంగం కలిగించే అవకాశం ఉంది. పడుకునే ముందు రిలాక్స్‌గా ఉండాలి. వేడినీళ్ల స్నానం చేయాలి. వేడినీళ్ల స్నానం వల్ల శరీరంలో ఉండే నొప్పులు హరించుకుపోతాయి. రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది.



డాక్టర్ మాధవి
స్కిన్ హెయిర్ అండ్ లేజర్ క్లినిక్
హైదరాబాద్
9642659757

వెన్ను నొప్పికి పంచకర్మ చికిత్స

ఈ మధ్య చాలామందినివేధిస్తున్న సమస్య మెడ, నడుము నొప్పి. వెన్ను నొప్పి సమస్యలు ఉన్నవారికి ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. అవేంటో తెలుసుకుందాం. ఒక్కో వ్యక్తికి ఒక్కో రకంగా ఉంటుంది. నడుము నొప్పి ఎక్కువగా నడుమునుంచే ప్రారంభమౌతుంది. మెల్లిగా తొడల్లోకి నొప్పి చేరుకుంటుంది. ఇక్కడి నుంచి పిక్కలలో నొప్పి పాకుతుంది. దీన్ని సయాటికా అని కూడా అనుకోవచ్చు. ఒక్కసారిగా ఎవరో కొట్టినట్లు అనిపిస్తుంది.

వ్యాయామం లేకపోవడం వల్ల ఇటువంటి సమస్య వచ్చే అవకాశం ఉంది. శారీరక శ్రమతగ్గడం వల్ల నడుము నొప్పి సమస్య ఎక్కువవుతున్నట్లు ఒక అధ్యయనంలో తేలింది.

ఎక్కువ సమయం ఒకే భంగిమలో కూర్చోవడం, నిలబడడం, బరువు లేపడం, ఎక్కువగా ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేయడం, స్థూలకాయం, ఎముకలలో కాల్షియం తగ్గడం మూలాన, వెన్నుపూసల మధ్య ఉన్నకార్టిలేజ్‌లో వచ్చే మార్పులు, వెన్నుపూసల మధ్య డిస్కులు పక్కకు జారడం, వెన్నుపాము నొక్కుకుపోవడం సయాటికా అతి ప్రధాన లక్షణం. వయసు రీత్యా కూడా డిస్కులు దెబ్బతింటాయి. నడుము భాగంలో ఉండే వెన్ను పూసను లంబార్ వర్టిబ్రే అంటారు. వీటి మధ్యలో మృదులాస్తితో తయారైన డిస్కులు ఉంటాయి ఇవి. వెన్నుపూసలను తేలికగా కదలడానికి, వంగడానికి నిలబడటానికి సహాయపడతాయి.



నిర్ధారణ

ఎక్స్‌రే, సీటీస్కాన్, ఎంఆర్ఐ చేస్తారు. మెడ భాగంలోని సి-3, సి-4, సి-5, సి-6, సి6- సి7తో బాటు నడుము భాగంలో ఎల్2-ఎల్3, ఎల్3- ఎల్4- ఎల్-5, ఎల్5- ఎస్1 మొదలగు డిస్కులు దెబ్బతినడం కనిపిస్తుంది.

ఆయుర్వేద చికిత్స

మెడ నొప్పి, నడుము నొప్పి సమస్యలకు ఆయుర్వేద శాస్త్రంలో సమగ్రమైన చికిత్సా పద్ధతులున్నాయి. ఇందులో రోగ తీవ్రతను బట్టి రోగి యొక్క బలాన్ని బట్టి వైద్య విధానం ఆధారపడి ఉంటుంది. ఆయుర్వేద దృష్టిలో ఈ సమస్యలు కఫం, పిత్త, వాతం పెరగడం వల్ల వస్తాయి. ఆయుర్వేద పంచకర్మ చికిత్సల ద్వారా ప్రకోపించిన దోషాలను సమస్థితిలో తెచ్చి శరీర శుద్ధిని, అగ్నిబలాన్ని పెంపొందించవచ్చు.

డాక్టర్ జి. క్రాంతికుమార్
ఆయుర్వేద వైద్య నిపుణులు
కేరళ ఆయుర్వేద
పంచకర్మ సెంటర్
హైదరాబాద్
9494675168



హిమోగ్లోబిన్ తగ్గితే ప్రాణాంతకం

హిమోగ్లోబిన్ ఎర్రరక్తకణాల్లో ఉంటుంది. ఐరన్‌ని మోసుకురావడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. శరీరంలో ఐరన్ ఉండటం వల్లే ఆక్సిజన్ నిలకడగా ఉంటుంది. రక్తంలో హిమోగ్లోబిన్ ఆవశ్యకత ఎంతైనా ఉంది. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గితే ప్రమాదకరమని గ్రహించాలి. హిమోగ్లోబిన్ లేనట్లయితే రక్తంలో ఆక్సిజన్ సరిపడినంత చేరదు.


పెద్దల్లో హిమోగ్లోబిన్ స్థాయి ఏ విధంగా ఉండాలో తెలుసుకుంటే మంచిది. పురుషులు, స్త్రీలకు కొద్ది తేడా ఉంటుంది. మహిళలకయితే 12.5 నుంచి 15.5 గ్రాములు ఒక డెసిలీటర్లకు ఉండాలి. పురుషులకు అయితే 13.5 నుంచి 17.5 గ్రాములు ఒక డెసిలీటర్లరే ఉండాలి.

ఐరన్ తక్కువగా ఉండటం వల్లే హిమోగ్లోబిన్ నిల్వలు బాగా తగ్గిపోతాయి. పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది.

హిమోగ్లోబిన్ ఎక్కువగా ఉంటే పుట్టుకతో గుండె సంబంధ వ్యాధులు ఉన్నవారికి, అతిసారం, కిడ్నీ ట్యూమర్స్, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

తక్కువగా ఉంటే బోన్ మారో డిసార్డర్స్, కిడ్నీ ఫెయిల్యూర్, యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ వంటి సమస్యలు ఎదురౌతాయి.


హిమోగ్లోబిన్ తక్కువగా ఉంటే తీవ్ర రక్త స్రావం అవుతుంది. విటమిన్ బి 12 వల్ల ఈ సమస్య వాటిల్లుతుంది.



అమెరికాలో అనుష్క సినిమా



అనుష్క నటించే కొత్త చిత్రానికి ముహూర్తం కుదిరింది. మాధవన్, అంజలి, షాలిని పాండేతో కలిసి నటిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పోరేషన్ సంయుక్తంగా బహుభాషల్లో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. తెలుగు, తమిళ, హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులతో నిర్మాణం అవుతున్న తొలి క్రాస్ ఓవర్ చిత్రమని చిత్రబృందం తెలిపింది. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహిస్తున్నారు. కోన వెంకట్, గోపి సుందర్, షనీల్ డియో, గోపి మోహన్, నీరజ కోన సాంకేతిక నిపుణులు. మార్చి నెలలో ఈ చిత్రం షూటింగ్ అమెరికాలో ప్రారంభిస్తామని, ఈ ఏడాది ద్వితీయార్థంలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాణ సంస్థ అధినేతలు టి.జి.విశ్వప్రసాద్, కోన వెంకట్ తెలిపారు.



కీర్తిసురేష్

సినిమాల్లోకి వస్తానని అనుకోలేదు

ఏ గూటి చిలుక ఆ గూటి పలుకులనే పలుకుతుందని అంటుంటారు. ఈ కోవలోనే పెద్ద వాళ్లు ఏ రంగంలో పైకి వస్తారో...సాధారణంగా అదేరంగంలో రాణించాలని చాలా మంది కోరుకోవడం చూస్తున్నదే. ఇక సినీరంగంలో గుర్తింపు పొందిన నటీనటులు, సాంకేతిక నిపుణుల పిల్లలు కూడా ఎంతోమంది ఆ రంగంలోనే పేరు పొందాలని కాంక్షించడం తెలియంది కాదు. అయితే అందాల భామ కీర్తిసురేష్ మాత్రం మొదట్లో ఇందుకు భిన్నంగానే ఆలోచించారట. తన తల్లి మేనక నటిగా, తండ్రి సురేష్‌కుమార్ నిర్మాతగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నప్పటికీ సినీరంగంలోకి రావాలని కీర్తిసురేష్ కోరుకోలేదట. ఇదే విషయం గురించి ఆమె వివరిస్తూ...నేను హీరోయిన్ కావాలని ఎప్పుడూ ఆలోచించలేదు...కోరుకోలేదు. చదువు పూర్తయిన తర్వాత మోడలింగ్ చేశా. దాని తర్వాత ఓ మలయాళ సినిమాలో అవకాశం వచ్చింది. దాంతో నటించాలా? అవసరం లేదా? అన్న మీమాంసలో పడ్డాను. నా శ్రేయోభిలాషులు, పేరెంట్స్ నటించమని ప్రోత్సహించారు. అలా వారందరికి సూచన మేరకు నటించాను. ఆ తర్వాత తమిళ, తెలుగు సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. నటిగా మంచి గుర్తింపు రావడంతో ఇక వెనుదిరిగే అవకాశమే లేకుండా పోయింది. ఇప్పుడు నా ముందున్న కర్తవ్యం మంచి పాత్రలతో,,.మంచి చిత్రాలతో పదికాలాల పాటు ప్రేక్షకుల హృదయాలలో నిలిచిపోవాలనుకుంటున్నాను అని చెప్పుకొచ్చింది. మహానటి చిత్రంతో పాటు తమిళంలో సామి స్కైర్, సర్కార్ వంటి చిత్రాలు ఆమెకు నటిగా మంచి పేరు తెచ్చిపెట్టాయి. తెలుగులో అంతకుముందు ఆమె నటించిన నేను శైలజ సినిమా కూడా అందరినీ ఆకట్టుకునేలా చేసింది. ప్రస్తుతం చేతినిండా చిత్రాలతో బిజీగా ఉన్న ఆమె తమిళంలో అధిక చిత్రాలను చేస్తోంది.

మార్చి ఒకటిన ఏబీసీడీ

అల్లు శిరీష్, రుక్సార్ థిల్లాన్ జంటగా నటిస్తున్న 'ఏబీసీడీ' చిత్రం మార్చి ఒకటవ తేదీన విడుదలకానుంది. సీనియర్ నిర్మాత డి.సురేష్‌బాబు ఈ చిత్రానికి సమర్పకులు. అల్లు శిరీష్‌కు తండ్రిగా నాగబాబు నటిస్తున్నారు. హీరో స్నేహితునిగా భరత్ నటిస్తున్నాడు. ఈ చిత్రం ద్వారా సంజీవ్ రెడ్డి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. బిగ్ బెన్ సినిమాస్ యశ్. రంగినేనితో కలిసి మధుర శ్రీధర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జుధా సాంధీ సంగీతం అందిస్తున్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ ''మలయాళంలో సూపర్ హిట్ అయిన ఏబీసీడీ చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో నిర్మిస్తున్నాం. దుల్కర్ పోషించిన పాత్రని అల్లు శిరీష్ చేస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా మార్చి 1న సినిమాను విడుదల చేయబోతున్నాం. కృష్ణార్జున యుద్ధం ఫేమ్ రుక్సార్ థిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తోంది'' అని చెప్పారు.



అల్లు శిరీష్

సందీప్ కిషన్ కొత్త సినిమా



ఇటీవలే విడుదలైన 'సుబ్రహ్మణ్యపురం' కొత్త తరహా సినిమాగా పలువురిని ఆకట్టుకుంది. ఈ చిత్రం ద్వారా సంతోష్ జాగర్లపూడి దర్శకునిగా పరిచయం అయ్యారు. ఆయన తన తదుపరి చిత్రాన్ని క్రీడా నేపథ్యంలో చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ''భారతంలో తన బొమ్మను గురువుగా భావించి విద్య నేర్చుకున్న ఏకలవ్యుడి నుండి బొటనవేలు గురు దక్షిణగా తీసుకున్నాడు ద్రోణాచార్యుడు. ఈ ఆధునికకాలంలో కూడా అలాంటి ఒక గురువు ఎలాంటి గురుదక్షిణ కోరాడు అనే ఆసక్తి కలిగించే కథాంశంతో తన తాజా చిత్రం ఉంటుందని'' సంతోష్ జాగర్లపూడి తెలిపారు. వెంకట్ శ్రీనివాస్ బొగ్గరమ్ నిర్మించే ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటించనున్నారు. ఈ సినిమాకు సంబంధించి మిగతా వివరాలు తెలియాల్సి ఉంది.

పాత్రికేయ ముద్ర

నిఖిల్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రం 'ముద్ర'. టి.ఎస్. సంతోష్ దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. వాస్తవిక సంఘటనల జర్నలిజం నేపథ్యంలో రూపొందిస్తున్నారు. గ్రాఫిక్ వర్క్ కూడా ఉంది. ఈ చిత్రం చిత్రీకరణ చివరిదశకు చేరుకుంది. షూటింగ్‌తో పాటుగా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా పూర్తిచేస్తున్నారు. జర్నలిస్ట్ పాత్రలో నిఖిల్ కనిపిస్తాడు. ఇప్పటికే ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. టీజర్ త్వరలోనే రానుంది. శ్యామ్ సిఎస్ సంగీతం అందిస్తున్నారు. ఇతర పాత్రల్లో వెన్నెల కిషోర్, పోసాని కృష్ణమురళి, నాగినీడు. ప్రగతి నటిస్తున్నారు. కావ్య వేణుగోపాల్, రాజు కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని బి.మధు సమర్పిస్తున్నారు.



లావణ్య త్రిపాఠి, నిఖిల్

ప్రయోగంలా భావించి తీస్తున్నాం



అశ్విని, ధ్రువ

సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్న చిరం 'యమ్ 6'. విశ్వనాథ్ తన్నీరు నిర్మిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేశారు. ''నిర్మాణపరంగా రాజీపడకుండా తీసినట్టు నిర్మాత చెప్పారు. ప్రేక్షకులను థ్రిల్ చేసే కథని దర్శకుడు జైరాం అద్భుతంగా తెరకెక్కించారని'' అన్నారు. ''ప్రతి ఒక్కరికి నచ్చుతుందని, ఫిబ్రవరి మొదటివారంలో సినిమాను విడుదల చేస్తామని'' ఆయన తెలిపారు.

దర్శకుడు మాట్లాడుతూ ''చిత్రీకరణ సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. ఇందులో పోరాట దృశ్యాలు మన కళ్ళముందే జరుగుతున్నట్టుగా కనిపిస్తాయి. ఈ తరహా సినిమాలు ఇతర భాషల్లో ఎక్కువగా వచ్చేవి. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ తరహా సినిమాలను ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఒక ప్రయోగంలా భావించి తెరకెక్కించడం జరిగింది'' అని అన్నారు. ఒక మంచి చిత్రం ద్వారా పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉంది అని హీరో ధ్రువ తెలిపారు. ధ్రువ, అశ్విని, శ్రావణి, సాధన, హరిత, వంశీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజీ, ఛాయాగ్రహణం: మహ్మద్ రియాజ్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: జైరామ్ వర్మ.

అక్కడొకడుంటాడు... లెక్కగడుతుంటాడు

శివ కంఠంనేని టైటిల్ పాత్రలో రూపొందిన చిత్రం అక్కడొకడుంటాడు. ఇతర ప్రధాన పాత్రలలో అల్లరి రవిబాబు, వినోద్‌కుమార్, ఇంద్రజ నటించగా...హీరోహీరోయిన్లుగా రామ్‌కార్తీక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక నటించారు. శ్రీపాద విశ్వక్ దర్శకత్వం వహించారు. లైట్‌హౌస్ సినీమ్యాజిక్ పతాకంపై కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తిచేసుకుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హీరో నాగశౌర్య ఆవిష్కరించగా... చిత్రంలోని ఆడి పాడి గడిపేద్దాం...అంటూ సాగే పాటను ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు విడుదలచేశారు. ఈ సందర్భంగా కె.ఎస్.రామారావు మాట్లాడుతూ, ట్రైలర్‌తో పాటు విడుదలైన పాట చాలా బావున్నాయని అన్నారు. చిత్రం ప్రేక్షకుల ఆదరణ చూరగొనాలని కోరుకుంటూ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందజేశారు. హీరో నాగశౌర్య మాట్లాడుతూ, సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్‌తో పాటు పోస్టర్స్ చాలా ఆకట్టుకుంటున్నాయని అన్నారు. టైటిల్ పాత్రధారి శివ కంఠంనేని తన పాత్రలో ఎంతోబాగా ఒదిగిపోయారని అన్నారు.

టైటిల్ పాత్రధారి శివ కంఠంనేని మాట్లాడుతూ, డ్రంకన్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలను ఈ చిత్రంలో చూపిస్తున్నామని, అనుక్షణం ఉత్కంఠను కలిగించేలా ఉంటుందని అన్నారు. అక్కడొకడుంటాడు...లెక్కగడుతుంటాడు అన్న కాన్సెప్ట్‌తో చిత్రం సాగుతుందని చెప్పారు.

నిర్మాతలలో ఒకరైన రావుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, త్వరలోనే అన్ని పాటలున్న ఆడియోను విడుదలచేస్తామని, ఇదే నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తామని చెప్పారు. దర్శకుడు శ్రీపాద విశ్వక్ మాట్లాడుతూ, అనుకోని ఆపదలో చిక్కుకున్న ప్రేమ జంటకు స్నేహితుల సహాయం అందే సమయంలో మరో ప్రమాదం ఎదురువుతుంది. దాని నుంచి ఆ ప్రేమ జంట ఎలా బయటపడిందన్నదే చిత్ర ప్రధానాంశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోహీరోయిన్లతో పాటు పలువురు చిత్రబృందం పాల్గొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎన్.రాజశేఖరన్, సంగీతం: సార్క్స, సహ నిర్మాతలు: జి.రాంబాబు యాదవ్, ఎన్.వి.గోపాలరావు, కె.శ్రీధర్‌రెడ్డి.



అక్షర ఆయుధం

నందితాశ్వేత ప్రధాన పాత్రలో నటిస్తున్న 'అక్షర' సినిమా మోషన్ పోస్టర్ విడుదల చేశారు. ప్రస్తుత సమాజంలో విద్యకు మించిన వ్యాపారం లేదనే మా ఎక్కువగా వినిపిస్తోంది. కానీ సమాజాన్ని మార్చే ఆయుధం కూడా విధ్య అనే విషయాన్ని అంతా అంగీకరిస్తారు. అక్షర ప్రయాణం ఎలా ఉండబోతోంది అనే ఆలోచనలకు ఈ మోషన్ పోస్టర్ అద్దం పడుతుంది అని చిత్ర బృందం తెలిపింది.

చిత్ర దర్శకుడు బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ ''విద్యావ్యవస్థ వ్యాపారంలా మారింది. అలాంటి వ్యవస్థపై చేసే పోరాటం వినూత్నంగా ఉంటుంది. నందిత శ్వేత అక్షర పాత్రకు ప్రాణం పోసింది. ఆమె కెరీర్‌లో ఉత్తమ పాత్రగా నిలుస్తుందనే నమ్మకం ఉంది. తొలి షెడ్యూల్ పూర్తిచేశాం. సమ్మర్‌లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం'' అని చెప్పారు.

''మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన వస్తోందని'' చిత్ర నిర్మాతలు తెలిపారు. ''వ్యాపారంలా మారిన విద్యా వ్యవస్థలో మార్పు తెచ్చేందుకు చేసిన ప్రయత్నమే ఈ చిత్రం'' అని వారు పేర్కొన్నారు.

నందితా శ్వేత, సత్య అభినవ్, శ్రీ తేజ్, అజయ్ ఘోష్, స్వరూప్, శ్రీకాంత్ అయ్యర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, రచన, దర్శకత్వం :బి.చిన్నికృష్ణ



నందితాశ్వేత

దర్శకుడు కట్టా రంగారావు కన్నుమూత



సీనియర్ దర్శకుడు కట్టా రంగారావు కన్నుమూశారు. ఆయన వయస్సు 62 సంవత్సరాలు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. 'ఇంద్రధనుస్సు' చిత్రంతో దర్శకునిగా మారిన కట్టా రంగారావు ఆ తర్వాత 'ఉద్యమం', 'అలెగ్జాండర్', 'నమస్తే అన్నా', 'బొబ్బిలి బుల్లోడు', 'చెప్పుకోండి చూద్దాం' చిత్రాలను రూపొందించారు. దర్శకునిగా విలువలకు కట్టుబడి ఉన్నారు. దర్శకుల సంఘంలో పలు కీలక బాధ్యతలను నిర్వహించారు. సూర్యాపేట జిల్లాలోని మేడారం గ్రామంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

రంగారావు మృతి పట్ల దర్శకుల సంఘం తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. సంఘం నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొనేవారని కొనియాడింది. పలువురు సినీ ప్రముఖులు సైతం ఆయనకు సంతాపం ప్రకటించారు.